# ర్షిజీవితకథామృతము

చీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు]

*

## నాలుగవ భాగము

*

OFFICE OF THE REGISTRAR OF BOOKS
4 - NOV 1953
ANDHRA GOVERNMENT

*

గ్రంథకర్త

లుసు వేంకటేశ్వరులు బి. ఏ.

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## [ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవితచరిత్రలు]

నాలుగవ భాగము

*

పీఠికాకర్త:

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు.

*


గ్రంథకర్త:

విద్వాన్

బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.,

పి. ఆర్. కాలేజీ,

రామారావుపేట, కాకినాడ.



1953

తొలికూర్పు : విజయ నిజవైశాఖ పూర్ణిమ : బుద్ధజయంతి.

*

బులుసు వేంకటేశ్వరులు బి.ఏ.,

ప్రతులకు: * గ్రంథకర్త: రామారావుపేట: కాకినాడ.

శ్రీ శార్జ్ఞ ప్రెస్‌న ముద్రితము.

# విషయసూచిక.


i అంకితము
ii పీఠిక
iii విజ్ఞాపనము
iv అభిప్రాయములు

1. జైమినిమహర్షి 1
జైమిని: సామవేదప్రచారము 3
జైమిని మార్కండేయునిదర్శించుట 5
జైమిని ధర్మపక్షులకడ సందేహములు తీర్చుకొనుట 11
జైమిని భారతము 11
జైమినీయదర్శనము 12
ప్రత్యక్షము 14
అనుమానము 15
ఉపమానము 15
శాబ్దము 16
అర్థాపత్తి 16
అభావము 16
పూర్వమీమాంసా సూత్రములు 17
జైమినీయ గ్రంథములు 19
2. దేవలమహర్షి 20
జననము 20
బాల్యము 21
దేవలుఁడు; జైగీషవ్యుఁడు 21
దేవల జైగీషవ్యసంవాదము 26
దేవలుఁడు హూహూనామగంధర్వుని శపించుట 27
దేవలుఁడు : వస్త్రోత్పత్తి 28
రంభాశాపము 29
దేవలస్మృతి 31
3. నరనారాయణమహర్షులు 33
ఇంద్రుఁడు తపోవిఘ్నము నొనరింపఁదలఁచి విఫలుఁడగుట 34
బదరికాశ్రమమున అకాలవసంతము 35
ప్రహ్లాదనరనారాయణయుద్ధము 38
నరనారాయణులు సహస్రకవచుని జంపుట 40
నారదనారాయణ సంవాదము 41
నరనారాయణులు విశాలుఁడను రాజును గనికరించుట 43
4. పిప్పలాదమహర్షి 45
జననము 45

బాల్యము 47
తపస్సు 47
క్షమ 49
వివాహము 50
వరప్రాప్తి 53
సంతానము 55
బ్రహ్మజ్ఞానబోధ 56

5. పులస్త్యమహర్షి 64
జననము 64
తపస్సు 65
వివాహము 65
పులస్త్యుఁడు తృణబిందుని యాశ్రమమునఁ దపమొనరించుట 66
పులస్త్యుని శాపము 68
తృణబిందునపుత్త్రి గర్భిణియగుట 68
విశ్రవోబ్రహ్మజననము 70
పులస్త్యబ్రహ్మ రావణుని విడిపించుట 72
పులస్త్యుఁడు పరాశరునికి వరమిచ్చుట 73
భీష్మపులస్త్యసంవాదము 75
పులస్త్యస్మృతి 77

6. బకదాల్భ్యమహర్షి. 79
జననము 79
ఉపాసన 80
తపస్సు 80
పాండవానునయము 81
చిరంజీవిత్వము 82
కృష్ణార్జునులరాక 82
విష్ణుమహిమ 87
అశ్వమేధయాగము చేయించుట 90
బకదాల్భ్యతీర్థము 92

7. మరీచిమహర్షి 95
జననము 95
వివాహము 98
సంతానము 99
మరీచిస్మృతి 101

8. మాండవ్యమహర్షి 102
తపము 102
మాండవ్యుఁడకారణ శిక్షకు గుఱి యగుట 108
మాండవ్యుఁడు కౌశికుని శపించుట 105
మాండవ్యుని విడుదల 107
యమమాండవ్యసంవాదము 109
మాండవ్యుఁడు యముని శపించుట 115
జనకరాజమాండవ్య సంవాదము 111
యుధిష్ఠిరమాండవ్య సమాగమము 118

9. ముద్గలమహర్షి 114
ముద్గలుని ఉంఛవృత్తి 115
ముద్గలుఁడు దుర్వాసుని కాతిథ్యమిచ్చుట 116

దుర్వాసుఁడు ముద్గలు ననుగ్రహించుట 117

దివ్యవిమానమున దేవదూత వచ్చుట 119

ముద్గలదేవదూతల సంవాదము 119

ముద్గలుఁడు స్వర్గముఁ దృణీకరించుట 122

ముద్గలుని కైవల్యప్రాప్తి 122

మౌద్గల్యుని కథ 123


## 10. మైత్రేయమహర్షి 125


బాల్యము 125

పరాశరుఁడు మైత్రేయునికి విష్ణుపురాణము చెప్పుట 126

మైత్రేయుఁడు ధృతరాష్ట్రదుర్యోధనులకు హితము చెప్పుట 129

మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట 130

విదురమైత్రేయ సంవాదము 131

వ్యాసమైత్రేయ సంవాదము 134


## 11. రైభ్యమహర్షి. 136


రైభ్యుని విద్యార్థిదశ 136

రైభ్యబృహస్పతి సంవాదము 138

రైభ్యుని గృహస్థాశ్రమము 141

రైభ్యభరద్వాజ వృత్తాంతము 142

వేదగీతలు 143

రైభ్యుఁడు యవక్రీతుని జంపించుట 144

రైభ్యభరద్వాజుల మరణము, పునర్జీవనము 145

రైభ్యుని తీర్థయాత్ర 146

రైభ్యసనత్కుమార సంవాదము 147

రైభ్యుఁడు మోక్షమందుట 148


## 12. రోమశమహర్షి. 149


ఇంద్రుఁడు రోమశుని ప్రార్థించుట 150

రోమశధర్మరాజ సమాగమము 151

రోమశుఁడు ధర్మజునిచేఁ దీర్థయాత్రలు చేయించుట 152

రోమశుఁడు వేదనిధిం గాపాడుట 155

దేవద్యుతికథ 157

గంధర్వకన్యకల వివాహము 159


## అనుబంధము.


దేవలనారద సంవాదము 161

దేవలుని వివాహవృత్తాంతము 164

దేవలుని కూఁతురు సువర్చలకథ 167

శౌనకనారాయణ సంవాదము 169

పిప్పలాదమోక్షశాస్త్రము 172

# అంకితము

" శ్రీగురుచరణద్వంద్వం
వందేహం నిహతనిఖిలసందేహం
భ్రాంతి గ్రహోపశాంతిం
పాంసుమయం యస్యాభసిత మాతను తే."

౧

శ్రీరమ్యగురుపదంబులు
స్మేరాననమున్ గటాక్షశీతలదృక్కుల్
కారుణ్యమయహృదబ్జము
నారత మౌఁగాక ! మన్మనఃప్రియతమముల్.

౨

గురుదేవా ! పరమేశ్వర !
వరమంత్రద్రష్టవైన బ్రహ్మర్షీ ! నా
సురుచిరకావ్యసుమంబిది
బరమం బగు భక్తి యుతము భవదంకితమౌ.

౩

బ్రహ్మర్షికావ్యసుమమున
బ్రహ్మర్షీ! పూజగొనుము భవదంకితమై
బ్రహ్మార్పణ మగు సు
బ్రహ్మణ్యా ! నాకు సకలభాగ్యము లొసఁగున్.

" దేశికవరం దయాళుం
వందేహం నిహతనిఖిలసందేహం
యచ్చరణద్వయ మద్వయ
మనుభవ ముపదిశతి తత్పదస్యార్థం."

# పీఠిక

మన పెద్దలు చదివిన చదువు లన్నియు మహర్షులు పోఁత పోసినవి. వ్యాకరణమున కొజ్జ పాణిని. తర్కమునకు గౌతముఁడు. వైశేషికమునకు కణాదుఁడు. సాంఖ్యమునకు కపిలుడు. యోగమునకు హిరణ్యగర్భుఁడు. వేదాంతమునకు బాదరాయణుఁడు. సాహిత్యమునకు భరతుఁడు.

ఇంతియకాక మననిత్యకర్మలను నైమిత్తికకర్మలను వ్యవహారములను నడపించినవారు మహర్షులు. నీతినే కాక రాజనీతిని నేర్పినవారు మహర్షులు. గృహములు రాజగృహములు పల్లెలు పత్తనములు కట్టించినవారు మహర్షులు. ఈరీతిగా మన ఐహికాముష్మికములకు మార్గదర్శులు మహర్షులు. మహర్షుల చరిత్రమే భరతవర్షచరిత్రము.

అలెగ్జాండరు చెంఘిజ్‌ఖాన్ మొదలగు అన్యదేశస్థు లడుగుపెట్టుటతో పాటు మనఋషిసంప్రదాయమున పురుగు ప్రవేశించెను. ఇయ్యెడ భగవత్సంకల్పము బలవత్తరముగాఁ గనఁబడి దానికి 'యత్ర విశ్వం భవత్యేకనీడమ్' ఫల మని తోఁచు మాట యటుండె. నాఁటఁగోలె నెయ్యెడలను కయ్యములే. ఎటఁ బట్టిన నట-మార్పు, మార్పు, మార్పు !

మన మిపుడు మనమహర్షుల చదువులను మఱచుచున్నాము, మఱచితిమి. వారు చెప్పిన ఆచారములు వేఱు; మన

ఆచారములు వేఱు. వారిపునాది ధర్మము; మనపునాది కామము. వారిచూపు ఆముష్మికమునకు సమర్థకమగు ఐహికసంపద లేక పరవైరాగ్యము; మనచూపు ఆముష్మికము నతకరించు ఐహికసమృద్ధి లేక పరమలోభము.

మనము మఱచిపోయిన మనపితామహులను శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారు వేదములనుండియు ఉపనిషత్తులనుండియు పురాణములనుండియు ప్రబంధములనుండియు పెకలించి మన యెదుటఁ బెట్టుచున్నారు. వీరి పుట్టుపూర్వోత్తరము లన్నియు మనకు తెలుపుచున్నారు. వాఙ్మయశాఖ లన్నింటియందును చేయి తిరిగిన వేంకటేశ్వరులుగారు ఈమహర్షుల చరిత్రములను రచించుటలో విశేషించి బులుసువా రనిపించిరి. బులుసు లేని యజ్ఞమును పులుసు లేనివిందును లే దని ఆంధ్రావని ఆంధ్రావళి యెఱుఁగునుగదా !

వీరీమహర్షులను మనముం దుంచిరి. వీరిని సాంగోపాంగముగా చదివి వారిపనులను ఆచరణలో పెట్టుకొని వారిసంతాన మని అనిపించుకొనుట మనవిధి.

చిరివాడ, కృష్ణా.
౧౩-౭-౫౩.

వేలూరి శివరామశాస్త్రి,
శతావధాని.

# నివేదనము

భారతవర్ష బ్రహ్మర్షులు సర్వకాలసర్వలోక భద్రంకరులు. 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అన్నది వారి పవిత్రాశయము. ఇంత విశాలహృదయులైన మహనీయులు భారతమాత గర్భశుక్తిముక్తాఫలము లని మన మెంత గర్వపడవలయును! తలఁచినకొలఁది, తఱచినకొలఁది మనమహర్షులమహోన్నత్యము అపారమహాసముద్రమువలె, అనంతాకాశమువలె, అఖండ బ్రహ్మానందమువలె అంతుపంతులు, లోఁతుపాఁతులు, మనకు దొరకనీయ కున్నది. రాగమున విరాగము, విషమున అమృతము, దుఃఖమున సుఖము, దారిద్ర్యమున మహైశ్వర్యము, నన్నిట బ్రహ్మానందము చుబ్బనచూఱలాడిన మనమహర్షులఁ దలఁచుకొన్నకొలఁది మన మెంతపరవశుల మగుచుందుమో! వారిబిడ్డలమై పుట్టియుండుటకు మన మెట్టినోములు నోచియుంటిమో! ఆహా! ధన్యుల మన్న మనమే ధన్యులము.

ఐననేమి! మనవంటి యదృష్టవంతులును లేరు. నేఁటి మనవంటి నిర్భాగ్యులును లేరు. మనమహానిధుల నొరులకుఁ జూఱయిచ్చితిమి. మేలిమి బంగారము జాఱవిడిచి ముత్తెపు బంగారమున కఱ్ఱులు సాఁచుచుంటిమి. రత్నరాసులను గాలఁదన్ని చెత్తలోని కృత్రిమరత్నముల నేఱదొరకొనుచుంటిమి. దేశస్వాతంత్ర్యముతోపాటు స్వరాష్ట్రప్రాప్తితోపాటు మనకు మనలోని దురూహములు నశింపవలయును. ఆత్మోన్నత్యమును మనము గ్రహింపవలయును. పిదప, మనము బాగుపడవలయును.

మనమహర్షుల యున్నతికిఁ బ్రధానకారణములు అ
అస్ఖలిత బ్రహ్మచర్యము, అచంచలదీక్ష, అద్వితీయ విరాగ
అహంకార మమకార వివర్జనము, అనుపమాన తపోనిరతి,
సునిశిత నియమపరిపాలనము, ఆత్మానందము మున్నగు
'నీటికొలఁది తామరచుమ్మీ' యన్నట్లు వీనిని మన మెం
యలవఱచుకొన్న నంతంత ఆత్మసౌఖ్యము ననుభవించి
సౌఖ్యముఁ గూర్పవచ్చును.

ఈయుద్దేశముతో నెంతయో కష్టించి ఋషిచరిత్రము
గూర్చితిని. ఇది నాలుగవభాగము. ఐదవభాగము సిద్ధప
చున్నది. ఈయుద్యమము సముద్రమున సేతు వెత్తుటవంటి
ఇందలి గుణలేశమునే గ్రహించి చదువరులు నన్నాశీర్వదింతు
గాక !

నేను కోరినయంతనే అవకాశముఁ గల్పించుకొని
గ్రంథమునకు పీఠిక వ్రాసియిచ్చిన శతావధాని, మహా
విద్వద్వతంసము, ఆర్షధర్మజ్ఞుఁడు, నగు శ్రీవేలూరి శివరా
శాస్త్రిచరణుని కెంతయుఁ గృతజ్ఞుఁడను. నాపై నాదరాభి
సము లుంచి యభిప్రాయము లనుగ్రహించిన అనంతక
సుబ్రహ్మణ్యశర్మలకు శ్రీమతి లీలావతికి నేను ఋణపడియున్నా
ఈగ్రంథమును సుందరముగ ముద్రించి నాపై ననురాగ
జూపుచున్న శ్రీపట్టమట్ట శేషగిరిరావుగారును నాకృతజ్ఞత
పాత్రులు.

కాకినాడ
౧౫-౭-౫౩

విధేయుఁడు,
బులుసు వేంకటేశ్వరు

# అభిప్రాయములు

1. "అనేకప్రణామములు. తమపుస్తక మందినది. సాంతముగా చదివితిని. తాము వ్రాఁతలో సిద్ధహస్తులు. విషయము చాల ఉదాత్తమైనది. కనుక, చదివి సంతోషించినాను."

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి. ౧౧-౬-౫౩.

2. "శ్రీ మహర్షి జీవితకథామృతము నాలుగవభాగము చదివితిని. శ్రుతి స్మృతీతిహాసపురాణములనుండి యనేకవిషయములు మీరు సేకరించితిరి. బహుప్రయాస లభ్యమైన యీ విజ్ఞానమును చవులొలుకు ధారాళమైన శైలిలో ఆంధ్రులకందఁజేయుచున్నందులకు మిమ్ము అభినందించుచున్నాను."

'మహోపాధ్యాయ' 'అభినవ తిక్కన'
దుర్భా సుబ్రహ్మణ్య శర్మ. నెల్లూరు. 23-6-'58.

3. "అతిశయోక్తి కాదు. ఈగ్రంథము చాల అపూర్వమైనది. ఇతర దేశభాషలలో నిట్టిగ్రంథములు వెలువడినవో లేవో చెప్పఁజాలము. కాని, తెలుఁగుభాషలో వెలసినగ్రంథములలో ఈ శ్రేణికి చెందినవానిలో ఇవే మొట్టమొదటి వని తలంతుము. ఈగ్రంథముయొక్క ఉత్కృష్టతను పాఠకలోకము గ్రహించురీతి ఎటులు వ్రాయగల మనునది ఒకసమస్యగా నేర్పడినది. గ్రంథమా చిన్నది. అందులోనివిషయములా! చాల గొప్పవి. భారతీయసంస్కృతికి విజ్ఞానమునకును చలింపని పునాదిరాళ్ళగు ఆర్యమహర్షులజీవితచరిత్రము లిందు వర్ణింపఁబడినవి.

ఈఋషులచరిత్రము నిదివఱకు మూఁడుభాగములు ప్రచురించిరి.ఇది నాలుగవభాగము.ఇంతవఱకు ఆధునికమహాపురుషుల జీవితములు, స్వీయచరిత్రలు, ఆంధ్రకవులచరిత్రలు, రాజకీయ నాయకులచరిత్రలు, గద్యరూపమున తెలుగుభాషలో వెలువడినవి.కాని,ప్రాచీనవిజ్ఞాన మని భారతదేశసంస్కృతి అని భారతదేశఆధ్యాత్మిక విద్య అని బహువిధములుగా ఏమహర్షుల పేళ్ళను ఈదినమునకుఁ గూడ హిందువులు చెప్పుకొనిగర్వించుచున్నారో అట్టిమహర్షి చంద్రుల జీవితచరిత్రలను ఎవరును ప్రచురింపలేదు. శ్రీబులుసు వేంకటేశ్వరులుగారు సమర్పించినవే మొట్టమొదటి రత్నములనిచెప్పనగును. ఈమహర్షులు ఏకాలమున ఈభారతభూమిపై జన్మించిరో సిద్ధాంతీకరించుటకు తగుఆధారములు లేవు. కొన్ని మహాయుగములకు ముం దుండియుండవచ్చును. వీరు మానవశరీరముతో ఈభూమిపై సంచరించిరా? లేదా?అని చర్చించుట అనవసరము. ఈదినము మనము జీవించియున్నామా ? లేదా ? మనతెండ్రితాతలు పుట్టియున్నారా ? లేదా ? అనునది ఎంతసత్యమో ఎంతసత్యముకాదో ఇదియును అంతే. వేదయుగమునుండి ఈదినమువఱకును ఈమహర్షులపేళ్లు భారతదేశమున నలుదెసలలోను ప్రతిధ్వనించుచున్నవి. దేశకాలమతముల కతీతమైనసత్యములను ప్రతిపాదించుఉపనిషత్తులకును, ధర్మశాస్త్రములకును ఈమహర్షులు కర్త లనుట నిర్వివాదాంశము. వారినామములతో నవి వెలుగొందుచున్నవి.

ఋషు లనినను తపోనిష్ఠులనినను కొందఱికి లేనిపోని అభిప్రాయము లున్నవి. మనమతములో మనకు విశ్వాసము లేకపోవుటయే దీనికి కారణము.

ఈమహర్షులు అఖండబ్రహ్మచర్యదీక్షావ్రతులు. యమ నియమాదియోగములలో క్రమశిక్షను పొంది కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములను లోఁబఱచుకొనినమహామహులు; నిరాహారులై వాయుభక్షకులై వేలకొలదిసంవత్సరములు తపము లాచరించి ప్రకృతిని వశపఱుచుకొని అతీంద్రియజ్ఞాన మార్జించుకొన్న ధీరులు; అణువులో నణువుగా తమశరీరము లలో నిమిడియున్న సూక్ష్మశక్తితో విశ్వమంతయు ఆవరించి యున్నమహాశక్తిని చూడగలిగినదివ్యపురుషులు; తపోజ్ఞానము నంతయు మానవోద్ధరణమునకు లోకకల్యాణమునకు వినియోగించిన త్యాగధనులు.

వేదములలోను, ఉపనిషత్తులలోను, ధర్మశాస్త్రముల లోను, అష్టాదశపురాణములలోను, ఇతిహాసములలోను, ఈ మహాఋషుల ప్రస్తావనలు కాననగును. సమగ్రమగు వారిజీవిత గాథ లొక్కచోఁ గానబడవు. వివిధగ్రంథములలో వివిధరీతు లుగను, సందర్భానుసారముగను సంక్షిప్తముగను నివి తెలుప బడియున్నవి. వాని నన్నింటిని శోధించి ఒకటిగా చేర్చి ప్రత్యేక జీవితచరిత్రలుగా వ్రాయుట సామాన్యమైనపని కాదు. సం పూర్ణమైన సంస్కృతభాషాజ్ఞానము అత్యవసరము. భాషాజ్ఞా నమే చాలదు. విజ్ఞానముకూడ అవసరము. అన్నిటికన్న ముఖ్య ముగ ఓపిక, పట్టుదల, పరిశోధనాదృష్టి ఎక్కువగా నుండవలె ను. ఇట్టి సంపత్తుతో వేదశాస్త్రపురాణములను ఆమూలాగ్ర ము శోధించి హిందూవిజ్ఞానమునకు ఆర్యసంస్కృతికిని బీజాం కురములు నాటిన ఈమహర్షిచంద్రులయొక్క పావనచరిత్ర

లను మంచి శైలిలో సులభమైన వచనరూపముగా తెలుగ
జలయెదుటఁ బెట్టిన శ్రీబులుసు వేంకటేశ్వరులుగారు ఎం
న్యులోకదా ! ఈఋషులచరిత్రలన్ని భాగములు చద
తర్వాత కాని వీరు కావించిన మహోత్కృష్టసేవ ప్రజలు
ర్తిగా అర్థము చేసికొనలేరు. తెలుగు మాటలాడు ప్రతి
దూస్త్రీ, పురుషుఁడు అప్పుడు కాని శ్రీవేంకటేశ్వరులుగా
ఎంతగా ఋణపడియున్నారో తమంతతాము గ్రహింపఁజా

భారతదేశమునకు సర్వసంపూర్ణస్వాతంత్ర్యము
చినతర్వాత భారతాధ్యక్షులైన డా. రాజేంద్రప్రసాదు మా
గునాయకులెల్లరు సంస్కృతవిజ్ఞానమును ప్రాచీనసంస్కృ
పునరుద్ధరింపవలె నని చెప్పుచున్నారు. మనదేశముయొక్క
నమును ఆధ్యాత్మికసంపదను తెలిసికొనవలె నని పాశ్చాత్
కుతూహలపడుచున్నారు. ఇట్టి తరుణములో ఈమహర్షి
త్రలు కాలానుగుణ్యముగా నున్నవి.వీనిని ప్రతిహిందూవి
ర్థియు, విద్యార్థినియు చదువుట అతిముఖ్యము. విద్యాశా
కారులు వీనిని నిర్బంధపఠనీయగ్రంథములుగా నిర్ణయిం
చాల అవసరము. అమెరికా జర్మనీ మొదలయిన విదేశీ
ఉపయోగార్థమై ఈగ్రంథములను ఆంగ్లజర్మనీభాషలలో
భాషాంతరీకరించి ప్రచురించుటకూడ అవసరము. ఈఋషి
త్రములు అమూల్యరత్నములు. ఇవి ప్రతిహిందూగృహమ
అలంకరించునుగాక !

శ్రీమతి లీలావతి నారాయణ, బి. యస్. సి. క

(27-5-53 "భారతజ్యోతి"నుండి.)



అఘహారంబు 'శ్రీమహర్షి జీవితకథా
మృతము' సకలలోకహితముఁ గోరి
శాశ్వతముగఁ దెలుఁగుజగమున విలసిల్ల
బులుసు వేంకటేశ్వరులు రచించె.

కోట్లజన్మము లెత్తి యెత్తఁబోవుజీవియొక్క నికృష్టదైనందినవ్యవహారములు కాని, నశ్వరములగు వివిధదేహసంపర్కములు కాని వారిదృష్టి నాకర్షించినవి కావు. అందుచే, ఆయావిషయముల వారు తూష్ణీభావము వహించి యసలు పరమార్థమును విడిచి పెట్టినవారు కారు. నేఁటి మనదృష్టి వేఱు. అసలువిషయము తప్ప నన్నివిషయములు మనకుఁ గావలయును. బోధ మల్పము, గర్వ మధికము, శాంతి నిష్ఫచ్చరము, మచ్చరము మాత్రము ఘనము. ఇవి మనజీవితవిశేషములు. వెఱ్ఱివాఁడు లోకమంతయు వెఱ్ఱివారితో నిండిన దనుకొనునట్లు, బహుముఖవ్యర్థవిషయములలో మగ్నులమయి యనేకనికృష్టగుణముల కాలవాలములమయి, యివి లేనివారు నికృష్టు లని నిందించుస్థితిలో మన ముంటిమి. అందుచే మనజీవితచరిత్రలను మనము వ్రాసికొందుము. ఇతరులను బతిమాలి వ్రాయించుకొందుము. అచ్చువేసి విచ్చలవిడి ప్రచారము చేసికొందుము. మనము గొప్పవారమగుట కాదు మనకుఁ గావలయునది. మనము గొప్పవారము కా మని మనకుఁ దెలియును. కాని, పైవా రందఱు మనము గొప్పవార మనుకొనవలయును. మనలను స్తుతింపవలయును. సమ్మానింపవలయును. ఊరేగింపవలయును. ఆరాధింపవలయును. ఇవి మనకోరికలు. వీని కనుగుణముగా మన బ్రతుకులు తీర్చుకొనుచున్నాము. తుద కివియు లభింపక యిహమునకుఁ జెడి పరమునకుఁ జెడి కన్నుమూయుచున్నాము.

ఇంతకుఁ జెప్పవలసినది జైమినిమహర్షి జననవిశేషములు మనకుఁ దెలియవు. తల్లిదండ్రులపేళ్లైనను దెలియవు. ఈతఁడు తాను వ్యాసశిష్యుఁడ ననియే చెప్పుకొన్నాఁడు. అట్లే మనకుఁ

తెలియవచ్చును. కాని యితరవిషయములు తెలియవు. వ్యాసమహర్షి యాతనినిశిష్యునిగా గ్రహించి తనకడ నుంచుకొని శిక్షణ మొసఁగి ఋషిచంద్రు నొనరించినాఁడు.

## జైమిని : సామవేదప్రచారము

తొలుదొలుత బ్రహ్మహృదయమం దొకనాదము జనించెను. అది వృత్తినిరోధమువలన మూర్తీభవించి వ్యక్తముగాఁ గాననయ్యెను. ఆనాదోపాసనవలన యోగీశ్వరులు నిష్పాపులై ముక్తి నొందుదురు. అందు ఓంకారము జనించెను. అదియే సర్వమంత్రసర్వోపనిషన్మూలభూత యగు వేదమాత. ఆఓంకారము త్రిగుణాత్మకమై అకారోకారమకారము లనెడుత్రివర్ణరూపమై ప్రకాశించుచుండెను. అంత బ్రహ్మదేవుఁ డాప్రణవమువలన స్వరము, స్పర్శము, ఊష్మము, అంతస్థము మున్నగు లక్షణములు గలిగినఅక్షరసముదాయమును గల్పించి వానిసాయమునఁ దననాలుగునోళ్లనుండి నాలుగువేదములు కలుగఁజేసెను. ఆతనిపుత్త్రు లగుబ్రహ్మవాదు లావేదములను ఆతఁడు చెప్పినరీతి నభ్యసించి ఆక్రమముననే వారివారిశిష్యుల కుపదేశించిరి. ఇట్లు వేదములు సమగ్రముగాఁ బ్రతియుగమున మహాత్ము లభ్యసించిరి. అట్టివేదములను సమగ్రముగాఁ బఠింపలేనివారల యుపయోగమునకై ద్వాపరయుగాదియందు భగవంతుఁడు సత్యవతీదేవియందుఁ బరాశరమహర్షికిఁ బుత్త్రుఁడై జన్మించి వేదరాశిని క్రమముగా ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము నని నాలుగువిధములుగా విభజించి తనశిష్యరత్నము లగు పైల వైశంపాయన జైమిని సుమంతులకుఁ గ్రమముగా నావేదముల నుపదేశించెను.

పైలమహర్షి నేర్చినఋగ్వేద మనేకఋక్కులతోఁ గూడి యుండుటచే నది "బహ్వృచశాఖ" అని పేరందెను. పైలుఁ డీ వేదమును ఇంద్రప్రమితి, బాష్కలుఁడు ననుతనశిష్యాగ్రణుల కుపదేశించెను. ఇంద్రప్రమితి తనసంహిత మాండూకేయున కుపదేశించెను. మాండూకేయుఁడు దేవమిత్రుఁ డనువాని కది యుపదేశించెను. ఆతఁడు సౌభరి మున్నగు తనశిష్యుల కుపదేశించెను. సౌభరి తనకొడు కగుశాకల్యున కుపదేశించెను. శాకల్యుఁడు తా నభ్యసించినశాఖ నైదువిధములుగా విభజించి వాత్స్యుఁడు, మాద్గల్యుఁడు, శాలీయుఁడు, గోముఖుఁడు, శిశిరుఁడు ననెడుతనశిష్యుల కుపదేశించెను. వారు జాతుకర్ణిమహర్షి కుపదేశించిరి. ఆతఁడు బలాకుఁడు, పైంగుఁడు, వైతాళుఁడు, విరజుఁడు ననువారి కుపదేశించెను. బాష్కలుఁడు తాను నేర్చిన సంహితను నాలుగువిధములుగా విభజించి బోధ్యుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, పరాశరుఁడు, అగ్నిమిత్రుఁడు అనుతన శిష్యుల కుపదేశించెను. బాష్కలునికుమారుఁ డగుబాష్కలి వాలఖిల్యాఖ్యసంహితను బాలాయని, గార్గ్యుఁడు, కాసారుఁ డనువారల కుపదేశించెను.ఈవిధముగా ఋగ్వేదమును బెక్కురు ఋషులు ధరించిరి. ఇట్లే వైశంపాయనుఁడు నేర్చినయజుర్వేదము యాజ్ఞవల్క్యాదులమూలమున, కాణ్వమాధ్యందినాదులచే నభ్యసింపఁబడి లోకవ్యాప్తి గాంచెను.

ఇఁక, జైమినిమహర్షి తాను నేర్చినసామవేదమును దన కుమారుఁ డగుసుమంతుని కుపదేశించెను. ఆతఁడు సుకర్ముఁ డను తనసుతునకుఁ దెలిపెను. సుకర్ముఁ డావేదమును సహస్ర శాఖలుగా విభజించి తనకుమారుఁ డగుపౌష్యంజికిని, కోసలుని

కుమారుఁడగు హిరణ్యనాభునికి నుపదేశించెను. వారిరువురు బ్రహ్మవేత్తలగు ఆవంత్యులు, ఉదీచ్యులు నగునైదువందలమందికి నేర్పి వారిని సామవేదపారగులఁ జేసిరి. ఈవిధమున సామవేదము జైమినికతమున లోకవ్యాప్తి గాంచెను. ఇట్లే యథర్వవేదమును సుమంతుఁడు తనప్రియశిష్యున కుపదేశింప నతఁడు దానిని వేదదర్శుఁడు, పథ్యుఁడు ననుశిష్యులకును వారు శౌల్కాయని, బ్రహ్మబలి, నిర్ఘోషుఁడు, పిప్పలాయనుఁ డనువారి కుపదేశించిరి. ఈవిధమున నథర్వవేదమును వ్యాప్తిగాంచెను.*

## జైమిని మార్కండేయుని దర్శించుట

ఒకప్పుడు జైమిని బహుపుష్పఫలభరితములైన మహావృక్షములతోడను, మనోహరలతలతోడను, అట విహరించు నెమలి,కోయిల,చిలుక,మున్నగు చక్కనిపక్షుల మనోహరస్వనములతోడను, నిరంతరము వ్యాపించుహోమధూమముచే నల్లపడిన ఆకాశమండలముతోను, ఎడతెగక జరుగునధ్యయనఘోషమువలనఁ జెవుడుపడినదిశలతోడను, నిత్యకల్యాణము పచ్చతోరణముగా దినదినము ప్రవర్ధమానమగు యజ్ఞోత్సవముల! అనేకదేవతాగణములతో వచ్చియుండుచున్న యింద్రాదులతోడను, సమిధలు దర్భలు పూవులు పండ్లు తెచ్చుటకు మృదుమధురము లగుమాటలతో బయలువెడలు మునికుమారుల మనోహరకోలాహలముతోడను, శాస్త్రగోష్ఠి, పురాణకాలక్షేపము, ఇతిహాసకథనము మున్నగువానితోఁ గాలక్షేపము చేయు పరిషత్తులతోడను, చక్కగనొప్పుచున్న మార్కండేయాశ్రమ

*భాగవతము ౧౨స్కంధము.

మునకు విచ్చేసి నిరుపమనిష్ఠాపరుఁ డయి తప మొనర్చు మార్కం డేయునికి నమస్కరించి యాతనియతిథిసత్కారము లంది యిరు వురు సుఖగోష్ఠిలో నున్నపుడు జైమిని యిట్లు బలికెను. "ము నీంద్రా! మద్గురువరుఁ డగువ్యాసమహర్షి రచించిన మహాభార తములోని కొన్నినిగూఢార్థముల నెఱుఁగుటకై నీకడకు వచ్చి యున్నాను. నాసంశయములఁ దీర్ప నీవే యర్హుఁడవు. కాన, దయతోఁ దెల్పుము."

అంత, మార్కండేయుఁడు "సంయమివర్యా! నీయడి గినయర్థములకు సవిస్తరముగా సమాధాన మిచ్చుటకుఁ జాల కాలము పట్టును. నేను గఠోరనియమవ్రతుఁడనై యున్నాను. నియమవిధులకు సమయ మగుచున్నది. నే నేఁగవలయును. వింధ్యపర్వతమున పింగాక్షుఁడు, విరాటుఁడు, వృత్రుఁడు, సుము ఖుఁడు ననుపేళ్ళతో నలువురు పక్షిరాజులు గలరు. నీవు వారి కడ కేఁగి యీయర్థము లెఱిఁగికొ"మ్మని జైమినికి ధర్మపక్షుల చరిత్రము నిట్లు తెలిపెను:

"తొల్లి వపువు అనునప్సరసను దుర్వాసుఁడు పక్షివై పుట్టి భూమిపైఁ బదునాఱుసంవత్సరము లుండి నలువురు పుత్త్రులఁ గని తుదకు బాణఘాతమునఁ జచ్చి పూర్వరూపము నందు మని శపించెను. కందరుఁ డనువాఁడు విద్యుద్రూపుఁ డనురాక్షసుని జంపి యాతనిభార్యయు మేనకకూఁతురు నగు మదనికను భార్యగా స్వీకరించి తనయింటికిఁ దీసికొనిపోయెను. మదనిక కామరూపిణియై కందరుని కెన్నివిధములుగనో ఆనం దము నొసఁగుచుండెను. ఒకనాఁ డామె పక్షిరూపముఁ దాల్చి

యుండ, కందరుఁడు కూడ పక్షిరూపముఁ దాల్చి యామెతో రమించెను. వీరియిూరతివలన వపువు పుత్రికయై యీపక్షిదంపతులకు జన్మించెను. కందరుఁ డీపక్షికి తార్క్షి యను పేరిడి పెంచెను. ఈతార్క్షిని మందపాలుఁ డనుపక్షిరాజు నాలవకొమరుఁ డగుద్రోణుఁ డనువాఁడు పెండ్లాడెను. కాలక్రమమున, తార్క్షి యాతనివలన గర్భము ధరించెను. పిదప, మూఁడునెలల పదునైదుదినములు చనినపిమ్మట తార్క్షి కురుపాండవులు సంగరము చేయుచున్న భారతయుద్ధమునఁ దిరుగుట సంభవించెను. అపుడు భగదత్తునియేనుఁగగుసుప్రతీకముపై నర్జునుఁడు నిశితాస్త్రమేయఁగా నది తగిలి తార్క్షి కడుపు తెగి దానిగ్రుడ్లునాలుగు నొకమెత్తనిచోటఁ బడెను. ఈగ్రుడ్లమిూఁద నదృష్టవశమున సుప్రతీకము గంట యొకటి తెగి యీగ్రుడ్లకు హాని కలుగకుండఁ బడి వానికి రక్షక మగుదివ్యభవనముగా నొప్పెను. తార్క్షిశాపవిముక్తత నంది తిరిగి వపు ననునచ్చరయై తనలోకమునకుఁ బోయెను. ఈగ్రుడ్లు కాలక్రమమునఁ జిట్లి పక్షులయ్యెను. అంతలో భారతయుద్ధము పూర్తియైనపిదప, ధర్మరానకు భీష్ముఁడు చెప్పినసర్వధర్మములు ఈనాలుగుపక్షిపిల్లలు శ్రద్ధగా వినెను. ఒకనాఁ డటకు శమీకమహాముని విచ్చేసి పక్షికూఁతలు విని శిష్యులచే పైగంట తొలఁగింపఁ జేసి యాపక్షులఁ జూచి యాశ్చర్యభరితమానసుఁడై "ఆహా! ఈరణరంగమెక్కడ? ఈపక్షు లెక్కడ? ఈగంటలో నుండి యివి యెట్లు బ్రతుకఁగలిగినవి? ఏమి చావుబ్రతుకులచిత్రము!

సమర మొనరించినంతనే చావు రాదు
పారిపోయినయంతనే బ్రతుకు రాదు
జీవితంబును మరణంబు దైవకల్పి
తములు వానికి ముదమందఁ దలఁకవలదు.

... ... ...

దైవంబు చక్కఁజూచిన
నేవిధమునఁ గీడుపొంద దెయ్యెడ నున్నన్
దైవంబు తప్పఁజూచిన
నేవిధమున మేలుపొంద దెయ్యెడ నున్నన్.

(మార్కండేయపురాణము)

అని తొల్లిశుకాచార్యుఁడు చెప్పినమాట లెంతసత్యములు !" అనుకొని యాపక్షిపిల్లలకు నకులశ్యేన మార్జాల మూషికాదుల వలన భయము లేకుండ రక్షింప వలయునని దయగొని తన శిష్యులకు వానిని జాగ్రత్తగాఁ గొనిరం డని యాజ్ఞాపించి నిజాశ్రమమునకుఁ దీసికొనిపోయి యట వానిని దాను సురక్షిత స్థానముల నుంచి దినదినము పాలు పండ్లు మున్నగునాహార పదార్థములను స్వయముగాఁ బెట్టుచుఁ బోషించెను.

ఈవిధముగా నొక్కనెల యగునరి కాపక్షులు చక్కగాఁ బెరిగి ఱెక్కలు విచ్చి యొక్కపరి ఆకస మంట నెగిరి దిగివచ్చి శమీకమహాముని పాదముల కెఱఁగి యిట్లనెను: "మహాత్మా! మాకు మరణముఁ దప్పించి దయచే మమ్ముఁ బెంచి పెద్దలఁ జేసితివి. నీవే మాకుఁ దల్లివి తండ్రివి దైవమవు సమస్తమును. నీ ఋణము మేము తీర్చుకొనఁజాలము. ఐనను, నీసేవ చేయ మేమభిలషింతుము. మాచే నేమైనఁ బనులుగొను"మని యాపక్షులు మనుజస్వరములఁ బలుక ముని యచ్చెరువడి "మీ రెవ్వరు ?

ఎవని శాపమున నిట్లైతిరి? చెప్పుఁ" డనెను. అంత నాపక్షులు "అయ్యా! సుకృశుఁడు, తుంబురుఁడు నని యిద్దఱు ఋషులు గలరు. వారిలో సుకృశునకు మేము నలువురము బిడ్డలము ఒకనాఁడు మేము తండ్రిశుశ్రూష చేయుచుండ నింద్రుఁడు మాతండ్రి సత్యనిష్ఠఁ బరీక్షింపఁ దలఁచి పక్షిరూపమున వచ్చి మాంసాహార మర్థించెను. మాతండ్రి వల్లె యని మమ్ముఁ బిలిచి యాపక్షి కాహారము కండని కోరెను. మేము నిరాకరించి

'ప్రాణములు గల్గ శుభములు పడయవచ్చు
ధర్మములు సేయనగుఁ గానఁ దన్నుఁ గీడు
చెందకుండంగ నరుఁడు రక్షించుకొనుట
ధర్మ మని చెప్పుదురు ధర్మతత్త్వవిదులు'

(మార్కండేయపురాణము)

అని మే మాతనికి హితబోధచేయ నాతఁడు కోపించి పక్షులు కండని మమ్ము శపించి యాపక్షికిఁ దానే యాహారమై నిలువ నది "నీవు ప్రాణముతో నుండఁగఁ దినలేను. కాన, చనిపో"మ్మని కోరెను. అంత మాతండ్రి యోగాగ్నిఁ గల్పించుకొని ప్రాణములు పోఁగొట్టుకొన నుండ నింద్రుఁడు నిజరూపమున నిలిచి మాతండ్రి సత్యవ్రతనిష్ఠకు మెచ్చి వరములొసఁగి పోయెను. మేమును దండ్రిపాదములఁ బడి "తండ్రీ! ప్రవిమలజ్ఞాన మను ప్రాకారము, శల్యము లనుకీలకము, చర్మ మనుగోడ, రక్తమాంసము లనునున్నపుఁబూఁత, నానాస్నాయువు లనువేష్టనము, మహామాయ యనుముఖము కల దేహ మనుపురమునకుఁ బురుషుఁడు రాజు. ఈరాజునకు మనస్సు బుద్ధి యను పరస్పరవిరోధులు మంత్రులు. కామక్రోధలోభమోహములు

మిక్కిలిబలవంతులైన శత్రువులు. ఈనల్వురు శత్రు
చొరఁబడకుండ రాజు వీటివాకిళ్లు మూసియుంచుకొనవ
అప్పు డతఁడు నిరాతంకుఁడు, సమాధిసుఖబలవంతుఁడు
మానురాగుఁడు నగును. ఆరాజు వాకిళ్ళు గట్ట నశక్తుఁ
కాముఁ డనుశత్రువు నేత్రాదిపంచద్వారములనుండి
వ్యాపించును. అతని వెనుకనే మిగిలినముగ్వురుశత్రువులు
శింతురు. ఆనలువురు కలిసి యింద్రియమనంబులతో
మొనరించుకొని వాని నన్నిటిని, వాకిళ్ళను వశపఱచు
జయింపరానివారై కోటఁ గొల్లఁగొట్టి మంత్రులఁ జంపి రా
నశింపఁజేయుదురు. ఈరీతిఁ గామాదిశత్రువులు మా
స్మృతి నశింపఁజేయువా రగుట మేము మోహాపహృతచిత్త
ప్రాణలోభమున జ్ఞానముఁ బోఁగొట్టుకొని నీమాట
యపరాధము చేసితిమి. మమ్ముఁ గనికరింపు" మని ప్రా
తిమి. మాతండ్రి దయదలఁచి "వత్సలారా! నామాట త
కాని, మీకు నిర్మలబోధ నిలిచియుండునట్లు, పక్షులయ్యు
విద్యాపరులై, మనుష్యవాక్ప్రభావము నంది పఱలుఁ
మే మిట్లు పక్షులమై యాతనికృప నీవి శేషములఁ బడసి
అని చెప్పఁగా శమీకుఁ డానందించి వానిని దీవించి వీడ
పెను. ఆపక్షులు వింధ్యపర్వతప్రాంతముల కేగిరిపోయి
శిఖరమున నధ్యయనప్రవిష్టము లయి యున్నవి. పోయి
యముల వానివలనఁ దీర్చుకొమ్మని చెప్పి మార్కండేయ
జైమినిని వీడ్కొలిపెను.

## జైమిని ధర్మపక్షులకడ సందేహములు తీర్చుకొనుట

జైమిని మార్కండేయుఁడు చెప్పినచొప్పున వింధ్యగిరిశిరిగి జితనిశ్వాసము, అవిస్వరము, అతివిస్పష్టము, సౌష్ఠవసహితము, వివర్జితదోషము నగువేదస్వనముల నొప్పుపక్షిందు్రులఁగని నమస్కరించెను. ఆపక్షులు నాతని నాదరించి ఱెక్కల విసరి యతనికి సేదదీర్చి స్తుతించి వచ్చినపని యడిగెను. జైమిని తనభారతసంశయముల నడుగ నాతని కాపక్షులు శ్రీనారాయణవ్యూహచతుష్టయము, పాంచాలీభర్తృపంచకవిషయము, ఇంద్రుఁడే యైదువిధములై పాండవులుగ జన్మించుట, బలరాముని తీర్థయాత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, క్రోష్టుకిమార్కండేయసంవాదము మున్నగువిషయము లెన్నియో తెలిపెను. ఈయావద్వృత్తాంతము మార్కండేయపురాణ మనుపేరఁ బరగుచున్నది.

ఈవిషయము లన్నియుఁ దెలిసికొని జైమిని ధర్మపక్షులను స్తుతించి వీడ్కొని నిజాశ్రమమునకు వెడలి సుఖముండెను.

## జైమిని భారతము

ఒకప్పుడు జనమేజయమహారాజు చక్రియాగము నిర్విఘ్నముగా సమాప్తము చెందినపిదప సుఖాసీనుఁడై జైమినిమహర్షిని గనుఁగొని "మహాత్మా! కలిదోషముల నెల్ల క్షణమాత్రిలో భస్మము చేయఁజాలుకురుక్షేత్రమున నజాతశత్రుఁ డగుధర్మపుత్త్రుఁడు ధార్తరాష్ట్రబలములఁ బదునెనిమిదిదినములలో ధూళిధూసరితములఁ గావించి శాశ్వతైశ్వర్యధుర్యుఁడై విశ్వజగన్నుతముగా నశ్వమేధముఁ జేసినవిధానమును దయతోఁ దెల్పు" మని ప్రార్థించెను. అంత జైమినిమహర్షి జనమేజయునకు ధర్మ

జునికడకు వ్యాసమహర్షి విచ్చేసి యశ్వమేధముచేయ ననుజ్ఞ యిచ్చుట మొదలుకొని భీమాదులు యజ్ఞాశ్వమునకు భద్రావతీపురమున కరుగుట, మేఘవర్ణునితో యుద్ధము, అనుసాళ్వుఁడు మఖాశ్వము నపహరించుట, నీలధ్వజునితో యుద్ధము, అర్జునుని గంగ శపించుట, ప్రమీలార్జునీయము, బభ్రువాహన చరిత్రము, శ్రీరామచరిత్రము మున్నగు నెల్లవిషయములు, చంద్రహాసునివృత్తాంతము, కృష్ణుఁడు, కరిపురమున కేఁగుట, ధర్మజునశ్వమేధవిధి, తుదిపఱకు సవిస్తరముగాఁ దెలిపెను. ఈ కథాభాగము జైమినిభారత మనుపేరఁ బ్రశస్తి కెక్కినది.

## జైమినీయదర్శనము

సామవేదప్రచారకుఁ డగుజైమినిమునీంద్రుఁడు షడ్దర్శనములలో నొకదానికి ప్రవక్త. ఈతనిదర్శనము † జైమినీయదర్శనమనియు ధర్మదర్శన మనియు వక్కాణింపఁబడుచున్నది. పూర్వమీమాంసకే కర్మమీమాంస యనియు ధర్మమీమాంస యనియుఁ బేళ్లు. పూర్వమీమాంసాప్రణేత జైమిని. ఉత్తరమీమాంసాప్రణేత వ్యాసమహర్షి. ఉత్తరమీమాంసాప్రతిపాదకులు, వ్యాసానుయాయులు, నగువారే వేదాంతులు. వీరిసిద్ధాంతము కేవలపరబ్రహ్మాద్వైతప్రతిపాదనము. ద్వాదశాధ్యాయములు గలపూర్వమీమాంసాశాస్త్రము జైమిని రచించెను. ఇందు మూలభూతము లగుజైమినిసూత్రములు ఏకరూపములైనను, పూర్వమీమాంసానుయాయులు ప్రాభాకరమతస్థులు, భాట్టమతస్థులు నని రెండువిధముల నున్నారు. ప్రాభాకరమతస్థులు ఐదుప్రమాణముల నొప్పుకొందురు. భాట్టమతస్థులు

† పురుషార్థములను వాని సాధనములను దెలియఁజేయునది దర్శనము.

ఆయుప్రమాణములఁ జూపుదురు. సత్తుయొక్క వివర్తముతే కార్యము లన్నియు నని వీరివాదము. అందుచేతనే వీరిని వివర్తవాదు లందురు.

సంక్షేపముగా వీరి మత మిది: "సర్వజ్ఞాదివిశేషణములు గలయొక దేవుఁడు లేఁడు. వేదవచనమే ప్రమాణము. సర్వజ్ఞత్వము, విభుత్వము, నిత్యత్వము, చిదాత్మకత్వము, మున్నగు గుణములు కలవాఁడు దేవుఁడు కాఁజాలఁడు. త్రైలోక్యసామ్రాజ్యపాలనాదికమును సూచించు ఛత్రచామరాదులు గల యొకవిభుఁడు భగవంతుఁ డనుట సరి కాదు. అట్టివిభుత్వము, ఐశ్వర్యములు మాయావు లగుమానవులయందే కలవు. * ఈశ్వరుఁడు ప్రత్యక్షప్రమాణసాధ్యుఁడు కాఁడు. అనుమాన ప్రమాణమునకును సాధ్యుఁడు కాఁడు. ఇంతేకాదు ఆగమోపమానార్థాపత్తిప్రమాణములు వేనికిని ఈశ్వరుఁడు సాధ్యుఁడు కాఁడు.

నేత్రగోచరము కానిపదార్థములను సాక్షాత్తుగా నెఱుఁగఁగలవాఁడు లేఁడు కావున, నిత్యములు, అపౌరుషేయములు నగువేదముల వాక్యములమూలమున వచ్చినపదార్థధర్మాదిస్వరూపమును వివేచించుటే ముఖ్యతత్త్వము. కావున, ముందు ఋగ్యజుస్సామాథర్వవేదములను బఠించి పిదప సద్విద్య నెఱుఁగవలయు ననుజిజ్ఞాస నలవఱుచుకొని వేదోక్తవిధానమునఁ జరింప

---

* "దేవాగమ నభోయాన చామరాదివిభూతయః
మాయావిష్వపి దృశ్యన్తే నాతస్త్వమసి నో మహాన్."

వలయును. ఈ వేదోక్త విధ్యుక్త ధర్మమునకే 'నోదన'* యని పేరు.

ఈమతమునఁ బ్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శాబ్దము, అర్థాపత్తి, అభావము నని యాఱుప్రమాణములు గలవు.

## ప్రత్యక్షము

ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నము, అవ్యభిచారికము, వ్యవసాయాత్మకము, వ్యపదేశవివర్జితము, అగుజ్ఞాన మేది కలదో అదే ప్రత్యక్షము. ఇంద్రియార్థసన్నికర్షోత్పన్న మనఁగా ఇంద్రియముయొక్కయు వస్తువుయొక్కయు సంయోగమువలనఁ బుట్టినది జ్ఞానము అని యర్థము. అవ్యభిచారిక మనఁగా మఱియొక జ్ఞానముచే మఱియొకవిధముగా భావింపఁబడనిది యని యర్థము. ఉదాహరణకుముత్యపుఁజిప్పముక్కను వెండియే కని భ్రమించుట వ్యభిచారికము. ఇట్టిభావనలేనిది అవ్యభిచారికము. వ్యవసాయాత్మక మన వ్యవహారసాధకము, వ్యవహారమున కుపయోగించునది. వ్యపదేశవివర్జిత మనఁగా విపర్యయరహితము-మార్పులేనిది-అని యర్థము. ఈలక్షణము లన్నియుఁ బట్టినజ్ఞానమే ప్రత్యక్షము.*

---

*వేదోక్తము స్వర్గాదిసుఖసాధకము నగు నేవ్యాపారము నొకవచనము పరివర్తింపఁజేయునో దానికే 'నోదన' యని పేరు. ఉదా:—"స్వఃకామో౽గ్నిం యజేత్"=స్వర్గమును కాంక్షించువాఁడు అగ్నికార్యము చేయవలయును. ఇదే నోదన.

*ఆత్మా మనసా సంయుజ్యతే మన ఇంద్రియేణ ఇంద్రియ మర్థేన తతః ప్రత్యక్ష ముత్పద్యతే" న్యాయకారిక.

## అనుమానము

ఈఅనుమానము ముత్తెఱఁగులు. పూర్వవదనుమానము, శేషవదనుమానము, సామాన్యతోదృష్టానుమానము. కారణముచేఁ గార్యము ననుమానించుట పూర్వవదనుమానము. తుమ్మెదలు, ఎనుఁబోతు, పాము, తమాలవృక్షము, ఇవి సహజముగా నల్లనిపదార్థములు. ఇట్టినలుపు కలమేఘములనుబట్టి వర్షము కలుగు నని యూహించుట పూర్వవదనుమానము.* దీనికి విరుద్ధముగా కార్యముచేఁ గారణము నూహించుట శేషవదనుమానము. ఉదాహరణము: ఈనది వఱదలతో నున్నది. బహుశః కొండలమీఁద మెండుగ వర్షించియుండవచ్చును. ఇఁక, సామాన్యతోదృష్టానుమాన మనఁగా మనము సర్వసామాన్యముగాఁ జూచువిషయములఁబట్టి కార్య మూహించుట. ఉదా: దేవదత్తునియందు దేశాంతరప్రాప్తి యెట్లో సూర్యునియందుఁ నట్లే. అనఁగా దేవదత్తుఁ డనువాఁడు మాహిష్మతీపురమునుండి బయలుదేఱి ఉజ్జయని చేరినట్లే తూర్పున సూర్యుఁ డుదయించి సాయంకాల మస్తాద్రిఁ జేరుచున్నాఁడు. సూర్యగమనమును మనము కనలేము. ఐనను, సామాన్యముగా నిట్టులూహింతుము.

## ఉపమానము

తెలియఁబడనియర్థమును ప్రసిద్ధధర్మసాధర్మ్యమువలన జ్ఞాపనము చేయునది ఉపమానము. స్త్రీలకుఁ బురుషులకు, పిన్న

---

* "రోలంబ గవల వ్యాల తమాల మలినత్విషః,
వృష్టిం వ్యభిచరంతీహ నైవం ప్రాయాః పయోముచః"

నాలు అధ్యాయములలోఁ గలవు. కాని, యందు మొదటి పండ్రెండధ్యాయములే ప్రసిద్ధము లగుటఁ గొందఱు తుది నాలుగధ్యాయములు జైమినికృతములు కావందురు కాని, 'సంకర్షకాండ' యను పేరఁ బరగు నీనాలుగధ్యాయములుఁ గూడ జైమినికృతములే యని యంగీకరించి ఉపవర్షుఁడు, భావదాసుఁడు, దేవస్వామి, రాజచూడామణిదీక్షితుఁడు, భాస్కరరాయమఖి మున్నగు వ్యాఖ్యాతలు వీనికిని వ్యాఖ్యానములు రచించియున్నారు. కుమారిలభట్టాదులు మొదటి పండ్రెండధ్యాయములకే నిబంధనల రచించియుండిరి.

ప్రథమాధ్యాయమున ధర్మమునకుఁ గల ప్రమాణములన్నియు వివరింపఁబడినవి. రెండవయధ్యాయమున భేదము (ధర్మాధర్మభేదనిరూపణము) నిరూపింపఁబడినది. మూఁడవయధ్యాయమున అంగత్వము, నాలవయధ్యాయమున ప్రయోజ్యప్రయోజక భావము, ఐదవయధ్యాయమున క్రమము (కర్మకుఁ గర్మకుఁ గల సంబంధము) ఆఱవయధ్యాయమున అధికారము (యజ్ఞకర్తకుండవలసినయర్హతలు మున్నగునవి) ఏడవయధ్యాయమున నెనిమిదవయధ్యాయమున అతిదేశము (కర్మసాదృశ్యము, కర్మసమన్వయము మున్నగువానివివరణము) తొమ్మిదవయధ్యాయమున ఊహ, పదవయధ్యాయమున బాధ, పదునొకఁడవయధ్యాయమున తంత్రము, పండ్రెండవయధ్యాయమున ప్రసంగము వివరింపఁబడినవి. సంకర్షణకాండ యను తుదినాలుగధ్యాయములలోను వైదికయాగములందలి దేవతాదిక వివరణము కలదు. అందుచే నీభాగమును దేవతాధ్యాయ మందురు.

పూర్వమీమాంస, ఉత్తరమీమాంస, ఇవి రెండేకాక ఉపాసనామీమాంస యనుమూఁడవమీమాంసయుఁ గలదు. ఇది అంగిరోమహర్షిప్రణీతము. ఇందు జీవతత్త్వము చిజ్జడ గ్రంథ్యాత్మకము. అనాదిజీవునకు విభుత్వము, కర్తృత్వము, భోక్తృత్వము, ఇవి సత్యములు. గ్రంథులనుండి విడివడుటే మోక్షము. జడగ్రంథిసంబంధమే సంసారము. జీవునకు జడ సంబంధమును వీడుటవలననే ముక్తి కలుగును. ఈశ్వరునకు మాయాసంబంధమువలనఁ గర్తృత్వము వ్యవహారమున వచ్చి నది. మాయ పరమేశ్వరుని శక్తిస్వరూపమే. ఇది యీశ్వరుని కంటె భిన్నము. ఇది సృష్టికాలమున భేదభావ మంది, అఘటన ఘటనాసమర్థమై విచిత్రజగత్తును సృష్టించుచున్నది. సృష్టి కాలమందు ఈశ్వరునకును మాయకును భేదము. తదభావ మునం దభేదము. జీవనానాత్వము, జీవేశ్వరభేదము నివి కల్పి తములు. సాలోక్య, సామీప్య, సాయుజ్య, సారూప్యము లని ముక్తి నాలుగువిధములు. ఈమతమున సృష్టి, ప్రళయము నంగీకృతములు. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శాబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి, యని ప్రమాణము లిం దాఱు గలవు.

## జైమినీయగ్రంథములు

జైమినిమహర్షి చతురధ్యాయసంయుత మగునొకయపూర్వ జ్యోతిషగ్రంథమునకు, ఛాందోగ్యానువాదము అనునొకతంత్ర గ్రంథమునకు, జైమినీయశ్రౌతసూత్రము, జైమినీయగృహ్య సూత్రము అను ధర్మశాస్త్రగ్రంథములకుఁ గర్త యని తెలియు చున్నది. "స్మృతిమీమాంస" యనుధర్మశాస్త్రమున కీతఁడు కర్త యని అపరార్కునియాజ్ఞవల్క్యబ్రహ్మసూత్రనిబంధనమునఁగలదు.

# శ్రీమహర్షి జీవిత కథామృతము

## దేవలమహర్షి

### స్తుతి

అష్టవసువులలో నొకఁ డైనయట్టి
ఘనుఁడు ప్రత్యూషుఁ డనువాఁడు కన్నపట్టి
ధర్మశాస్త్రప్రవక్త యుత్తమతపస్వి
దేవలుని గొల్తు నతిభక్తిభావమునను

### జననము

తొల్లి దేవుఁ డనుమను వొకఁ డుండెను. అతనికుమారుఁడు ప్రజాపతి. ఈతఁడు ధూమ్ర, బ్రహ్మవిద్య, మనస్విని, రతి. శ్వసశాండిలి, ప్రభాత అను నేడుగురు కన్యలను వివాహమై వారివలన ధరుఁడు, ధ్రువుఁడు, సోముఁడు, అహుఁడు, అనిలుఁడు, అగ్ని, ప్రత్యూషుఁడు, ప్రభాసుఁడు అను నెనమండుగురు పుత్త్రులను గాంచెను. వీరే కాలక్రమమున అష్టవసువులై కీర్తి గాంచిరి. వీరిలో ప్రజాపతికి ప్రభాత యనునామెవలన జనించినకుమారుఁ డగుప్రత్యూషుఁ డొకచక్కనిచుక్కను బెండ్లాడి కాలక్రమమున నామెయం దిరువురుపుత్త్రులను గాంచెను. వారిలో మొదటివాఁడే దేవలుఁడు. రెండవవాఁడు విభువు. దేవలుఁడు నల్లనిశరీరము కలవాఁ డగుటచే నాతనికి అసితుఁ డనియుఁ బేరువచ్చెను.

## బాల్యము

దేవలుఁడు కాలక్రమమునఁ బెరిగి యుక్తవయస్సు కాం చఁగనే తండ్రి యగుప్రజాపతి యాతనిఁ దీసికొనిపోయి వ్యాస మహర్షికి శిష్యునిగా నొప్పగించెను. వ్యాసుఁడు నీతని నంగీక రించి తనయాశ్రమమున నుంచుకొని విద్యాబుద్ధులు గఱపి బ్రహ్మచర్యతపోదీక్ష లలవఱిచి కాపాడుచుండెను. దేవలుఁడు గురు వునెడ నధికశ్రద్ధాభక్తులు ప్రదర్శించుచు నాతనియనుగ్రహము నకుఁ బాత్రుఁడై తపస్వి,బ్రహ్మచర్యదీక్షితుఁడు, విద్వాంసుఁడు నగుటేకాక చక్కనిపౌరాణికుఁడు నయ్యెను. వ్యాసమహర్షి తాను వ్రాసినమహాభారతము నీతనిచేఁ జదివించి యాతనికిఁ గలవాచకత్వము, పురాణగౌరవము, పఠనాచమత్కృతి వీనిని గనిపెట్టి మెచ్చుకొని పితృలోకమున భారతమును వ్యాప్తిగా వింప నీతనిని నియమించెను. దేవలుఁడు గుర్వనుగ్రహమువలన గురునాజ్ఞఁ దలధరించి పితృలోకమున కేఁగి యట వ్యాసభార తమును బఠించి భారతగౌరవము నట నినుమడింపఁజేసెను. బాల్యముననే యీతఁ డింతటివాఁ డగుటకు వ్యాసగురుకృపయే కారణ మనియు, దేవలుఁడు గురువునకుఁ దగినశిష్యుఁ డనియు నెల్లరును మెచ్చుకొనిరి.

## దేవలుఁడు : జైగీషవ్యుఁడు

దేవలుఁడు మహాతపస్వియై సత్యవ్రతులలో మొదటివాఁ డుగ నెల్లరుఁ గొనియాడుచుండ బ్రహ్మనిష్ఠుఁడై యుండెను. ఒకానొకప్పుడు జైగీషవ్యుఁ డనుముని యాతనికడకు విచ్చేసెను. దేవలుఁ డాతని కతిథిసత్కారములు చేసి యాదరించెను. జైగీ షవ్యుఁడు దేవలునికడనే యుండి తపస్సు చేసికొందు నని చెప్పఁ

గా దేవలుఁ డాతనికి సమస్తసౌకర్యములు కల్పించి
రించెను. జైగీషవ్యుఁడు మౌనవ్రతమును దాల్చిఁ
మొనరించుచుండెను. దేవలుఁ డామునికి భోజనవేళ
ఫలపుష్పాదులఁ గొని యాతనికడ కేఁగి పూజించి ప
జేసి తిరిగి తనతపోవృత్తిలో నుండువాఁడు. ఈవిధముగా
కతిథిసేవాభాగ్యము, జైగీషవ్యునకు మౌనవృత్తి
రించు నవకాశము కలిగెను.

ఇట్లు కొన్నిసంవత్సరములు గడచెను. జై
మౌనము విడువలేదు; కఠోరతపోదీక్షచే దివ్యతేజస్వి
డెను. దేవలుఁడు నిదివఱకే యనేకసిద్ధులను గాంచి
గతుఁడు కాక పరబ్రహ్మనిష్ఠయందే యుండుచు వచ్చె
నాఁడు జైగీషవ్యునకుఁ దనశక్తులు చూపఁదలఁచి యా
చుచుండఁగ దేవలుఁ డాకాశమార్గమున నేఁగి స
స్నానముచేయ నొక్కచో దిగెను. అప్పటికప్పుడే య
ముచేసి జైగీషవ్యుఁడు జపము చేసికొనుచుండుట
గాంచి యాశ్చర్యమందెను. తరువాత నాతఁడు స్నా
ద్యనుష్ఠానములు నిర్వర్తించుకొని తిరిగి తనయాశ్రి
చేరెను. ఆసరికే జైగీషవ్యుఁడు తనస్థానమునఁ గ
యుంటఁ జూచి దేవలుఁ డింకను ఆశ్చర్యపడెను.
లుఁడు "ఆహా! జైగీషవ్యుఁ డత్యంతస్తుతిపాత్రముగుర
కలవాఁడే కాని సామాన్యుఁడు కాఁడు. ఈతనికి
చూపి భ్రమగొల్పుద మని యనుకొన్ననాకే యాత
క్తులు చూపి యచ్చెరువందఁ జేయుచున్నాఁడు. ఐనను,
యింకను బరీక్షించెదను." అని తలపోసి మంత్రిపార

నాతఁడు శరవేగమున నాకాశమున కెగిరిపోయి సిద్ధలోకముఁ జేరెను. అప్పటికే అక్కడ నున్న జైగీషవ్యుని సిద్ధులెల్లను భయభక్తి శ్రద్ధలతో సేవించుచుండుటఁ గాంచి దేవలుఁ డాశ్చర్యపోయి యటనుండి పితృలోకమునకుఁ బోయెను. అచటను జైగీషవ్యుఁ డధికపూజల నందుట దేవలుఁడు కాంచెను. అంత, దేవలుఁడు యామ్యలోకమునకుఁ బోయెను. జైగీషవ్యుఁ డటకూడ దేవలునకుఁ గానవచ్చెను. దేవలుఁడు మఱింత యచ్చెరువడి సోమలోకమున కేఁగెను. ఈతఁ డేఁగుసరికి జైగీషవ్యుఁడు నట నెల్లరిచే నారాధింపఁబడుచుండెను దేవలుఁ డింకను నద్భుతమంది అగ్నిలోకమునకు, తపోధనలోకమునకు, మిత్రావరుణలోకమునకు, ఆదిత్యలోకమునకు, రుద్రలోకమునకు, వసులోకమునకు, బృహస్పతిలోకమునకు, గోలోకమునకు, బ్రహ్మసత్రిలోకమునకు, పతివ్రతాలోకమునకు, శరవేగమునఁ బోయి యెల్లలోకములను దనకంటె ముందుగా నేఁగి పూజలందుచున్న జైగీషవ్యునిఁ జూచి పరమాశ్చర్యభరితుఁడై యుండ నంత జైగీషవ్యుఁ డదృశ్యుఁ డయ్యెను. ఇఁక, దేవలుఁడు ముందులోకమున కేఁగలేక యచట నున్న సిద్ధపురుషులం బిలిచి "మహాత్ములారా! యోగమూర్తియైన జైగీషవ్యుఁ డెట కేఁగెను? ఆతని మహత్వము మీ రెఱుఁగుదురా? ఆతఁ డిప్పు డేలోకమున నుండునో చెప్పుఁ"డనికోరెను. వారు దేవలునితో "మునీశ్వరా! జైగీషవ్యుఁడు యోగీశ్వరేశ్వరుఁడు. ఆతఁడు శాశ్వతబ్రహ్మలోకమున కరిగినాఁడు. నీ వింకను గొన్ని వేలసంవత్సరములు తప మొనరించి కాని యాలోకమును జేరఁజాలవు. ఆతనికి నీ యం దెంతయో యాదరము కలదు. అందుచేతనే యాతఁడు

నీపూతాశ్రమమునకు విచ్చేసియున్నాఁడు. నీ కతనివలన నింక నెన్ని యోగసిద్ధులు లభింపఁగలవు. పోయి రమ్మని" వీడ్కొలిపిరి. దేవలుఁడు పరమాశ్చర్య మంది జైగీషవ్యునియందు భక్తివిధేయత లినుమడింపఁ దిరిగి యొక్కొక్కలోకమునుండియుఁ గ్రిందికి దిగుచుఁ దనయోగశక్తి ప్రభావమునఁ దనయాశ్రమమునకు వచ్చిచేరెను. ఆతని కచ్చట సుఖాసనాసీనుఁడై మౌనవ్రతమున నున్న జైగీషవ్యుఁడు కానవచ్చెను.

దేవలుఁడు వెంటనే జైగీషవ్యునికి సాష్టాంగనమస్కార మొనరించి "మహాయోగీ! నీవు సామాన్యునివలె నాయాశ్రమమున కరుదెంచి యాతిథ్యము స్వీకరించితివి. నీమౌనవ్రతనిష్ఠకు మెచ్చి నాయోగశక్తి నీకుఁ జూపి నీకు వలసినశక్తు లనుగ్రహింత మనుకొంటిని. కాని, నాయీయనుభవమున నీవు సర్వసిద్ధుఁడ వనియు, యోగీశ్వరుఁడ వనియు, మహామహుఁడ వనియుఁ దెలిసికొంటిని. నాయందుఁ గటాక్షముంచి నాకుఁ గార్హ్యకార్యస్వరూపము, సన్న్యాసయోగము నెఱిఁగింపు"మని ప్రార్థించెను. జైగీషవ్యుఁడు సంతోషించి మౌనమును విడిచి "దేవలా! నీవు సామాన్యునివలె నన్ను స్తుతించితివి. నీవు తక్కువవాఁడవు కావు. నామౌనవ్రత మింతటితోఁ బూర్తియైనది. మౌననిష్ఠకు యోగ్యమగుతావు కనుఁగొనలేక నీపూతాశ్రమమునకు వచ్చితిని. నీవు నన్నతిథిసత్కారముల నాదరించి శ్రద్ధాభక్తులఁ బూజించితివి. అందువలన, నాశక్తు లెల్ల నీకును సంక్రమించినవి. శ్రద్ధాభక్తులతో విబుధుల నెవరు పూజింతురో వారికిఁ గోరకుండఁగనే సర్వసిద్ధులు లభించును. అందుచేతనే సాధుసజ్జనసాంగత్యము, పవిత్రజనసేవ, విబుధా

రాధనము వ్యర్థముగాఁ బోవు. అవి సేవించువానియోగ్యతను బట్టి బహుగుణవర్ధిత మగుప్రతిఫలము నాతని కిచ్చితీరును. నీవు కోరినవిషయము లెల్లఁ జెప్పెద" నని యేకాంతమున దేవలునికిఁ గార్యాకార్యస్వరూపము, సన్న్యాసయోగము, మోక్షధర్మములు సవిస్తరముగాఁ దెలిపి దేవలుని గృతార్థు నొనరించెను. అంత, దేవలుఁడు గృహస్థాశ్రమము స్వీకరింప నొల్లక సన్న్యసింపఁ బూని తననిశ్చయమును జైగీషవ్యుని కెఱుకపఱచెను. అంతలో భూతజాతము, పితృవర్గము, నటఁ బ్రత్యక్షమై "దేవలా! మునిశ్రేష్ఠుఁడ వగునీవు గృహస్థాశ్రమమును స్వీకరించి ఆయా కర్మపాలనమున మాకు హవ్యకవ్యము లొసంగుదు వని మేము గంపెడాస నీపైఁ బెట్టుకొని యుండఁగా, నీవు గృహివి కాక సన్న్యసింపఁదలఁచుట మాకు దుఃఖహేతువు కాదా ? వంశమున నేమూలనైన నొక్కఁడైన మహానుభావుఁడు పుట్టి భక్తిశ్రద్ధాతాత్పర్యములతో భూతతృప్తి,పితృదేవతారాధనము చేయకపోవునా ? మనము తృప్తులమై తరింపకపోవుదుమా? యని మేము చిరకాలమునుండి కనిపెట్టుకొని యున్నాము. మా కిఁక గతి యే"మని యొక్కసారిగా నాక్రోశించెను. అపుడు దేవలుఁడు వారికి నమస్కరించి జైగీషవ్యు ననుమతిఁ గొని మహోత్తమ మగుతనతపస్సును ధారవోసి భూతములకుఁ దృప్తియుఁ బితృదేవతల కుత్తమగతులు చేకూర్చి వారిని సంతుష్టులఁజేసి తాను తుష్టుఁడై పిదప గార్హస్థ్యధర్మమును వెంటనే పరిత్యజించి సన్న్యాసియై మోక్షధర్మమును స్వీకరించెను.

అపుడు బృహస్పతిప్రముఖు లచ్చోటికి వచ్చి దేవల జైగీషవ్యుల నెంతయో స్తుతింపఁదొడఁగిరి. అపు డట నున్న

గాలవముని జైగీషవ్యుఁడు యోగియే కాని తపస్వి కాఁడనియు నాతనిఁ గని దేవలుఁడు మోసపోయె ననియుఁ దపోయోగజ్ఞానములుగలవారే కాని యంతదేయెక్కుడైనఁ గన్నవారు మోక్షార్హులుకారనియు నేమేమో చెప్పఁదొడఁగెను. అప్పుడు బృహస్పతి గాలవునిమాట లర్థరహితము లనియు దేవలజైగీషవ్యు లిరువురు తపోయోగజ్ఞానులే యనియుఁ బేర్కొని జైగీషవ్య దేవలఋషి నివాసస్థానమైన యాప్రదేశము దివ్యతీర్థ మయ్యెనని ప్రశంసించి తక్కుదేవతలతో నిజస్థానమున కేఁగెను.*

జైగీషవ్యునికడ సెలవుగైకొని దేవలుఁడు సింధునదీతీరమునకుఁ జని యటఁ బ్రశాంతముగా మోక్షధర్మమును బాటించుచుండెను.

## దేవల జైగీషవ్యసంవాదము

మఱియొకప్పుడు దేవలుఁడు జైగీషవ్యునితో "మహాత్మా! ఏయాచార మవలంబించుటవలన, నెట్టిశీల మలవఱచుకొనుట వలన, నెటువంటివిద్య నభ్యసించుటవలన, ముక్తి లభించునో తెలుపుము" అని కోరెను.

జైగీషవ్యుఁ "డయ్యా! శాంతిమతు లగు సౌమ్యుల నిష్ఠయే అవలంబింపవలసిన యాచారము.

**వినుతించిన నిందించిన**
**ననఘా ! మనమునఁ బ్రియంబు నప్రియమును లే**
**కునికియు వ్రేసిననైనను**
**గనలు వొడవమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్**

(భార. శాం. ౫. ౨౨)

* భారతము. శల్యపర్వము.

ఈగుణము లలవఱచుకొన్న శీలసంపదయే ముక్తిహేతువు. దేనిని గోరుకొనక, యేది లభించిన దానితోఁ దృప్తినంది, లభింపని దానికోసము వగవకుండుటే గొప్పగుణము. ఆర్షమైనయాచార మునందు లాభనష్టములు, మానావమానములు, ఆదరానాదర ములు సమానముగా నిరాదరింపఁబడును. అవమానము లభిం చినపు డమృతముఁ దాగినట్లు తృప్తిపడి, గౌరవము లభించు నపుడు మిక్కిలిదుఃఖమందుట శమరతుని స్వభావము. ఇతఁడు చుట్టము ఇతఁడు శత్రుఁడు అనుభావ మెవ్వరియందును నుండక, ఏ సమయమందైనను సంతోష హాని నందక పరిబుద్ధాత్ముఁడు వెలుఁగొందును ఇంద్రియములను జయించి హృదయమునిండ శాంతిసుఖామృతముఁ దాగివి వికారరహిత మైనవృత్తి నవలం బించిన మహనీయునిపొందు దేవతలకైన నంద సాధ్యముకాదు.” అని దేవలుని వీడ్కొని జైగీషవ్యుఁడు యథేచ్ఛముగాఁ జనెను.

## దేవలుఁడు హూహూనామగంధర్వుని శపించుట

‘హూహూ’ అనుపేరు గలయొకగంధర్వుఁడు తనప్రియ కాంతలతో నొకసరోవరమున జలక్రీడలాడుచునుండెను. ఆసమ యముననే దేవలమహర్షి యాచెఱువులో దిగి స్నానముచేయ నుంకించిన, హూహూ నీటిలో మునిఁగివచ్చి దేవలునిపాదము పట్టుకొని బాధించెను. దానితో దేవలునికిఁ గోపమువచ్చి మొస లివలెఁ దన్నుబాధించినహూహూ మొసలియై”పుట్టుఁ గాక!

యని శపించెను. ఆశాపము విని హూహూ భయపడి దేవలుని పాదములపైఁ బడి తన్ను క్షమించి రక్షింపు మని ప్రార్థించెను. అంత నాతఁడు దయదలఁచి "ఓయీ! గంధర్వరాజా! నీవు మొసలివై యొకగజరాజును బట్టుకొని బాధింతువు. అప్పు డా గజరాజు ప్రార్థనమున విష్ణుమూర్తి వచ్చి తనచక్రమున నీతల దునుమును. అపుడు నీవు శాపవిముక్తి నంది నిజరూపమును గాంచి గంధర్వలోకమునకు వచ్చెద'వని చెప్పి వెడలిపోయెను. హూహూ మొసలియై పుట్టి త్రికూటపర్వతప్రాంతమందలియొక సరస్సులో నుండి యందు నీరుద్రావ విచ్చేసినగజరాజును బట్టుకొనెను. ఆగజరాజు సర్వవిధముల దానిపట్టు తప్పించుకొన యత్నించి విఫలుఁడై తుదకు "లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్ రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా" యని విష్ణుమూర్తిని బ్రార్థించిన నాతఁడు ప్రత్యక్షమై తనచక్రమున మొసలితలఁ దునిమెను. వెంటనే ఆమొసలిరూపమును విడిచి హూహూ అనుగంధర్వుఁడు నిజరూపముఁ దాల్చి తనకట్లు శాపవిమోచనము గావించినవిష్ణుమూర్తిని బరిపరివిధములఁ బ్రస్తుతించి గజరాజును గౌరవించి తిరిగి గంధర్వలోకమునకుఁ బోయి సుఖముండెను.

## దేవలుఁడు వస్త్రోత్పత్తి

దేవలునిగుఱించి దేవాంగపురాణమున నొకకథ కలదు ఇది యెంతవఱకు విశ్వసనీయమో తెలియదు. తొల్లి బ్రహ్మ

దేవుఁడు సర్వమును సృజించి వస్త్రములనుమాత్రము సృజింప లేకపోయెను. ఆతఁడు శివునికడ కేఁగి వస్త్రములఁ జేయునుపాయముఁ జెప్పుమని కోరెను. కాని, శివుఁడు తాను నాపని చేయ నిచ్ఛగింపక తనభక్తుఁడైన దేవలమహర్షికి వలయుశక్తి నిచ్చి యందులకు నియోగించెను. దేవలుఁడు బయలుదేఱి విష్ణుమూర్తి నాభియందు మెఱయుదారములను గొనివచ్చుటకు విష్ణులోకమునకుఁ బోవుచుండఁగా దారిలో నెందఱో రాక్షసు లెదురైరి. వారిబాధలు పడలేక దేవలుఁడు శక్తిని దలఁచుకొనఁగ నామె వచ్చి యారాక్షసు లెల్లర నొక్కుమ్మడిఁ జంపి యాతనిఁ గాపాడెను. దేవలుఁడు విష్ణుమూర్తిని బ్రార్థించి దారములను గొని వచ్చి మేరుపర్వతప్రాంతముల కేఁగి మిగిలినపరికరమునను సంపాదించి వచ్చి వస్త్రములను దయారు చేసి దేవతల కొసంగెను. అపుడు బ్రహ్మాదిదేవతలెల్లరు దేవలుని స్తుతించిరి.

## రంభాశాపము

దేవలమహర్షి యొకప్పుడు ఘోరదీక్షతో నుండి తపము చేసికొనుచుండఁగా నచ్చటికి రంభ వచ్చి యాతనిఁజూచి యాతని దేహసౌందర్యమున కచ్చెరువడి యాతని జేరి 'ఆర్యా ! సుందరు లగుబృందారకుల నెందఱనో చూచితినికాని, నీవంటినవ మోహను నెందును గనియుండలేదు. నాపొందు నెడందంబులఁ గోరి యెందఱో మహానుభావులు తపస్సులు, యాగములు, వీర కృత్యములు చేసియు నన్నందఁజాలక కుందుచుందురు. నేను నీ కలభ్యయోగముగ నీమక్కువఁ దగిలి యిక్కడికి వచ్చియున్నాను. నీమనోహర మగుశరీరము తపోదీక్షలో నవయఁజేయక

నన్నుఁ జెట్టవట్టి బిగికౌఁగిట గారవించి చిరకాలము మన్మథ మహాసామ్రాజ్యము నేలుం మని నిన్నుఁగోరుచున్నాను." అని పలికెను. అందులకు దేవలుఁడు 'అచ్చరమచ్చెకంటీ ! నీయంద చందములఁ దగిలి నీయందే డెందములు పొందుపఱచువా రెందఱోయుండఁగా ముక్కుమూసికొని మూలఁగూర్చుండు నన్నేల వలచి వాదు లాడెదవు ? మేడిపండు చూడ నెంత మేలిమి వలె మిసమిసలాడుచున్నను పొట్ట విచ్చి చూచిన పురుగులే కదా యుండునవి ! శరీరము రక్తమాంసాస్థికల్పితముకదా ! ఎంతసుందరికైనను రక్తము, మాంసము, ఎముకలు, లేనిశరీరము కలుగునా ? నీవు రంభవైనఁ గావచ్చును గాని పరమజుగుప్సాకరము, మలమూత్రసంయుతము, కర్ణమలనేత్రమలనాసికామలసర్వమలనివాసస్థాన మైనపాడుబొందితోడితగులాటము నా కేల ? పొ"మ్మని హుంకరించెను. రంభ యామాటలకెంతయుఁ గనలి రంభ నగునేను వచ్చి వలచిన నిట్టినిష్ఠురోక్తుల నడలించుట నీబ్రాహ్మణత్వ ఋషిత్వములవలన లభించినగర్వమునఁగదా ! కనుక, నీవుశూద్రయోనిం బుట్టు"మని శపించి రంభ వెడలిపోయెను.

రంభశాపముప్రకారము దేవలమహర్షియే శూద్రజన్మముఁదాల్చి దేవాంగకులమున జన్మించి తనకుఁ బూర్వజన్మమున లభ్యమ యినవస్త్రోత్పాదనశక్తిని బలుతెఱఁగుల వృద్ధి చేసి దేవాంగకులమునకు మూలపురుషుఁడై చిరకాలము నివసించెను. దివ్యాంగుడు, విమలాంగుడు, ధవళాంగుఁ డనువా రీతనికిఁ బుత్త్రులై పుట్టి నేతపనిశ్రమను లోకమున వ్యాపింపఁజేసిరి.

పిదప, శాపవిమోచన మైనపిదప దేవాంగుఁడు ఊర్ధ్వలోకమున కేఁగి దేవలఋషియై దివ్యర్షి యయ్యెను. శేషుఁడు తనకుమారి యగుచంద్రరేఖను, సూర్యుఁడు తనసోదరి యగుదేవదత్తను ఈతనికిచ్చి వివాహముచేసిరి. వీరివలన దేవలుఁడు సంతానముఁ బడసి వంశవర్ధనము జరిగినపిదప సన్న్యసించి మోక్షసామ్రాజ్యమును జూఱగొనెను.

## దేవలస్మృతి

దేవలమహర్షి మహాధర్మశాస్త్ర ప్రతిపాదకుఁడు. ఈతని ధర్మశాస్త్రము బృహద్గ్రంథ మొకటి లభింపవలసియున్నది. ఆనందాశ్రమప్రచురణ మగుదేవలస్మృతిలో ౯౦ శ్లోకములే కలవు. ఇందు మ్లేచ్ఛసంపర్కదోషమునకుఁ బ్రాయశ్చిత్తభాగము మాత్రమే కలదు. ఇదికాక యొకబృహద్గ్రంథము కలదనుటకు యాజ్ఞవల్క్యస్మృతికి వ్యాఖ్యానగ్రంథమగు మితాక్షరమున 1.120 లో శూద్రధర్మములు, వృత్తులు పేర్కొన్నయొకసూత్రము దేవలస్మృతిలోని దని యుదాహరింపఁబడియున్నది.* గృహస్థులిరుతెఱఁగు లని 1.128 లో మఱియొకదేవలసూత్ర ముదా

---

* తానిచ దేవలోక్తాని. శూద్రధర్మో ద్విజాతిశుశ్రూషా పాపవర్జనం కలత్రాదిపోషణం కర్షణపశుపాలన భారోద్వహనపణ్య వ్యవహార చిత్రకర్మ నృత్యగీతవే ఆ వీణామురజ మృదంగవాదనాదీని."

హృతమయియున్నది.‡ అపరార్కమునను స్మృతిచంద్రికలోనను మఱికొన్ని దేవలవాక్యములు గలవు. ఇవి యేవియు ప్రస్తుత ముద్రిత దేవలస్మృతిలో లేవు. అందుచే దేవలస్మృతి నిజస్వరూపముతో మన కింకను లభింపవలసియున్నది. ఇందు దేవలమహర్షి సర్వధర్మములను బ్రతిపాదించియున్నాఁడు. ఒక్కస్మృతిచంద్రిక యుదాహరించిన శ్లోకములవలననే దేవలమహర్షి ధర్మశాస్త్ర నిష్ణాతుఁడని తేట తెల్లమగుచున్నది.

ఇట్లు దేవలమహర్షి దివ్యర్షి, మహాతపస్వి, యోగీశ్వరుఁడు, ధర్మశాస్త్రప్రవక్త, మహాపురుషుఁడు నయి భారతవర్ష మహర్షులలో మొదటి శ్రేణికిఁ జెందిన వాఁడాయెను.

---

‡"యథాహి దేవలః ద్వివిధో గృహస్థో యాయావరః శాలీనశ్చ తయోర్యాయావరః ప్రవరః యాజనాధ్యాపన ప్రతిగ్రహారిక్థ సంచయ వర్జనాత్. షట్కర్మాధిష్ఠితః ప్రేష్యచతుష్పద గృహగ్రామధనధాన్యయుక్తో లోకానువర్తీ శాలీన ఇతి."

©"పతిపత్నీప్రహ సహధర్మచర్యా తత్పూజ్యమాన పూజనమ్" ఇతి స్త్రీధర్మాః.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## నరనారాయణమహర్షులు

### స్తుతి

నరనారాయణు లనఁగా
ధర ధర్మునివలన నతనితరళాక్షికి భూ
భర ముడుపఁ బుట్టె విష్ణువు
పరమం బగుభక్తి వారి భజియింతు నెదన్

### జననము

భగవంతుని యేకవింశత్యవతారములో నరనారాయణావతారము నాల్గవది. ఆదివిష్ణువు భూమిపై నవతరించి యద్వితయమగుతప మొనరించి తత్ప్రభావమున రాక్షసవినాశము లోకసంరక్షణము చేయఁబూని ధర్ముఁ డనుమహామహునిభార్య యందుఁ గవలుగా నుదయించెను. ఈకవలకు నరనారాయణు లనుపేరు వచ్చెను.

### తపస్సు

ఒక్కఁ డైనవిష్ణువు రెండురూపములఁ దాల్చుటచే వీరిరువురు మనోవాక్కాయకర్మములఁ బరమమిత్రులై బాల్యమునుండియుఁ బరమపవిత్ర మగుబదరికావనమును దమయాశ్రమప్రదేశముగాఁ జేసికొని తపోధ్యానానురక్తులై వెలయుచుండిరి. వీ రిట్లు వేయిసంవత్సరములు మహోగ్రమగుతపస్సు చేయఁగా వీరితపశ్శక్తి కింద్రుఁ డసూయపడి మనఃక్షోభ మందెను. పిదప

నింద్రుఁడు వీరికిఁ దపోవిఘ్న మొనరించి వారిని గామక్రోధ లోభములకుగుఱి గావింపఁ దలఁచెను.

## ఇంద్రుఁడు తపోవిఘ్న మొనరింపఁదలఁచి విఫలుఁ డగుట

ఇట్లూహించి ఇంద్రుఁడు వెంటనే యైరావతము నెక్కి బదరికాశ్రమముఁ బ్రవేశించి నరనారాయణులఁ జేరి, "ధర్ముని పుత్రు లగుమునులారా ! మీ కేకోరిక కోరి యిట్లు తప మొనరించుచున్నారో చెప్పుఁడు. మీకు నేను వర మొసఁగి యాకోరికఁ దీర్తు"నని పలికెను. కాని, ధ్యానస్థితులు, దృఢచిత్తుల వగునామహర్షులు కన్నెత్తిచూడరైరి. ఒకపలుకైనఁ బలుకరైరి.

అందుల కింద్రుఁడు కోపించి, వారిధ్యానాసక్తి నశింపఁ జేయ నొకమాయ ఘటించెను. ఆమాయాకారణమునఁ బులులు సింహములు, తోడేళ్లు, చిఱుతపులులు, పాములు, తేళ్లు, వేలకొలఁది బయలుపడెను. ఆకసమునఁ బుష్కలావర్త మేఘములు చేరి గర్జింపఁదొడఁగెను. అడవి యంతయుఁ గార్చిచ్చున నశించుచున్నట్లు కాననయ్యెను. నలుదెసలు నంధకారబంధురము లయ్యెను. ఆకాశమునుండి ఱాళ్ళవాన కురియ నారంభించెను. ఎంతప్రళయముగా నచటఁ గన్పట్టినను నరనారాయణులకుఁ దపోభంగ మించుకంతయైనఁ గలుగదాయెను. ఇంద్రుఁడు తన ప్రయత్నమంతయు విఫలమయ్యెనే యని విచారించి క్రోధము, అసూయ, పగ మనస్సును గలఁప స్వర్గమున కేఁగెను.

అట నింద్రుఁడు వసంతుని మన్మథుని బిలిచి నరనారాయణులదారుణతపము, తత్తపోభంగ మొనరింపఁ దాను జేసిన ప్రయత్నములు విఫలము లగుటయుఁ దెలిపి మన్మథునితో నిట్లనెను

"హరిహరబ్రహ్మముఖులు నీయంపగముల
దాడి కోర్వక దాసానుదాసులైరి
జగము లన్నియు గెల్చినజాణ వీవు
మనుజు లన నెంతవార లోమదన! నీకు.

(తి. వెం. కవుల దేవీభాగవతము.)

నీవు మనవసంతునిఁగూడి యప్సరసల నెల్లరఁ గొనిపోయి కార్యసిద్ధి నంది రానలయును. నీయంతవాని కిది యెంత?" యని పలికెను. మన్మథుఁడు "దేవా! నీయానతి తలదాల్ప నవఁజాలను కాని, యామహాత్ములదరిఁ జేరి బ్రదుక సాధ్యము కాదు" అని పలికెను. ఇంద్రుఁ డాతనిని మఱిమఱి బతిమాలుకొనెను. ఇఁక వల్లె యని మన్మథుఁ డంగీకరించెను.

## బదరికాశ్రమమున నకాలవసంతము

ముందు వసంతుఁ డేఁగి బదరికాశ్రమమును బ్రవేశించెను. వెంటనే చిగురుఁగొమ్మలతోఁ దియ్యమామిళ్లు దట్టముగాఁ బుష్పించెను. తుమ్మెదలు పూగుత్తులపై ఝంకారములతో వ్రాలఁ దొడఁగెను. గండుఁగోయిలలు మనోహర మగు కుహుకుహూరావ మొనరించెను. పొగడలు, తమాలములు, మోదుగలు మున్నగునవెల్ల చిగిర్చి పుష్పించెను. లతలన్నియుఁ బుష్పవతులై వృక్షములఁ గౌఁగిలించుకొనెను. మందమారుతములు మంచిగంధపుఁదావితోఁ జెలరేఁగెను. రాలముగ్గినపండ్లు పొడిచి తినుచుఁ జిలుకలగుంపులు కూయఁదొడఁగెను. పండుటాకులమీఁద రాలినపువ్వులగుంపులు పండువెన్నెలభ్రాంతి

నొడఁగూర్చెను. ఆలుమగలు మల్లెపూల నుల్లసిల్లుచు మదనమంత్రములు పఠింపఁదొడఁగిరి.

ఇట్లుండ మన్మథుఁడు పంచబాణములు నించువిల్లు ధరించి యప్సరసలు తన్ననుసరింప నరనారాయణులయాశ్రమమును బ్రవేశించెను. వెంటనే యప్సరసలు ఱాళ్లు కరఁగునట్లు, మోళ్లు చిగుర్చునట్లు, పుట్టలలో నుండి బయటికి వచ్చి త్రాచులు తలలూఁపునట్లు, కోయిలలు ప్రతిరవ మొనరించునట్లు రమ్యముగా లయతాళధ్వనులఁ బాడఁ దొడఁగిరి.

ఈయకాలవసంతోదయమునకు, మంజులగీతములకుఁ, గోకిలారావములకుఁ గన్నులు తెఱచి నలుదెసలు పరికించి నరనారాయణులు విస్మయపడిరి. అంతఁ బదియాఱువేల యేఁబదిమంది మేనకాదు లగునప్సరసలు వెనుకముందు నడవ, తుమ్మెదలనారితోఁ గూడినచెఱకువిల్లు భుజమున విలసిల్ల, తేనె విరజిమ్ము పుష్పబాణము లమ్ములపొదిలో నిండియుండ, కోయిలదండు చిల్క తేజీబారు కలకలమనుచుండ, మన్మథుఁడు వచ్చి కట్టెదుట నిలువఁగా నరనారాయణులు తపము చాలించి కన్నులుపూర్తిగాఁ దెఱచి పరికింపఁదొడఁగిరి. ఇదే సమయ మని యచ్చరమచ్చెకంటులు పాటలుపాడుచు నర్తింపఁదొడఁగిరి. అంత నారాయణుఁడు "ఓయచ్చరలారా! మిమ్ము మాతపోభంగమున కింద్రుఁడు పంపియుండఁబోలును. మీకు స్వాగతము. రండు. అలసితిరి కాఁబోలు. మావిందులు గుడిచి డెందంబులు కందళింపఁ దరలిపోవుదురుగాని" యని పలికి తనకుడితొడఁ గొట్టెను. వెంటనే కోటియప్సరసలచెలువముతో నొక్కచెలువ చెలికత్తెలతోఁ బుట్టెను. ఊరువునుండిపుట్టిన దగుటచే నామెకు "ఊర్వశి"యను

పేరు వచ్చెను. ఊర్వశి చెలికత్తెలతో మునులకు నమస్కరించి యున్నంత, మేనకాదు లగునచ్చరలెల్లరు సిగ్గుపడి మునిమహిమకు మెచ్చి వారిపాదములఁ బడి తపోభంగ మొనరింపఁ దలఁచి విచ్చేసినతప్పిదమును క్షమింపుఁ డని ప్రార్థించిరి.

అంత, నారాయణమహర్షి చిఱునవ్వు ముఖపద్మమునఁ జెలువొంద నరుఁడు విన వారితో "కాంతలారా! మీరు వెంటనే ఈయూర్వశిని జెలికత్తెలను దీసికొని మీలోకమున కేఁగి మాకానుకగా మీయిందున్రనకు వీరి నొప్పగింపుఁడు. దేవతలకు శుభము లగుఁగాక యనియు దేవేంద్రునకు సుఖమగుఁగాక యనియు మే మాశీర్వదించితి మని చెప్పుఁడు" అని పలికెను. అంత, వారు "మహాత్మా! మీపాదసేవ చేసికొనవచ్చిన మమ్ముఁ బొమ్మనుట ధర్మమా? ఈయూర్వశ్యాదులను స్వర్గమునకుఁ బంపి యంతకన్నఁ గోటిరెట్లెక్కువ యగుమీచరణసమీప దేశమున మే ముందుముః అనుగ్రహింపుఁ" డని కోరిరి. అంత, నారాయణుఁడు 'మీకోరిక యే' మని యడిగెను. వారు 'మహానుభావు లైనమీరు మాకుఁ బతులు కావలయు'నని కోరిరి. అపుడు నారాయణుఁడు నవ్వి "మీచెలువము వమ్మగునట్లు తపఃకృశాంగుల మగు మమ్ముఁ గోరుట యెట్టి వివేకము?" అని పలుకనాయచ్చరలు ముచ్చటలు మీఱఁ జనవుగైకొని సరసాలాపములాడఁదొడఁగిరి. అంత, నారాయణుఁడు తనలో "ఆహా! అహంకారము సంసారవృక్షమునకు మూలము, ధర్మనాశనమునకుఁ దొలికారణము. ఈ వేశ్యలు నాతపమునకు భంగ మొనరింప వచ్చి రని యెఱిఁగియు వీరితో నా కీప్రసంగము లేల? ఊర్వశీసృష్టి యేల చేసితిని? కోపము నటించి హుంకరించి వీరి నవ

లకుఁ బోఁద్రోలుదును. లేక శపింతు"ననుకొని మరలఁ గోపము విడిచి వారితో "ఓయతివలారా! వ్రతనియమమున నున్న మా కతివలతోఁ బొందు వలదు. మీరు వెంటనే మీవచ్చినచోటికిఁ బొండు. మీరు నన్నుఁ బతిగా వలచితిరి. మీకోరిక కాదనలేను. నేను ద్వాపరయుగమునఁ గృష్ణుఁడనై జన్మించెదను. అపుడు మీరు రాజకన్యలై పుట్టి నన్ను వరించెదరు గాన అపుడు మీ వాంఛ లీడేర్తును. పొం" డని పలుక వారు భయభక్తిసంతోషములు ముప్పిరిగొన సెలవుగైకొని స్వర్గమునకుఁ బోయి దేవపతికి జరిగిన దెల్ల వినిపించి యూర్వశ్యాదుల నొప్పగించిరి. ఇంద్రుఁ డామహర్షులతపఃప్రభావమున కచ్చెరువంది వారిని శ్లాఘించి యూర్వశ్యాదులకు స్వాగతమిచ్చెను. ఆనరనారాయణఋషులు నెప్పటియట్లు మహోగ్రతపోనిష్ఠలో నుండిరి.*

## ప్రహ్లాద నరనారాయణ యుద్ధము

తొల్లి యొకప్పుడు ప్రహ్లాదుఁడు తీర్థయాత్రాచరణాశీలియై పుణ్యనదీనదములఁ గ్రుంకులిడుచు సరస్వతీనదీస్నానమునకు విచ్చేసెను. అతఁ డటఁ దీర్థకృత్యములు నెఱవేర్చి నదీతీరమునఁ బోవుచుండ దారిలో నొకపెద్దమఱ్ఱి, యామఱ్ఱిపై నొకేరూపమున నున్న యెన్నో బాణములు గాంచి "ఆహా! ఈప్రాంతము ఋష్యాశ్రమప్రాంతముకదా! ఇచటి కీబాణపరంపర లెట్లు వచ్చినవి! చిత్రముగ నున్నదే!" అని యనుకొనుచుండఁ జెంతఁ గృష్ణాజినములపై యోగధ్యానాసక్తులై, పరతత్త్వైకధ్యానపరులు, ఉన్నతజటాభారవహులు, నగు నిరువురు

* దేవీభాగవతము.

ఋషులం గాంచి "ఓయయ్యలారా! ఈదంభజప మేల? ఇది ధర్మమార్గమా? తపముచేఁత, విల్లుధరించుట, రెండును బరస్పరవిరుద్ధకార్యములుగదా! చాలుఁ జాలును. "మీతపములిఁకఁ గట్టిపెట్టుఁ"డని పలికెను. ఆమాటల కాఋషు లోయీ! మాతపముగొడవ నీ కేల? మేము బ్రాహ్మక్షాత్త్రముల నిష్ణాతుల మగుట నిట్లుంటి మని యనుకొనరాదా? పో పొమ్ము, మిన్నక విప్రవైరమునకు రాకు"మని పలికిరి. ప్రహ్లాదుఁ డలుకతో "ఏమేమీ! మీరే విప్రులు మీదే తపము ననుకొనుచుంటిరా? అంత బ్రాహ్మక్షాత్రముల నిష్ణాతులే యైనచో, ఏదీ చూతము. మీక్షాత్త్రము నాపైఁ జూపఁగలరేని చూపుఁడు. మీపస తెలియును. ముక్కు మూసికొని మూలఁ గూర్చుండుమునుల కీవిల్లమ్ము లేల యని యన్నమాత్రమున మీ కింత చులకనైతినా? మగవారైన మగువలవలెఁ గూర్చుండక లెం"డని హుంకరించెను. అంత నరుఁడు సరే కాచికొమ్మని విల్లందుకొనెను. ప్రహ్లాదుఁడు ధనుష్టంకారము కావించి బాణము తొడిగి నరునిపైఁ బ్రయోగించెను. నరుఁ డాబాణమును నడుమనే త్రుంచెను. ఇటు లారంభమైనయుద్ధము క్రమముగాఁ జిలికిచిలికి గాలివానయై మహాయుద్ధముగాఁ బరిణమించెను. ప్రళయకాలమేఘములవలె గర్జనములు, తీక్ష్ణాస్త్రశస్త్రప్రయోగములు, మాయాకల్పనములు నొకటొక్కటిగా నారంభమై పోరు ఘోర మయ్యెను. దేవతలాకసమునుండి పుష్పవృష్టిఁ గురిపింపఁ దొడఁగిరి. నారాయణుఁడు కూడఁ జేయి చేసికొని ప్రహ్లాదునిపై ననేకబాణములు ప్రయోగించి యాతఁడు ప్రయోగించినబాణముల నురుమాడుచు వీరవిహార

మొనర్చెను. ఇట్టియుద్ధ మపూర్వము, అసదృశము నని దేవ గంధర్వు లాకసమున నగ్గించిరి. ఇట్లు సహస్రవర్షములు వారి పోరు జరిగెను. ఎవరికిని జయము కలుగదాయెను. ఇంతలో శంఖచక్రగదాపాణియై శ్రీవిష్ణు వచటికి విచ్చేసెను. ప్రహ్లాదుఁడు పోరు మాని భక్తివశంవదుఁడై శ్రీహరిపాదములపై వ్రాలిపోయెను. విష్ణు వాతని లేవనెత్తి "వత్సా! వీరు నా వారు. నీ వెన్నిజన్మములు పోరినను, వారిని గెలువ లేవు. వారిమైత్రి నంది సుఖముండు"మని చెప్పి యదృశ్యుఁ డయ్యెను. ప్రహ్లాదుఁ డాఋషులను నరనారాయణులుగా నెఱిఁగి వారి పాదముల వ్రాలి క్షమాభిక్షముఁ గోరెను. వారు నాతని గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి "ఇది విలాసార్థమైనపోరుకాని విష హృదయపూరిత మగుపోరు కాదు. నీవు మాభక్తుఁడవు. మిత్రుఁడవు. నీకు శుభ మగుఁ బోయి ర"మ్మని వీడుకొలిపి వారు యథాపూర్వము తపోమగ్నులైరి.*

### నరనారాయణులు సహస్రకవచునిఁ జంపుట

తొల్లి సహస్రకవచుఁ డనురాక్షసుఁ డొకఁ డుండెను. ఆతనికిఁ బుట్టుకతోడనే వేయికవచములు సహజముగా నేర్పడెను. ఆతని జయించుట కెవ్వరికిని సాధ్యము కాకుండెను. ఆతఁడు విఱ్ఱవీఁగి లోకముల కుపద్రవము కలిగింపఁజొచ్చెను. ఆతనిఁ జంపుటకు నరనారాయణులు కృతనిశ్చయులైరి. వేయి సంవత్సరములు మహాతప మొనరించినఁగాని యారాక్షసుని జయించుట సాధ్యము కాదని నరనారాయణు లెఱిఁగి సహస్రకవచుని వధించి లోకక్షేమముఁ గలిగింప మనమున సంకల్పించి

* దేవీభాగవతము

బదరికాశ్రమమునఁ దప మొనరింపఁ జొచ్చిరి. ఈసంగతి విని యారాక్షసుఁడు వీరిపైఁ జనుదెంచెను. అపుడు నరనారాయణు లలో నొకఁ డీతనితో యుద్ధము చేయుచుండఁగా రెండవయాతఁడు తపోనిష్ఠ నుండుచు వచ్చెను. బహువర్షములు వారు మహాతప మొనరించి సహస్రకవచునితో యుద్ధ మొనరించి యాతనికవచ ములలోఁ దొమ్మిదివందలతొంబదితొమ్మిది కవచములనుమా త్రము భేదించిరి. ఇంతలో నాతఁడు చనిపోయి యొంటికవచ ముతోఁ గర్ణుఁడై పుట్టెను. ఈతనిఁ జంపుటకై నరనారాయణులు మరలఁ ఫల్గునకృష్ణులై జనించిరి. తుద కర్జునునిచేతిలో నీతఁడు చనిపోయెను.

**నారద నారాయణ సంవాదము**

పూర్వ మొకప్పుడు నారదుఁడు బదరికాశ్రమమునకే తెంచి అవ్యయుఁడు, సనాతనుఁడు, విశ్వాత్ముఁడు నగునారాయణ మహర్షిని భక్తితో సేవించి "మహాత్మా! సిద్ధి నందుటకు దేని నారాధింపవలయునో సెల విమ్మని యడిగెను. నారాయణ మహర్షి నారదు నాదరించి "నారదా! ధ్రువము, అచలము, ఇంద్రియాగోచరము, సూక్ష్మము, అనుపమము, అన సర్వము నకు నంతరాత్మయై వెలుఁగు తత్త్వమునే యారాధింపవలయును. అంతకుమించి సేవింపఁదగిన దేదియు లేదు. బ్రహ్మ మొదలు సకలభూతములు ఆతత్త్వమునే పూజింపవలయు"నని చెప్పెను.

అంత, నారదుఁడు "లోకేశ్వరా! నీవు ధర్మలక్ష్మి కావలిగా నిటు జనించితి వని చెప్పుదురు. అసలు మూలాకృతి యెటు లుండునో దయతోఁ దెలుపుచు. మూలప్రకృతిఁ గను నట్టి యుపాయ మెఱిఁగింపుము. నేను శ్రోత్రియుఁడను, గురు

* దేవీభాగవతము.

భక్తుఁడను, గదా! నాకర్హత గల దనుకొందు"నని పలికెను. అందుల కామహర్షి "ఓయీ? నీకిప్పు డది సాధ్యము కాదు. నీవు చిరకాలము పరమ ఏకాంతికుఁడవై ధ్యాన మొనరింపుము. తరువాత నీ కా పెంపు సంపాదించిపెట్టెద. పొ"మ్మని వీడుకొలిపెను. నారదుఁడు ఆకాశవీధి నేఁగి మేరుపర్వతమున నియతాత్ముఁడై యుండి పాలసముద్రము నుత్తరభాగమున నున్న శ్వేతద్వీపమునందు నిరాహారులు, నింద్రియవృత్తిరహితులు, అస్వేదులు, సుగంధిశ్వేతాంగులు నగుమహనీయులం గాంచి వారు తన్నాదరింపఁ దాను వారికి నమస్కరించి పరమైకాంతికు లగువారికి దవ్వున నిలిచి వారివలెనే తాను నేకాంతికుఁడై దుష్కరతపోనిష్ఠఁ బూని, ఊర్ధ్వబాహుఁడై కదలక మెదలక వివిధనామముల విష్ణుస్తుతి చేయుచుఁ దాను బరవశుఁడై యితరులఁ బరవశులఁ జేయుచు ననేకసహస్రవర్షము లట్లుండ శ్వేతద్వీపవాసి యగునారాయణుఁ డాతనికిఁ దోఁచి యాతని సంశయములఁ దీర్చి తత్త్వ ముపదేశించి యట నున్న యేకాంతికులకుఁ దపోభంగము గావింపక పొ"మ్మని యదృశ్యుఁ డయ్యెను.

నారదుఁడు పరమసంతోషభరితుఁడై శరవేగమున బదరికాశ్రమమునకుఁ జనుదెంచి నరనారాయణులకు నమస్కరించిన వా రాతని కాతిథ్య మిచ్చి గౌరవించిరి. పిదప, నారదుఁడు నరనారాయణులతో నిట్లనెను. "మహాత్ములారా! శ్వేతద్వీపమున నేను గాంచినవిష్ణువు మీవలెనే యుండుటే కాక మీచంద మే యాతనికడ నేను గంటిని. ఆవిష్ణుమూర్తి దయకుఁ బాత్రులైన మహనీయులు తెల్లనివారు, ఇంద్రియములను జయించినవారు,

మానమును దాల్చినవారు. విష్ణువు వారితోడ మైత్రి విహరించు చుండును. ఆ దేవదేవుఁడు నాపైఁ గృపచూపి క్షేత్రజ్ఞప్రకారము సమస్తము తేటతెల్లముగాఁ దెలిపెను. రాఁబోవునాతనియవతారచరిత్రము వినిపించెను. శ్వేతద్వీప మనునది శాంతిస్వరూపము. అచట సూర్యచంద్రులవ్యాప్తియు వాయుదేవునిసంచారము లేవు. ఆలోకనాథునకు ఏకాంతికులకన్నఁ బ్రియతములు లేరు. ఇది యెఱిఁగి నే నేకాంతికుఁడనై యుంటిని. నన్నాతఁడు పీడుకొలుప నిటకు వచ్చితిని. ఇచట మీదయకుఁ బాత్రుఁడనైతిని."

ఆమాటలు విని వారు నారదునితో "నీవు పుణ్యుఁడవు. అచట దేవదేవునిదయఁ బడయుటయు, నాతనితోడిసంభాషణము నన్నియు మే మిట నుండియే కాంచఁగంటిమి. నీవు ధన్యుఁడవు. నీ విచట నుండుము. ఏకాంతివై విష్ణువు నారాధింపు"మని పలికిరి. నారదుఁ డట్లు వేయిదివ్యవర్షములు ఘోరతప మొనరించి యత్యంతశాంతి నంది నరనారాయణుల వీడ్కొని హిమవత్పర్వతమున కేఁగి తనయాశ్రమమునందు బృందారకాదివిశిష్టపూజితుఁడై యుండెను.*

**నరనారాయణులు విశాలుఁ డనురాజుఁ గనికరించుట**

తొల్లి విశాలుఁ డనురాజు సమస్తరాజ్యమును గోలుపోయి శత్రులు నగరము నాక్రమించి తన్నుఁ గెంటివేయ, కాశిచేరి యటనుండి గంధమాదనపర్వతమునందలి యగ్రశిఖరమునఁ గల బదరికావనమున విష్ణుమూర్తి నిగూర్చి ఘోరతప మొనరింపఁజొచ్చెను. కొంతకాలమునకు నరనారాయణు లిరువురు నటకుఁ జను

*భారతము శాంతిపర్వము.

దెంచి యాతనిం గాంచి వరము వేఁడు మనిరి. అంత నాతఁ "డయ్య లారా? నాకువర మను గ్రహింపఁగలవాఁ డొక్క-విష్ణువుతక్క నన్యులు లేరు మీపోటులతో నాకుఁ బనియే"మని పలికెను. అంత వారు "ఓయీ! నీతపమునకు మెచ్చి నీకోరిక లీడేర్ప విష్ణుమూర్తియే మమ్ముఁ బంప మేము వచ్చినారము. నీకోరికఁ జెప్పిన దీర్తుము. లేకున్న నీకర్మము పొ' మ్మనిరి. విశాలుఁడు "ఐనచో శ్రీహరికిఁ బ్రియమగుసమస్తయజ్ఞములు నిర్వర్తించుటకు సరిపడుసమస్తసంపదలు నాకుఁ గావలయు"నని కోరెను. అంత నరుఁ డాతనిఁ జూచి నారాయణుఁ జూపి "రాజా! నారాయణ మహర్షి యనునీతఁడు బదరికావనమున మహోగ్రతపము చేయు విష్ణుమూర్తియే. సర్వజ్ఞత్వమును గోరినవా రీతనిని మత్స్యావతారునిగను, కులవృద్ధిఁ గోరినవా రీతినిని కూర్మావతారునిగను, ముక్తికాములు వరాహావతారునిగను, పాపహరణకాములు నృసింహావతారునిగను, పరిజ్ఞానకాములు వామనావతారునిగను, ధనకాములు బలరాముఁడైనయీతని, శత్రుజయకాంక్షులు రామావతారుఁడగు నితని, తనయకాములు బలకృష్ణులైనయీతని, అఖిలజగదపూర్వసౌందర్యకాములు బుద్ధుఁడగునీతని, ఆధిపత్యకాములు కల్కియగునీతనిని సేవింతురు. కావున, నీవు కల్కివ్రతముఁ జేసి కామ్యసిద్ధి నందు"మని చెప్పి నారాయణమహర్షితోఁ గూడి యదృశ్యుఁ డయ్యెను. విశాలరాజు కల్కివ్రత మొనరించి నరనారాయణులకృపవలన సమస్తరాజ్యమును సంపదలను బడయఁగల్గెను. అవ్వ డాతఁడు కోరినవిష్ణుయజ్ఞము లొనర్చి సిద్ధినందెను.*

---

*వరాహపురాణము.

# శ్రీమహర్షి జీవితకథామృతము

## పిప్పలాదమహర్షి

### స్తుతి

భారతత్యాగధనులలోఁ బ్రథముఁ డగుచు
దివ్యకీర్తిని గన్న దధీచివరుని
యాత్మపత్ని సువర్చయం దలరఁ గన్న
పిప్పలాదమహర్షి సంప్రీతిఁ గొలుతు.

### జననము

సుకన్యాచ్యవనుల పుత్త్రరత్నము దధీచిమహర్షి. దధీచి దేవకార్యమునకై బ్రహ్మేంద్రాదులప్రార్థనము ననుసరించి యోగాగ్నిఁ గల్పించుకొని తనశరీరమును దేవతలకు విడిచి వేసెను. దేవతలు గోగణమును బ్రార్థించి వానిచేఁ బవిత్రములైనదధీచియెముకలను బ్రహ్మచక్రము, వజ్రాయుధము మున్నగు నాయుధములు చేసికొని వానిమూలమున రాక్షసుల నెల్లర నోడించిరి.

దధీచిమహర్షి చనిపోవుసరి కాతనిభార్య సువర్చ గర్భవతియై యుండెను. అతఁడు దేహత్యాగము చేయుటకుముందే ప్రియపత్నిఁ బిలిచి "సతీ! దేవతాప్రార్థనమున నేను నా దేహమును త్యజించుచున్నాను. నేను నాశరీరమును విడిచినఁ గాని

నాయెముకలు దేవతల కాయుధములు కాఁజాలవు. కానినాఁడు, వారు రాక్షసులను జయింపలేరు. రాక్షసులు నాశనము కానిచోఁ దిరిలోకములకు ముప్పు తప్పదు. అందుచే లోకహితార్థమై నేను జనిపోవుచున్నాను. లోకక్షేమ ముపేక్షించి రక్తమాంసాస్థికల్పిత మగు ఈ నీచశరీరముపై మమతఁ దగులుట కంటె అవివేక మింకొకటి లేదు. కావున, నేను పెండ్లికిఁ బోవుచున్నట్లు మహోత్సాహముతో ఈపాంచ భౌతిక శరీరమును విడిచి పోవుచున్నాను. ఈశుభసమయమున నీవు కంటఁ దడిపెట్టుకొని దుఃఖపడుట ధర్మము కాదు. ఉత్తమపత్ని వగు నీవు నా కుత్సాహముతో ననుజ్ఞ యిచ్చుటే నాకును నీకును లోకములకును శ్రేయస్కర" మని యామె నొప్పించియే చని పోయెను. కాని, సువర్చ మహాపతివ్రత కాన నాతఁడు మరణించిన వెనువెంటనే తానును బతితో సహగమింపఁ దలపోసి యొకపిప్పలవృక్షమునీడఁ గూర్చుండి తనగర్భమును జీల్చుకొనెను. అంత నామెకు మహాతేజస్వియై యొకపుత్త్రుఁ డుదయించెను. సువర్చ యాతనిం జూచి "బిడ్డా ! వంశోద్ధారకుఁడ వగు నీవు జనించుటతో నిఁక నేను జీవించియుండవలసినపని తీరినది. నీవు దానవీరులలో దయావీరులలో నగ్రగణ్యుఁ డగు దధీచి మహర్షికి జనించిన పుణ్యపురుషుఁడవు. నీ కిఁక ఈపిప్పల వృక్షమే తల్లియై నిన్నుఁ బెంచును. వత్సా ! ఆశీస్సులు. ముద్దుబిడ్డా! నీకు దీవనలు. ఏకారణముచేతఁ గానిమ్ము మన క్కీస్థితిఁ గొనితెచ్చిన దేవతలు సంతానశూన్యు లగుదురుగాక ! నీవు జ్ఞానమూర్తివై వంశగౌరవమును నిలుపుదువుగాక!" యని

చితిలోఁ బడి యసువులఁ బాసి పతివెంట బ్రహ్మలోకమున కేఁగి దివ్యస్థితిఁ గాంచెను.

## బా ల్య ము

ఇట్లు జనించినబాలుని ఆపిప్పలవృక్షము సువర్చాసాధ్వి తన కొప్పగించినట్లు భావించి రాత్రివేళఁ జంద్రునిఁ బ్రార్థించి యాతనివలన నమృతముఁ గొనితెచ్చి యాబాలుని కుగ్గుఁబాలుగాఁ బోసి యాతని కాఁకలిదప్పులు లేకుండఁజేసెను. ఆహా! అచేతనము లైనవస్తువులు సైతము సచేతనములై కన్నతల్లికన్న నెక్కువమేలు చేకూర్చుట మనపవిత్రభారత చరిత్రమున వింత కాదు. ప్రకృతిమాత చల్లగఁ జూడనినాఁడు కన్నతల్లి యేమి చేయఁగలదు? ప్రకృతిమాతశక్తి యట్టిది. ఆమహాశక్తిలో మాతృశక్తి నిబిడీకృతము. ఈవిధముగఁ బిప్పలవృక్షము నీడఁ బిప్పలవృక్షమాత యుగ్గుఁబాలతోఁ బెరిగినవాఁడగుట ఈబాలునికి "పిప్పలుఁడు," "పిప్పలాదుఁడు" అను పేళ్లు వచ్చెను.*

అమృతాస్వాదనమున ఆఁకలిదప్పి లెఱుఁగక శుక్లపక్షపాకరునివలె పిప్పలాదుఁడు చక్కఁగాఁ బెరుగఁజొచ్చెను. తాను బుట్టినచోటగు నావృక్షచ్ఛాయనే ఆశ్రమముగాఁ జేసికొని యామునికుమారుఁడు తపోజీవనమున కలవాటుపడి దివ్యతేజము దివ్యశక్తి నందఁగాంచెను.

## త ప స్సు

పిప్పలాదుఁడు కాలక్రమమునఁ దనతల్లిదండ్రులు చనిపో వుటకుఁ గారణము నెఱిఁగి దేవతలపై మిక్కిలి కోపించెను. రాక్షసవధనిమిత్తము ఉపాయాంతరములాలోచింపవలయునేకాని

---

*స్కాందపురాణము, మాహేశ్వరఖండము, కేదారము.

మహాతపస్వి మహాయోగి యగుతనతండ్రిని ఆతనిమూలమున మహాసాధ్వి యగుతనతల్లిని బొట్టఁబెట్టుకొని తనకుఁదలిదండ్రులు లేనిలోటు కలిగించి రని యాతఁడు దేవతలను గఠినముగా శిక్షింపఁ దలఁచెను.

ఇటు లెంచి యాతఁడు తన కమృతమునొసఁగి రక్షించినచంద్రుని బ్రత్యక్షముచేసికొని తనయభిప్రాయ మాతనికిఁ దెలిపి తనకోరిక తీరునుపాయమును జెప్పు మని ప్రార్థించెను. చంద్రుఁడానందించి "వత్సా! నీవు పరమపవిత్ర మగుగోదావరీనదీతీరమున కేఁగి యట శివునిగుఱించి తప మొనరింపుము. ఆతఁడు నీకోరిక తీర్చు"నని యుపాయము చెప్పి వెడలిపోయెను.

పిప్పలాదుఁడు చంద్రుఁడు చెప్పినచొప్పున గోదావరీతీరమున కేఁగి మహాతపస్సు చేసెను. అట ననుక్షణము శివధ్యానము, శివస్తోత్రము, శివోచ్చారణము, శివారాధనము, తప్పనొం డెఱుంగక యాతఁడు తదేకదీక్షతో నుండెను. అంతఁ గొంతకాలమునకు శివుఁడు ప్రత్యక్షమై "వత్సా! ఏమి కోరి నన్నుగుఱించి తపించితి"వని యడిగెను. పిప్పలాదుఁడు "మహేశ్వరా! ఎంతవారికైనను మాతాపితృవియోగము మహాబాధాకరముగదా! అందును గనుతెఱవనిపసికందున కంతకంటె దుఃఖప్రద మే మున్నది? నా కీమహాదుఃఖమును గలిగించినసర్వదేవతలను సమయింపఁ గలయొకకృత్యను బంపి నన్నుఁ గటాక్షింపు" మని కోరెను. శివుఁ డట్లే యని యదృశ్యుఁ డయ్యెను.

## క్షమ

ఈశ్వరునిపంపున నొకకృత్య చనుదెంచి పిప్పలాదుని యాజ్ఞపకారము దేవతావధోద్యోగ మారంభించెను. ఈసంగతి విని యశేషదేవతాగణములు బ్రహ్మాదిపురస్కృతులై యీశ్వరునికడకుఁ బరుగున విచ్చేసి యాతనిపాదములపైఁ బడి రక్షింప వేఁడుకొనిరి. ఈశ్వరుఁడు వారెల్లర కభయమిచ్చి తాను స్వయముగాఁ బిప్పలాదునికడ కరుదెంచి యనునయించి "వత్సా! దేవతలు లోకపూజ్యులు. వారివినాశమువలన నీ తలిదండ్రులు బ్రతికి రారుకదా! నీతలిదండ్రులు మహాత్యాగనిధులై ఉత్తమలోకములఁ జూఱఁగొన్నారు. కావున, నీవు వారికై విచారింపకు. వెంటనే సర్వదేవతావధోద్యోగము మానుకొ"మ్మని హితముపదేశించెను. ఆమాటలు విని పిప్పలాదుఁడు "మహాదేవా! సర్వలోకేశ్వరుఁడవగునీయుపదేశము నేను దప్పక విందును. కాని, ఉత్తమలోకముల నున్నానాతలిదండ్రులఁ జూచి మాటాడఁగలశక్తి ననుగ్రహింపు"మని భయభక్తులతోఁ బ్రార్థించెను. ఈశ్వరుఁ డట్లే యని యాతని కాశక్తి నొసఁగి కృత్య నుపసంహరింపు మనెను. అందులకుఁ బిప్పలాదుఁడు సమర్థుఁడుకాక శివునే యుపసంహరింపఁ గోరెను. శివుఁ డాకృత్యను హిరణ్మయపాత్రముల గంగాదినదులమూలమున సముద్రమునఁ జేర్పుఁ డనియు నది యందు బడబానలముఁ జేరు ననియు దేవతలతోఁ జెప్పి యదృశ్యుఁ డయ్యెను.

పిప్పలాదుఁడు దివ్యశక్తియుతుఁడై పితరు లున్నయుత్తమలోకముల కేఁగి సువర్చాదధీచులతో మాటాడి వారియాశీ

ష్యుల నందుకొని వారు వాత్సల్యమునఁ దన్నుఁ బ్రబోధింపఁ దిరిగి తనయాశ్రమమునకు విచ్చేసెను. శివునికృత్యయు గంగాది నదులమూలమున సముద్రమును జేరి యందున్న బడబానల ముతోఁ గలిసిపోయెను.

ఈరీతిని పిప్పలాదుఁడు బాల్యముననే శివుని మెప్పించి తలిదండ్రుల నుత్తమలోకములఁ జూచి మాటాడుశక్తి సంపా దించి వారితో మాటాడి వారిప్రబోధమున శాంతచిత్తుఁడై నిజాశ్రమమున మహాతపస్సు చేసికొనుచుండెను. *

## వి వా హ ము

పిప్పలాదుఁడు తపస్సువలన బ్రహ్మజ్ఞానమును సంపా దించి మహోత్తమ మగునాధ్యాత్మవిద్యారహస్యముల నెఱింగి దివ్యతేజస్వియై వెలుంగుచుండెను. ఆతనికి జన్మముతోడనే బంధుమిత్రమమకార మంతరించెను. లోకమంతయు సర్వేశ్వర మయముగా భావించి యాతఁడు సదాశివు నారాధించెను. సం కల్పసిద్ధి నంది యామహర్షి యొకనాఁడు నిజాశ్రమప్రాంగణ మున నుండ నిలింపదంపతులు వనవిహారముచేయుచు రమిం పటఁ గాంచెను. ఆక్షణమున నాతనికి వివాహేచ్ఛ కలిగెను. పిమ్మట యాతఁడు పుష్పభద్ర యనునదిలో స్నానముచేయ వెడలుచుండెను. దారిలో నాతని కొకజగదేకసుందరి యగుకన్య వనవిహారము చేయుచుఁ జెలికత్తెలతోఁ గానవచ్చెను. పిప్పలా దుఁడు చెలికత్తెలవలన నామె పద్మ యనుపేరు గలఅనరణ్య మహీపాలునికూఁతు రని తెలిసికొని స్నానజపాదికములు సిర్వ

* శివపురాణము.

ర్తించుకొని అనవన్యమహీపాలునిగృహమున కేఁగెను. అనవన్యుఁడు స్వాయంభువమను వంశమువాఁడు. ఆతఁడు జితేంద్రియుఁడు, జితాహంకారుఁడు, విష్ణుభక్తుఁడు. భృగుమహర్షి యాధ్వర్యవమున నాతఁ డనేకయజ్ఞము లొనర్చి యింద్రపద మల్పమని తృణీకరించెను. ఇంద్రాదిదేవతావిభులను, బలి మున్నగు రాక్షసేశ్వరులను సంగ్రామముల జయించినమహావీరుఁ డతఁడు. ఆతనికి నూఱుగురుకొడుకులు. ఒక్కతయే కూఁతురు. ఆమె పేరు పద్మ. ఆమె చక్కనిచుక్క. సుగుణములకుఁ జోటు. యోగ్యతకుఁ బెట్టినది పేరు. అన్నివిద్యలలోను అందెవేసినచేయి. అందచందములకు ఆకరము.

అనవన్యుఁడు సపరివారముగా నెదురేఁగి పిప్పలాదమహర్షిని షోడశోపచారములఁ బూజించి యాతఁడు వచ్చినపనిఁ దెలుపు మని ప్రార్థించెను. పిప్పలాదుఁడు సంభాషణాదికము చేఁ గాలముపుచ్చక "నేను కన్యాభిక్షార్థము వచ్చితిని. నీయేకైకపుత్రి యగుపద్మను నా కిచ్చి వివాహముచేసి కృతార్థునిఁ జేయు"మని కోరెను. అనవన్యుఁ డాశ్చర్యము, భయము, భక్తి సంకోచము, నొక్కసారిగాఁ గలుగ నేకైకపుత్రిక యగుసౌందర్యరాశి నొకమునిముచ్చున కిచ్చి యెట్లు పెండ్లిచేయుదు నని వెనుకంజవేసెను. అంతఁ బిప్పలాదుఁడు "ఓయీ! నీకును నాకును లోకమునకును దీనివలన మే లగును. నీపుత్రికను నా కిచ్చుటకు సంశయించితివా తరువాత నీవు విచారపడవలసి వచ్చును. భూతభవిష్యద్వర్తమానవేది నగునామాట బొంకుచే వినాశముఁ గొనితెచ్చుకొనవల" దని హితబోధ చేసెను.

తివా క్షణమాత్రలో భస్మమై పోదువు. తపఃపూతవిగ్రహుఁడగు పిప్పలాదమహర్షిని అనరానిమాట లంటివి. గుణసౌందర్యము లేని దేహసౌందర్యము మేడిపండువంటిది. అది మూర్ఖులను భ్రాంతి పఱచునే కాని విజ్ఞానుల నాకర్షింపఁజాలదు. స్త్రీలోలుఁడగు వానిస్పర్శమాత్రమున సర్వపుణ్యములు నశించును. పరదారాభిమర్శనునికంటెఁ బాపాత్ముఁ డెవ్వఁడును లేఁడు. నీతోఁ బ్రసంగించుటే నాకుఁ బాపహేతువు. తల్లి నగునాయందు దుష్టభావమున దురుక్తులాడితివి. ఆపాపమున నీకుఁ గాలాంతరమున క్షయము కలుగుఁగాక !" యని పలికెను. ఆపతివ్రతాశాపమునకు భయపడి ధర్ముఁడు నిజరూపమునఁ గాననై "సాధ్వీ ! పరకాంతలను మాతృభావమునఁ జూచువారిలో మొదటివాఁడను, సర్వశాస్త్రగురుఁడ నగుధర్మదేవుఁడను. నీవు నేను పతివ్రత వని యెఱిఁగి విధిచోదితుఁడనై నిన్నుఁ బరీక్షించుట కిట్లు పలికితిని. అంతేకాని నేను బరస్త్రీలోలుఁడను గా" నని వాక్రుచ్చెను.

పద్మ జగద్గురుఁడైనధర్మునిం జూచి నమస్కరించి "దేవా ! నీవు సర్వకర్మసాక్షివి. సర్వాంతర్యామివి. సర్వజ్ఞుఁడవు. నీవు నన్నుఁ బరికించుట కట్లంటి వని యెఱుఁగక శాపానలదగ్ధు నొనర్చితిని. పంచభూతములకైన వినాశము కలదు కాని పతివ్రతాశాపమునకు లేదు. నీవు నశించిన సృష్టియే నాశమగును. దీని కొకయుపాయముఁ జెప్పెదను. నీవు కృతయుగమున నాలుగుపాదములతోడను, త్రేతాయుగమున మూఁడుపాదములతోడను, ద్వాపరమున రెండుపాదములతోడను, గలియుగమున నొంటిపాదము తోడను సంచరించెదవు. మరలఁ గృతయుగము రాఁగా నీవు పరిపూర్ణుఁడ వౌదువుగాక ! యనను. హరి

భక్త, హరభక్త యతి బ్రహ్మచారి వానప్రస్థ భిక్షుక ప్రాజ్ఞపతివ్రతలయందును, ధర్మపాలకు లగు రాజులందును, సన్మార్గు లగు వైశ్యులయందును, విప్రసేవకు లైనశూద్రులయందును, నీవు పరిపూర్ణుఁడవే యై యుండువు. ప్రతియుగమున నట్టివారే నీ కాధారులై యుండురు. మహాత్మా! అశ్వత్థవటబిల్వతులసీచందన దేవార్హ పుష్పములయందును, దేవాలయతీర్థ పుణ్యస్థల వేద వేదాంగశ్రవణస్థల, శ్రీకృష్ణనామోక్త శ్రుతిగీతస్థల, వ్రత పూజా తపో యజ్ఞ దీక్షాగోదేహములయందును నీవు నివసించి యుండువు. తండ్రీ! నీకు రక్షణము నొసఁగితిని. ఇఁకఁ బతిసేవార్థము గృహమున కేఁగద. సెల విమ్మని కోరిన ధర్ముఁడు సంతోషించి "కాంతా! నీపాతివ్రత్యమునకు మెచ్చితిని. నీకు వరమిచ్చెదను. నీభర్త మార్కండేయమునికన్న నెక్కుడాయుష్మంతుఁడు. కుబేరునికన్న ధనవంతుఁడు, ఇంద్రునికన్న నైశ్వర్యవంతుఁడు. కపిలునికన్న సిద్ధుఁడు, శివసముఁడు, నిత్యయౌవనుఁడు, అధికసౌందర్యయుతుఁడు నయి వెలయుఁగాక! నీవు సుస్థిరయౌవన భాగ్యము, పతిసేవాభాగ్యము, సత్పుత్త్రభాగ్యము నంది శాశ్వత కీర్తి నందుదువుగా!" అని యాశీర్వదించి యదృశ్యుఁ డయ్యెను.

## సంతానము

పద్మ పతి కిట్లు మహావరములు గడించి యాశ్రమమునకు విచ్చేసి స్నానజపతపాదులఁ దీర్చి కూర్చుండియున్న భర్తకెఱిఁగి జరిగినయావద్వృత్తాంతమును నివేదించి నిలిచెను. పిప్పలాదుఁ డమితానంద మంది యాలావణ్యసీమ నంకతలమున కాహ్వానించి గౌరవించి "సాధ్వీ! అనుకూలవతి, అభిమానవతి, పతియే సమస్తమని త్రికరణములఁ బూజించుపత్ని లభించుట

కంటె నుత్తమునఁ డగుమానవునకుఁ గావలయున దేమున్నది? నీకతమునఁ గలిగినయీవరప్రసాదమునకు నీకు ఋణపడియున్నా" వని యామెకు మన్ననఁ జూపెను.

తరువాతఁ గాలక్రమమున పిప్పలాదునికృపవలనఁ బ్రహ్మనయవిశారదులు, పితృతుల్యతేజులు నగుపుత్రులను బదుగురఁ బడసి కడుపుచల్లనికాంతగా ఖ్యాతి గాంచెను.

ఆపిదపఁ బిప్పలాదమహర్షి వానప్రస్థాశ్రమమును స్వీకరించి ఆయాశ్రమవిధుల నిర్వర్తించుచు బ్రహ్మవిద్యాపారంగతుఁడై బహుశిష్యగణ పరివృతుఁడై కాలముపుచ్చుచుండెను. అనేకు లతనికడకు వచ్చి తమతమ సంశయములఁ దీర్చుకొని పోయెడివారు.

## బ్రహ్మజ్ఞానబోధ

ఒకనాఁడు కాత్యాయనమహర్షి సంతతివాఁ డగు కబంధుఁ డనుఋషియు, భృగువంశమువాఁడగు వైదర్భి యనుఋషియు, ఆశ్వలాయన వంశస్థుఁ డగుకౌశల్యుఁ డనుఋషియు గర్గమహర్షి వంశజుఁ డగుసౌర్యాయణిఋషియు, సత్యకాముని సంతతివాఁ డగుశైబ్యుఁ డనుఋషియు, భరద్వాజునివంశజుఁ డగుసుకేశుఁ డనుఋషియుఁ దమకుఁ గలసంశయములఁ దీర్చుకొనుటకై పిప్పలాదునికడకు సమిత్పాణులై వచ్చి యాచించిరి. వారు సగుణబ్రహ్మోపాసన చేసి చిత్తశుద్ధి కలిగి వాసనాత్రయముల నడంచి బ్రహ్మజ్ఞానసంపాదనకై సద్గురువు నన్వేషించి వచ్చి రని యెఱిఁగియు, పిప్పలాదుఁడు వారితో 'వత్సలారా! మీరు నాకడ నొక సంవత్సరము తపస్సు బ్రహ్మచర్యము నవలంబించి శుశ్రూష చేయవలయును. ఆపిదప మీకుఁ

గలిగినసంశయముల నన్నిటిని నాకుఁ దెలుపవచ్చును. నే నెఱిఁగినంతవఱకు వానిని దీర్ప యత్నించెదను." అని పలికెను. ఆయా ముముక్షువులును సత్యమగు జిజ్ఞాసతోడనే యాతనికడ కరుదెంచినవారుకాన, నట్లే యని పిప్పలాదునియాశ్రమమున, తపోబ్రహ్మచర్యవ్రతదీక్షాపరులై సంవత్సరకాల ముండి శుశ్రూషలు చేసి యాతనియాదరమునకుఁ బాత్రులైరి.

ఆపిదప నొకనాఁడు స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చి సుఖముగాఁ గూర్చుండి యాయాఱుగురను సన్నిధికిఁ బిలిచి యొక్కొక్కరే తమకుఁ గలిగినసంశయము లడుగుఁ డని పిప్పలాదుఁడు వారిని గోరెను. తొలుత, కబంధుఁ డిట్లడిగెను. "దేవా! ప్రజాసంసృష్టి యెట్లు జరుగుచున్నది?" దాని కిట్లు పిప్పలాదమహర్షి సమాధానము చెప్పెను. 'సృజింపఁబడవలసిన జీవుల యదృష్టముకతన బ్రహ్మదేవుఁడు సృష్టిచేయ సంకల్పించి మహాతపస్సు చేసి యొకమిథునమును సిద్ధముచేసెను. రయి ప్రాణము లే యామిథునము. రయి యనఁగాఁ జంద్రుఁడు; ప్రాణ మనఁగా సూర్యుఁడు. వీరికతముననే సమస్తసృష్టియు జరుగుచున్నది. సూర్యుఁడు తూర్పున నుదయించి యన్నిదిశలకు వ్యాపించి ప్రాణస్వరూప మగునాతఁడు సర్వజీవరాసులప్రాణములను గాపాడచున్నాఁడు. ఈసూర్యుఁడే వైశ్వానరస్వరూపుఁడై సర్వవ్యాపకుఁడు విశ్వరూపుఁడు నగుచున్నాఁడు. ఈతనివలనఁ బ్రాణాగ్నులుదయించుచున్నవి. ఇవి యీతని తేజోమూలమున నెల్లెడల వ్యాపించి జీవుల నుజ్జీవింపఁజేయుచున్నవి.

పరబ్రహ్మము పురుషుఁడై అంతర్యామిగాను గాలరూపమై బహిర్గతముగాను నున్నాఁడు. అంతర్ముఖమునఁ గర్మ

సాక్షిగను, బహిర్గతముగాఁ గాలస్వరూపుఁడుగను నుండియుండెడు చరాచరప్రపంచమునకు సృష్టిస్థితిలయహేతుభూతుఁ డగుచున్నాఁడు. ఆతఁడు సంవత్సరస్వరూపుఁడై దక్షిణాయనమునఁ బితృయానమార్గమునఁ జంద్రమండలప్రాప్తి, ఉత్తరాయణమున అర్చిరాదిమార్గమున బ్రహ్మలోక ప్రాప్తి కలిగించుచున్నాఁడు. మొదటిది పునరావృత్తి సహితము రెండవది పునరావృత్తిరహితము. మొదటిదానికి యజ్ఞయాగాదులు, వాపీకూపతటాకాది నిర్మాణము మున్నగుఫలాపేక్షణీయములగుకర్మములు మార్గములు. రెండవదానికిఁ దపోబ్రహ్మచర్య శ్రద్ధాభక్తులు, ఆత్మజ్ఞానముమార్గములు.

సంవత్సరమున నైదుఋతువులు. (హేమంతశిశిరములిట నొకేఋతువు) పండ్రెండుమాసములు. మాసము ప్రజాపతిస్వరూపము. శుక్లపక్షము ప్రాణస్వరూపము. ఇది శ్రేష్ఠము. దినము ప్రజాపతిస్వరూపము. పగటిభాగము ప్రాణస్వరూపము; ఇది శ్రేష్ఠము. పగటివేళ సంసారప్రవృత్తికి మూలముగురతికాంక్ష గనువారు ఆయుక్షయము నందుదురు. రాత్రివేళఁ గనువారు బ్రహ్మచర్యఫలమునే కాంతురు. అన్నము ప్రజాపతిస్వరూపము. ఇది ప్రాణస్వరూప మగుపురుషుని శుక్రమును స్త్రీశోణితమునఁ జేర్చినపుడు ప్రజాసంసృష్టి హేతు వగుచున్నది. ఇట్టిప్రజాపతివ్రతానుష్ఠాను లగుసత్యశౌచతపస్సంపన్నులవలన నుత్తమసంతానము, అది లేనివారివలన నీచసంతానము కలుగుచు మొత్తము ప్రజాసృష్టి యగుచున్నది."

పిదప, భృగువంశ్యుఁ డగువైదర్భి యిట్లు ప్రశ్నించెను. "దేవా! ఈశరీరమును ధరించువా రెవరు? దానిని బ్రకాశింపఁ

జేయువా రెవ రెవరు? వారిలో శ్రేష్ఠుఁ డెవరు?" దీనికి మహర్షి పిప్పలాదుఁ డిట్లు బదులు చెప్పెను. "ఈశరీరమును ధరించునది ప్రకాశింపఁజేయునది ప్రాణమే. ఒకప్పుడు పంచభూతములు, జ్ఞానేంద్రియకర్మేంద్రియములు వేని కవియే శ్రేష్ఠములనియు తమవల్లనే శరీరము రక్షితమగుచున్న దని యనఁగాఁ బ్రాణ మది కా దనియుఁ దానే యైదువిధములఁ విభాగించుకొని శరీరమును గాపాడుచున్నా ననెను. కాని, ఇంద్రియము లీమాట నమ్మని కారణమునఁ బ్రాణము శరీరమును విడిచి పోఁబోఁగా దాని వెంట నన్నియుఁ బోవలసివచ్చెను. ఈప్రాణప్రాధాన్యమును బట్టి యింద్రియములు దానిని "నీవలననే అగ్ని తపించుట, సూర్యుఁడు ప్రకాశించుట, ఇంద్రుఁడు పాలించుట, వరుణుఁడు వర్షము కురియుట, వాయువు వీచుట, భూమి ధరించుట, అన్నము బలము నిచ్చుట, స్థావరజంగమము లన్నియును జీవించుట జరుగుచున్న' దని స్తుతించెను. సమస్తము ప్రాణముపై నాధారపడియున్నది. ప్రజాపతి ప్రాణరూపియై దేహమునఁ గలఁడు. ఇంద్రియము లన్నియుఁ బ్రాణవశములు. అగ్నియందుండి యాహారము సమర్పించువాఁ డతఁడే. స్వధాస్వరూపి, తపఃఫలప్రదాత ప్రాణమే. ప్రాణాధారముననే యింద్రుఁడు స్వర్గ మేలుచున్నాఁడు; రుద్రుఁడు లయింపఁజేయుచున్నాఁడు; ప్రాణాధారముననే సూర్యాదిజ్యోతిస్స్వరూపములు ప్రకాశించుచున్నవి; లోకమును ప్రకాశింపఁజేయుచున్నవి. వేయేల? సర్వము ప్రాణవశమే. కావున, ప్రాణమే శరీరమును నిలుపునది; ప్రకాశింపఁజేయునది; శ్రేష్ఠమైనది."

అంత, ఆశ్వలాయనవంశజుఁ డిట్లు ప్రశ్నించెను. "దేవా! ప్రాణ మెట్లు పుట్టును? శరీరమెట్లు చొచ్చును? ఎట్లు విభజింపఁబడి తనపనులు నెఱవేర్చును? దానిస్థానస్వరూపము లేవి?" పిప్పలాదుఁ డిట్లు బదులుచెప్పెను. "ఆత్మనుండియే ప్రాణముపుట్టును. పురుషునియిచ్ఛనుబట్టి మనస్సు కోరుటనుబట్టి, అది శరీరముఁ బ్రవేశించును. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము నను నైదు తెఱఁగుల నిది విభజ్యమానము. ప్రాణము చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణముల నుండును. అపానము గుహ్యేంద్రియములనుండి శరీరానవసరము లగుస్థూలపదార్థములను ద్రోసివేయును. సమానము మధ్యప్రదేశమున నుండి తిన్నయన్నమును జీర్ణింపఁజేసి యారసమును శరీరమునకుఁ బంచుచున్నది. వ్యానము హృదయము నుండి బయలుదేఱునూటొక్కనాడులు నొక్కొక్కటి డెబ్బది రెండువేలుగా మాఱి శరీరమంతటను వ్యాపించియుండుటకుఁ దోడ్పడుచున్నది. ఉదానము శరీరకర్మవాసనలను దనలోఁ గలుపుకొని ఆయాజీవులపుణ్యపాపముల కాయాపుణ్యపాపలోకములకుఁ గొనిపోవుచున్నది. సూర్యుఁడు ప్రాణమునకు బాహ్యనివాసస్థానము. ఈతఁడు చక్షురింద్రియమూలమున శరీరమందలిప్రాణము ననుగ్రహించును. భూమియందలి దేవత అపానము ననుగ్రహించును. భౌతికవాయువు వ్యానమును, మధ్యాకాశము సమానమును అనుగ్రహించును. ఉదానము దేహపతనసమయమునఁ బైకి లేచి పోయి జీవుఁడు సంకల్పించినలోకమునకుఁ గొనిపోవును. ప్రాణము నిట్టిదానినిగాఁ దెలిసికొని యుపాసించువారికిని వారిసంతానమునకు నకాలమృత్యుబాధ

లుండవు. ఈప్రాణస్థానస్వరూపములఁ దెలిసినవారు ముక్తి నందుదురు."

అనంతరము గర్గమహర్షిసంతతివాఁ డగుసౌర్యాయణి యిట్లు ప్రశ్నించెను. "దేవా శరీరమున నిద్రించున దేది? మేల్కొనున వేవి? స్వప్న మననేమి? సుఖమెట్లు కలుగును? దేనియం దన్నియుఁ బ్రవేశించి శాంతినందును ?" పిప్పలాదు డిట్లు సమాధానమిచ్చెను. "సూర్యుఁ డస్తమించునపు డాతని కిరణములన్నియు నాయనలో నంతర్భూతమై యదృశ్యమైనట్లు, మరల ఉదయించినపుడు సూర్యునినుండియే వెలువడునట్లు ఇంద్రియములన్నియు మనస్సులో నైక్యమై మనస్సునుండి బయలు వెడలును. మనస్సునం దేకీభావమును బొందుస్థితికే నిద్ర యని పేరు. అపు డింద్రియము లేపనియుఁ జేయవుకాన నిద్రించిన వని యందురు. శరీరమున మేల్కొనునవి ప్రాణాగ్నులు. ఇవి దేహమున నెప్పుడును బనిచేయుచునే యుండును. స్వప్న మనఁగా మనమిదివఱలోఁ జూచినవానిని, విన్నవానిని, అనుభవించిన వానిని, మఱియితరములను ఉదానము యజమానియైనమనస్సునకుఁ గనఁబఱుచుట. స్వప్నమునుండి గాఢసుషుప్త్యవస్థ పొందిన ఆత్మసుఖానుభవము కలుగును. స్వప్నమునుండి మెలఁకువకలిగిన, స్వప్నవస్తువు లన్నియు మిథ్యయని తెలియునట్లు సంసారకూపమునుండి గుర్వనుగ్రహమువలన బయటపడ్డ జగన్మిథ్యాత్వము తేటతెల్లమగును. సర్వమును పరమాత్మయందుఁ బ్రవేశించుటవలనే మహాసుఖము కలుగును. పంచభూతములు, తన్మాత్రలగుశబ్దాదులు జ్ఞానేంద్రియకర్మేంద్రియములు, తద్వ్యవహారము, అంతఃకరణచతుష్టయము, తేజస్స్వభావము, ప్రాణస్వ

భావము పరమాత్మయందు లయించియుండును. ఈపరమాత్మ జ్ఞానేంద్రియకర్మేంద్రియాంతఃకరణచతుష్టయ పంచభూతసప్త ధాతురహితము. ఈయాథార్థ్యమును దెలిసికొనువారే మోక్ష స్థితి నందుదురు. పరమాత్మ యింద్రియములతోఁ గలిసి తెలి విగా వ్యాప్తమై సర్వలయస్థాన మగును. ఇది తెలిసినవారు ప రమాత్మభావమును దెలిసినవారు.'

ఆతరువాత సత్యకామవంశీయుఁ డగు శైబ్యుఁడు "దేవా! అంత్యకాలమువఱకు ఓంకార ముపాసించినవారేలోకమునకుఁ బోవుదు"రని ప్రశ్నించెను. పిప్పలాదుఁ డిట్లు సమాధానము చెప్పెను. "ఓంకారము నొక్క-సారియైన నుపాసించువార ఋగ్వేదాభిమానదేవతకృపవలన మరల మనుష్యులై జన్మి తురు; ద్విమాత్రికాల ముపాసించువారు యజుర్వేదాభిమాన దేవతవలన చంద్రమండలమున కేఁగి తిరిగి నరలోకమున జన్మి తురు. త్రిమాత్ర ముపాసించువారు పాపవిముక్తులై సామవేదా భిమానదేవతచే సూర్యమండలమార్గమున బ్రహ్మలోకము చేరుదురు.''

అనంతరము భరద్వాజవంశీయుఁ డగు సుకేశుఁ డిట్లు ప్రశ్నించెను." దేవా! షోడశకళాపురుషుఁ డెవరు? ఆతనిస్థితి యేమి? పిప్పలాదుఁ డిట్లు బదులుచెప్పెను. "షోడశకళా పురుషుఁడు శరీరమునందే యున్నాఁడు. షోడశకళలను బ్రకాశిం పఁజేయువాఁడు కావున నాపురుషునికి షోడశకళాపురుషుఁ డను పేరు వచ్చెను. దేహము స్వస్థముగా నుండుట కాధార మగు ప్రాణమునుండి శ్రద్ధ, ఇంద్రియములు, పృథివ్యాదులు, మనస్సు అన్నము, వీర్యము సమస్తము జనించుచున్నవి. నదు లన్నియు

సముద్రమువంకకే ప్రవహించి సముద్రములోఁ గలిసి నామరూపరుచిభేదములు కోలుపోవునట్లు, షోడశకళలు సర్వసాక్షియగుపురుషునియందుఁ బ్రవేశించి యస్తమించి నామరూపములు కోల్పోయి పురుషునిలో లీనమగును. ఆపురుషుఁడే అమృతస్వరూపుఁడు."

ఈరీతిఁ బిప్పలాదమహర్షి ఆయార్గురుఋషులు అడిగిన సంశయములకుఁ దగినరీతిని సమాధానము చెప్పఁగా వారు సంతోషించి సంశయరహితమైనబ్రహ్మజ్ఞానము నాతనివలన గడించి యాతనిని నుతించి వీడ్కొనిపోయిరి.*

బ్రహ్మవేత్త యగు పిప్పలాదమహర్షి చేసిన మోక్షవిద్యామహోపదేశము గర్భోపనిషత్తునందు, యోగమును గూర్చి ఓంకారమునుగూర్చి వెల్లడించినతత్త్వము పరబ్రహ్మోపనిషత్తునందుఁ గలవు.

ఇట్లు పిప్పలాదమహర్షి బ్రహ్మజ్ఞానులలో నగ్రేసరుఁడు, యోగీశ్వరులలో మొదటివాఁడు, మహర్షులలో నుత్తముఁడునై వెలుఁగొందెను.

---

* ప్రశ్నోపనిషత్తు.

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## పులస్త్యమహర్షి

### స్తుతి

"అకలంకసుగుణమౌక్తికజన్మదేశ మై
యేమౌనిహృదయాబ్జ మింపుగులుకు
త్రిభువనవిమలవారిజవనీహంసి యై
యేతపోధనుకీర్తి యెమ్మెగాంచు
అజమనఃకమలహర్షాపాది యై యేమ
హర్షిమహాతపం బతిశయిల్లు
సకలమౌనివతంసులకు మేలుబంతి యై
యేపుణ్యుదినచర్య యేపుఁ జెందు
వినతదేవకిరీటభావితసరోజ
రాగరుచిచక్రచంక్రమణగతుల
నేమునిపదాంబుజము లొప్పు నామహాత్ము"
సంస్తుతింతుఁ బులస్త్యు విశ్వప్రసిద్ధు.

(ఉత్తరరామాయణము ౧. ౧౧౬.)

### జననము

తొలుదొలుత విష్ణుమూర్తి నాభికమలమునుండి జనించిన బ్రహ్మ యాతనిశాసనమున విశ్వమును సృజింపఁ జిరకాలము మహాతప మొనరించెను. పిదప నాతఁడు సనకసనందనసనాతన సనత్కుమారులను దనసంకల్పముచే సృష్టించెను. వారు సంసార

మొల్లక బాల్యమునుండియు హరిపరతంత్రులై భక్తాగ్రగణ్యులై యుండిరి. తరువాత, బ్రహ్మ వామభాగమునుండి స్వాయంభువ మనువును,శతరూప యనుసుందరిని బుట్టింప వారికిఁ గ్రమముగా సమస్తక్షత్రియకులమును జనించెను. పిదప, బ్రహ్మ నుదుటి నుండి యేకాదశరుద్రులను సృజింప వారు క్రోధమూర్తు లైరి. అనంతరము బ్రహ్మ నేత్రములనుండి అత్రిక్రతువులను, నాసిక నుండి అరుణిని, ముఖమునుండి అంగిరసుని, దక్షిణవామపార్శ్వ ములనుండి భృగుదక్షులను, మెడనుండి నారదుని సృజించి కుడిచెవినుండి పులస్త్యుని, ఎడమచెవినుండి పులహుని బుట్టించెను.

## తపస్సు

పులస్త్యుఁడు సత్త్వగుణసంపదతో నలరారుచుఁ దండ్రి యగుబ్రహ్మ కన్నివిధముల సమానుఁడై యుండెను. పులస్త్యుఁడు ధర్మతత్పరుఁడై లోకహితముఁ గోరి తండ్రియాజ్ఞచొప్పునఁ దపస్సుచేయుచు మునిముఖ్యులకు మొదటివాఁడు, జ్ఞానసంపదలకు స్థానము, శాంతమునకు నెలవు, కృపకు నివాసస్థానము నయి సూర్యునితో సమాన మగుతేజమున వెలుఁగొందుచుండెను. ఆతఁడు మేరుపర్వతప్రాంతమున నొకయాశ్రమమును నిర్మించుకొని యందుఁ దమోగుణమును పాఱఁద్రోలి, స్త్రీముఖముఁ గాంచుట కిచ్ఛగింపక, క్రోధమును గామముతోఁ గూడ జయించి అపరశివునివలె నుగ్రమగుతప మొనరింపఁ జొచ్చెను.

## వివాహము

ఈసమయమునఁ గర్దమప్రజాపతి తనకు జనించిన పుత్త్రికలను దొమ్మండుగురను బ్రహ్మదేవుని యాజ్ఞచే నవబ్రహ్మలకు

నొసంగ నిశ్చయించి హావిర్భువు అనుతనకూఁతును పులస్త్య మహర్షి కిచ్చి పాణిగ్రహణ మొనరించెను. తపోధ్యానానురక్తుఁ డయ్యుఁ బులస్త్యుఁడు బ్రహ్మయాజ్ఞఁ దలదాల్చి హావిర్భువును వివాహమాడినవెంటనే యత్తమామలయాశీర్వచనము లంది భార్యాసహితుఁడై తనయాశ్రమమునకు వెడలి గృహస్థధర్మ మును నిర్వహించుచుండెను. కాలక్రమమున హావిర్భువు గర్భముఁ దాల్చి అగస్త్యుఁ డనుసుపుత్త్రునిఁ గాంచెను. ఈపుత్త్రుఁడు కొంత కాలము పెరిగినపిదప మరణించి మఱియొకజన్మమునుగని తుదకు జఠరాగ్నిరూపియై ప్రవర్తించెను. *

**పులస్త్యుఁడు తృణబిందునియాశ్రమమునఁ దప మొనరించుట**

పిమ్మట, పులస్త్యబ్రహ్మ సంసారమును విడిచి సర్వసం గత్యాగియై తీవ్రతప మొనరింపఁ దృణబిందునియాశ్రమమున నకు వచ్చెను. అచట, నాతఁడు మహోగ్రతప మారంభించెను అపుడు :

"వలరాజుకోసమై యలవసంతుఁడు గుంపు
చేసినచిలుక తేజీ లనంగ
వనరాశి నావరించినకరంజక మేఘ
తతి మించుచంచలాలత లనంగ
భువనముల్ భ్రమియించి పూవిల్తు నెలయింప
రతి దాల్చురూపాంతరంబు లనంగ
మునిచిత్తముల నొంప మనసిజం డపు డంప
వచ్చుమంత్రాధిదేవత లనంగ

---

* భాగవతము. చతుర్థస్కంధము. ౨౬

బెళుకుఁజూపులు నొయ్యార మొలుకునడలుఁ
బలుకుఁ దొడలును సిబ్బెంపుఁగులుకుగుబ్బ
లమరునమరాహిఖచరకన్యలు సఖీస
మాజములతోఁ బులస్త్యాశ్రమంబుఁ జేరి.

పాటపాడుదు రొక్కచోట మోడులు పల్ల
వించి కోయిలలకు విందుసేయ
ఆట లాడుదు రొక్కచోటఁ గాంచీఘంటి
కలు మ్రోయ మరుమదావళము లనఁగ
మాటలాడుదు రొక్కచోటఁ జక్కెరవింటి
జాణతేజికిఁ దియ్యకాణ మొసఁగ
నీటుసేయుదు రొక్కచోటఁ గేళిని మనో
హరుఁ డేడ వలచునో యని చలింప

నగుదు రొకచోటఁ గుముదసంతతులు విరియ
నిలుతు రొకచోట మొట్టతమ్ములు జనింప
ఖచరగంధర్వకిన్నరాంగనలు మీఱి
బ్రహ్మకొడుకుతపోవనాభ్యంతరమున."

(ఉత్తరరామాయణము. ౧. ౧౧౭, ౧౧౮)

అంతేకాక, వా రొండొరులు చూపుకొనుచు ఉద్యానవన మనోహరతను మించుమునితపోవనమునఁ గలగోరంట, సురపొన్న, తియ్యమామిడి, జాజి, మల్లె, సంపంగి, మున్నగు పూవులను స్తుతించుచు నచట విహరింపఁ జొచ్చిరి.

## పులస్త్యుని శాపము

ముద్దులమూటగట్టునాయువతులట యౌవనమద ముట్టిపడ విలాసహాసములతో విచ్చలవిడి విహరించుచుండఁ గాంచిన పులస్త్యునికి మనస్సు చలింపఁజొచ్చెను. వెంటనే యాతఁడు తపోవిఘ్నమున కిష్టపడక, ఆకాంతలతో బిగ్గఱగా నిట్లు పలికెను: "ఓలీలావతులారా! ఇదిమొదలు నాకంటఁ బడినస్త్రీకిఁ గన్యాత్వము దూషితమై వెంటనే గర్భము కలుగు" నని శపించెను. ఈమాటలు విన్నిమచ్చెకంటిలు భయపడి వెంటనే యట నుండి వెడలిపోయిరి.

## తృణబిందునిపుత్రి గర్భిణియగుట

ఈసంగతి యెఱుఁగక తృణబిందుఁ డనురాజర్షి పుత్రి యొకతె, ఒప్పులకుప్పయై చెలికత్తెలతోఁ గూడి వనవిహారము చేయుచుండెను. ఆమెశరీరసౌరభము గుమగుమలాడుచు వాయుదేవునకు గంధవహుఁ డనుబిరుద మిచ్చెను. ఆమెకాంతిలతలు అల్లుకొన్నచెట్లు బంగారుచెట్లుగాఁ దోఁచెను. ఆమె మందహాసకుందములకై మన్మథుఁడు వెదకఁజొచ్చెను. ఆమె కరతలకాంతులు తీఁగెలఁ జేరి యెఱ్ఱచిగుళ్ళను బుట్టించునట్లుండెను. ఆమెపలుకులు చిలుకపలుకులవలెను, ఆమెనడలు నెమ్మికొమ్మలనృత్యభంగిమలవలెను, ఆమెనఖరోచులు భూదేవికి గంధముపూయురీతి నుండెను. ఆమెచెలికత్తె యెటకో పోఁగా నామెను వెదకుచు వచ్చి కంచుగీసినకంఠమునంటికఁఠమున జటాశ్రుతి పాఠము చేయుచున్నపులస్త్యబ్రహ్మను, రక్తజటాధరుని, దర్భాసనమునఁ గూర్చుండి, లేడిచర్మమును ధరించియున్నమహానీయుని గాంచెను.

వెంటనే యామెకు నడుము బలిసి, చనుమొనలు నల్లనై, ముఖము తెల్లనై, నడలు మందగించి, మేను కృశించి, అరుచి మించి, నూగారు ఉల్లసించి, ఆయాసము అతిశయించి గర్భసంపద తోఁచెను. అప్పు డాచిహ్నములు గాంచి యామె "అయ్యో! పరమచిత్రముగ నిట్లగుటకుఁ గారణమేమి? ఉత్తమరాజర్షికడుపునఁ బుట్టినపట్టి యిట్టిరట్టుఁ గట్టుకొన్న దని నలుగురు తిట్టిపోయరే? నే నిచ్చటికి వచ్చినవేళావిశేషమో? ఓషధులమహిమయో? అయ్యో! లేఁబ్రాయపుఁగన్నెనై యిట వచ్చిన నేనిపు డీగర్భముతో నింటి కేఁగుచోఁ గన్నయ్య యేమనును? పిన్నయ్య లేమన్న నేమి చెప్పఁగలను?" అని చింతించుచు, నింటి కేఁగి తండ్రిముందు నిలిచి కన్నులనీరు కాలువలై పాఱ తలవంచి నిలుచుండ నామెను గాంచి తండ్రి యిట్లనెను. "ఓసీ! నీ విట్లు కన్యాత్వముననే గర్భవతి వెట్లైతివి? ఏకఠినుఁడు నీకిటు చేసెను? కులమున కపకీర్తిఁ దెచ్చి తలిదండ్రు లేడ్వ, నలుగురు నవ్వ, బంధువులు తలవంప, ఎవఁడును బెండ్లాడక జన్మమునష్టియగ నిట్టిపని యెట్లు జరిగినది?" అని యడుగఁ బుత్రి తా నేపాపమెఱుఁగకపోవుట, చిత్రగతిని జరిగినసంగతి చెప్పెను. తృణబిందుఁ డంత దివ్యదృష్టిఁ గాంచి పులస్త్యబ్రహ్మశాపము, ఆమె యెఱుఁగ కాతనిఁ గాంచుట, అందుచే గర్భమగుట తెలిసి వెంటనే పుత్రికను గైకొని పులస్త్యబ్రహ్మకడ కేఁగి నమస్కరించి కూఁతును జూపి "దేవా! ఈమె నాపుత్రి. నీకతమున గర్భవతి యయ్యెను. నీ వీమెను బరిగ్రహించి మమ్ముఁ గాపాడు" మని ప్రార్థించెను.

ఇది విని యామహర్షి హర్షించి యామెను భార్యగాఁ బరిగ్రహించెను. తృణబిందుఁ డానందించి పుత్త్రి నాతని కొప్పగించి డెందమునందలికుందు మాని మందిరమున కరిగెను.

## విశ్రవోబ్రహ్మజననము

నాఁటినుండి యాసతీతిలకము పులస్త్యమహర్షికి సర్వోపచారములు చేయుచు నుండెను.

"స్నానంబు గావించి చనుదెంచునంతలో
జపవేది తగురీతిఁ జక్కఁజేయు
జపనిష్ఠ యొలరించి చాలించునంతలోఁ
జక్కఁగా దేవపూజకు నమర్చు
దేవపూజ యొనర్చి తిలకించునంతలో
షడ్రసాపూర్ణభోజనము పెట్టు
భోజనంబైకరంబులు కడ్గునంతలోఁ
బర్ణాజినములచేఁ బా న్పొనర్చు
పాన్పుపైఁ జేరునంతలో బడలి రని మ
నంబునఁ దలంచి తాలవృంతమున విసరి
తొడలపై నంఘ్రులుంచి యొత్తుచు ననేక
సేవ లొనరించుఁ దపసి కచ్చిగురుఁబోడి."

(ఉ.రా. ౧.౧౪౫)

ఆమె చెప్పినచో అడిగినదానికి సమాధానము చెప్పుటే కాని ఉత్తరోత్తరము లాడి యెఱుఁగదు. ఎపు డేది యుచితమో యది భర్త చెప్పకుండఁగనే మనస్సున గ్రహించి యామె మెలఁగు.

చుండెను. ఆమెదీమసము, తాలిమి, వినయము పతియెడ నలరించెను. అందులకుఁ బులస్త్యుఁ డెంతయు సంతసించి యామె కడుపున విశ్రవోబ్రహ్మ జనించు ననియు, నాతనివలన నుభయ వంశములు జగద్విఖ్యాతి నందు ననియుఁ జెప్పి యామె నాద రించెను. పిదప, నొకసుముహూర్తమున తృణబిందునిపుత్రి యొక్కసుపుత్రుని గాంచెను.

ఆబాలుఁడు మాతృగర్భమున నున్నప్పటినుండియుఁ దండ్రి చదువుశ్రుతులు విన్నవాఁ డగుట నాతనికిఁ బులస్త్యుఁడు 'విశ్రవసుఁ'డని పేరుపెట్టెను. ఈబాలుఁడు శుక్లపక్షచంద్రుని వలెఁ బెరుగుచుఁ దండ్రిని బోలినవిద్యావైదుషి, తపశ్శక్తిఁ గాంచి బాల్యముఁ గడపి :

"పూరుషాకారంబు పొందుత్రయీవిద్య
బాలత్వ మొందినబ్రహ్మచర్య
మాలోకగోచర యాధర్మదేవత
ప్రాణంబు లూనినభవ్యనియమ
మవయవంబులు దాల్చినట్టివైరాగ్యంబు
జంగమస్థితిఁ గన్నశాంతరసము
వైయాత్య మొందినవైదికాచారంబు
బ్రాహ్మణ్య మెనయుకృపాగుణంబు
తానె యన విశ్రవోబ్రహ్మ తల్లిదండ్రు
లనుమతి యొసంగ నొకతపోవనముఁ జేరి
ఆశలు జయించి వెలయు భూమీశులీల
ఆశలు జయించి తపము చేయంగఁ దొడఁగె."

(ఉ. రా. ౧. ౧౫౬.)

ఆతరువాత నీతఁడు దేవవర్ణిని యనునామెను బెండ్లాడి యామె యందుఁ గుబేరుని గాంచెను. విశ్రవుఁడు తరువాతఁ గైకసిని బరిణయమాడి యామెయందు రావణ కుంభకర్ణ విభీషణులను శూర్పణఖను గాంచెను.

## పులస్త్యబ్రహ్మ రావణుని విడిపించుట

రావణుఁడు కాలక్రమమున బ్రహ్మవరగర్వితుఁడై కార్తవీర్యార్జునితో యుద్ధమొనర్ప నాతఁ డీతనిఁ బట్టి చెఱఁబెట్టెను. రావణుఁ డిట్లు చెఱఁబడి యుండఁగా నీవృత్తాంతమంతయు విని పులస్త్యబ్రహ్మ దయదలఁచి మనుమని విడిపింపఁ బూని కార్తవీర్యార్జునిపీటి కేఁగి మొగసాల నిలిచెను. ద్వారపాలు రేఁగి తమప్రభువుతోఁ బులస్త్యునిరాక దెలుపఁ గార్తవీర్యార్జునుఁడు సపరివారముగా నెదు రేఁగి యాతనిని స్వీకరించి యర్ఘ్యపాద్యాదు లిచ్చి గౌరవించెను. పిదప నాతఁడు పులస్త్యునితో "దేవా! మీ రిచటికి విచ్చేయుటవలన నేను ధన్యుఁడ నైతిని. నాకుల మదృష్టముఁ గాంచెను. మిమ్ము సేవించి నేను మహాప్రభవ మందఁగంటి" నని "ఇదిగో. వీరు నాపుత్త్రులు. వీరు మిత్త్రులు. వీ రమాత్యులు. వీరు బంధువులు, వీరు భటులు. మే మందఱము మీయాజ్ఞ నిర్వర్తించెదము. మీ రవచ్చినపని సెలవీయుఁడని" విన్నవించెను. పులస్త్యుఁ డానందించి "రాజా! నీప్రియోక్తికి భక్తికి యుక్తికి శక్తికి సంతసించితిని. నీవు దేవేంద్రవైభవము ననుభవించుపుణ్యాత్ముఁడవు. రావణుని బట్టి చెఱఁబెట్టితి వని విని యాతనిబంధవిముక్తిఁ గోర నీకడకు వచ్చితిని. అట్లొనరించి నన్నానందింపఁజేయు"మని పలికెను. కార్తవీర్యార్జునుఁడు వెంటనే రావణుని చెఱనుండి విడిపించి

గౌరవించి యాతని కనేకభూషణముల నొసఁగి సాగనంపెను. పులస్త్యుఁ డిట్లు మనుమని చెఱఁబాపి తాను యథేచ్ఛముగాఁ బోయెను.

**పులస్త్యుఁడు పరాశరునికి వరమిచ్చుట**

తొల్లి విశ్వామిత్త్రుఁడు వసిష్ఠునితోఁ జిరవైర మూని యాతనిపుత్త్రుల నూర్వురఁ జంపించెను. ఆనూర్వురలో శక్తి మహర్షి మరణించినవేళనే యాతనిభార్యగర్భమునఁ బరాశరుఁడు జన్మించెను. ఈతఁడు తల్లిగర్భమున నున్నప్పుడే వేదశాస్త్రపురాణాదివిద్య లెల్ల నేర్చెను. పిదప నీతఁడు తల్లివలనఁ దండ్రిదారుణమరణవృత్తాంతమును విని కోపపరీభూతచిత్తుఁడై సర్వరాక్షసవధార్థమై యొకమహాసత్త్ర మారంభించెను. ఆసత్త్రమున ననేకశతసహస్రసంఖ్యలు గలరాక్షసులు నశించిరి. మిగిలినరాక్షసులు వశిష్ఠునికడ కేఁగి యాతనిపాదములపైఁ బడి రక్షింప వేఁడుకొనిరి. వశిష్ఠుఁడు వారికోరిక మన్నించి మనుమనికడకు వచ్చి "వత్సా! నీ విట్లు జీవహింసచేయుట ధర్మము కాదు దీనికిఁ గారణము నీకోపముకదా:

"కోపము కల్గినచోటన
పాపము వర్తిల్లుఁ బాపపరులకుఁ గోప
వ్యాపారంబులె తోఁచును
గోపము పాపంబు నొక్కకుదురై నడచుం గా.
అపవర్గము స్వర్గంబును
దపమును సుకృతంబు యశము ధర్మముఁ బాపున్
విపులక్రోధము కావునఁ
దపసులకుం గ్రోధ మింత తగునే? తండ్రీ!

(విష్ణుపురాణము. ౧. ౧౭, ౧౮)

అని చెప్పి "నాయనా! నీతండ్రి దివ్యసుఖము లనుభవింపఁ దలఁచి నిమిత్తమాత్ర మగువధమూలమున మరణించెను. ఆతనిఁ జూచుశక్తి నీకు నే ననుగ్రహించెదను. కాన, నీవు పరమశాంతుఁడవై నిరపరాధులై దైన్యముతో నున్న రాక్షసుల రక్షింపు"మని కోరెను. ఆమాటలు విని పరాశరుఁడు యాగము నాపివేసి శాంతచిత్తుఁ డయ్యెను. అప్పుడు పరాశరునిపాలికి దైత్యదానవచోదితుఁడై మహామునిగణసమేతుఁడై పులస్త్యబ్రహ్మ విచ్చేసెను. వసిష్ఠుఁ డాతనిఁ గాంచి పలుతెఱఁగుల నర్చించెను. పులస్త్యుఁ డానందించి కూర్చుండి రాక్షసవధహేతు వగు సత్రము మాని ప్రశాంతచిత్తుఁడై యున్నపరాశరుని జూచి "వత్సా! పరమకోపివై యుండియు నీతాత చెప్పినయంతనే వినయవివేకవిలసితుఁడవై యజ్ఞము నాపి నాకెంతో సంతోషమొదవించితివి. నీ కేదైన వర మొసఁగ వలయు నని యుల్లమువ్విళులూరుచున్నది. కాన, నీ కేమి కావలయునో కోరుకొమ్మ"ని పలికెను.

పరాశరుఁడు శ్రద్ధాభక్తివిధేయుఁడై "ఆర్యా! నా మనస్సు నిరంతరము వేదపురాణశాస్త్రక్రియలం దత్యంతాసక్తమై యున్నది. నీవు దయతో నాకు భవ్యజ్ఞానసంసిద్ధియు, వాచామాధురియు, మహాప్రతిభ, వైదగ్ధ్యము, నిచ్చి సంతృప్తు నొనరింపు"మని కోరెను, పులస్త్యుఁ డావర మిచ్చి యాతని వీడ్కొని యేఁగెను. వసిష్ఠుఁడు మనుమని నాశీర్వదించి వెడలెను. నాఁటినుండి పరాశరమహర్షికి సకలవేదపురాణశాస్త్రములు కరతలామలకములై పెంపొందెను.

## భీష్మపులస్త్య సంవాదము

తొల్లి భీష్ముఁడు గంగాద్వారమున నధ్యయన వ్రతపరుఁడై తండ్రికి సకలశుభములు సమకూర్చుటకు శుభకర్మము లొనరించుచు నుండెను. ఆతని పితృదేవతాభక్తికి, పరమధర్మచరితమునకు మెచ్చి పులస్త్యమహర్షి యాతనిఁజూడ నేతెంచెను. అతిభక్తితో నాతనికి భీష్ముఁ డతిథిసత్కారము లొనరించి పూజించి యాతనిపాదపద్మములను శిరమున నిడుకొని "మహర్షీ! నేను భీష్ముఁడను. నీదాసుఁడను. ఆజ్ఞాపింపు"మనెను. పులస్త్యుఁ డాతని వినయవిధేయతలకు మెచ్చి యాతనిపితృభక్తి, వ్రతదీక్ష నభినందించి "భీష్మా! నే నమోఘదర్శనుఁడను. నారాక వ్యర్థము కారాదు. నీకుఁ గావలయునది కోరుకొమ్ము, ఇచ్చెద" ననెను. అంత భీష్ముఁడు "దేవా! నామనస్సు తీర్థసేవాపరాయణమై యున్నది. కావున, నీవు దయయుంచి తీర్థసేవాఫలమును సర్వతీర్థకీర్తనములతో నెఱింగింపుము. నీకన్న నుత్తమ తీర్థప్రియుఁడు, తీర్థదర్శి, తీర్థవిజ్ఞాని మఱియొకఁ డేఁడీ?" అని పలికెను.

పులస్త్యుఁడు ప్రమోదభరితుఁడై యిట్లు చెప్పెను. "భీష్మా! వినుము. సర్వేంద్రియములను జయించినవారు, అహంకారము, ప్రతిగ్రహాపేక్ష లేనివారు, అల్పభోజనులు, ఆరంభరహితులు నయ్యు నిత్యసంతోషులైనవారు, సత్యవ్రతులు, శుభాచారులు, క్రోధరహితులు, ధర్మతత్పరులు సర్వతీర్థసేవాఫలమును, సర్వయజ్ఞక్రియాఫలమును బడయుదురు. ఇఁకఁ బుణ్యతీర్థములు వానివానిఫలములు తెలిపెద వినుము. పుష్కర మనుతీర్థము సర్వతీర్థములందును శ్రేష్ఠము.

వీనిని సేవించువారికి సర్వక్రతుఫలము లభించును. బ్రహ్మ
లోకప్రాప్తి కలుగును. జంబూమార్గము, తండులికాశ్రమము,
అగస్త్యసరము, మున్నగుతీర్థములాడిన అశ్వమేధఫల మగు
కణ్వాశ్రమము, ధర్మారణ్యము మున్నగుతీర్థములఁ గన్న వార
సర్వపాపవిముక్తు లగుదురు. నర్మద, దక్షిణసింధు, చర్మణ్వ
వీనియందు స్నానమొనరించినచో అగ్నిష్టోమఫలము కలుగును
వసిష్ఠాశ్రమము, పింగళతీర్థము, ప్రభాసతీర్థము, సరస్వతీసాగ
సంగమము, ద్వారవతీపురమునఁ గలపిండారకతీర్థము మున్న
తీర్థములు మిక్కిలిఫలప్రదములు. శంకుకర్ణేశ్వరమున నీశ్వరు
సేవించిన దశాశ్వమేధఫలమగు. శక్రకుమారి, శ్రీకుంజరము
విమలము, మలహరము, దేవిక, రుద్రతీర్థము, వినశనము,
రూపపుష్కరము, రుద్రకోటి యనెడుతీర్థములు మహాఫలవం
ములు. కురుక్షేత్రము సర్వతీర్థఫల మొసంగును. అశ్వినీతీర్థమ
సోమతీర్థము, రామహ్రదము, మున్నగు ననేకతీర్థములు కల
ఇవి యన్నియుఁ బాపహరములు. తుదకు బ్రహ్మలోకప్రా
కరములు. పృథూదకము వ్యాసాదిమహాయోగుల కాస్ప
మైన పరమపుణ్యతీర్థము." ఈవిధముగఁ బులస్త్యుఁడు భీష
నకు సర్వతీర్థములను, వానివానిఫలములను సవిస్తరముగా
పించెను. పిదప "వ్రతహీనులు, ఉపవాసపరాఙ్ముఖులు, దు
తులు, శుచిహీనులు తీర్థసేవచేయలేరు. చేసినను వారికి ఫలం
లేదు. నీవు గుణశాలివి. ధర్మరతుఁడవు. కాన, సర్వ
యాత్ర చేసి యభీష్టసిద్ధు లందు"మని చెప్పి వెడలిపోయెను
భీష్ముఁడు పులస్త్యుఁడు చెప్పినచొప్పునఁ దీర్థయాత్ర లొనరిం
పరమప్రశాంతి గాంచెను.

## పులస్త్యస్మృతి

పులస్త్యమహర్షి ధర్మశాస్త్రవేత్త. ఈతనిస్మృతికే "పులస్త్యస్మృతి"యని పేరు. ఈస్మృతి మనకింకను సమగ్రముగా లభింపలేదు. అటనట భాష్యకారు లుదాహరించిన శ్లోకములను బట్టియే ఈస్మృతి స్వభావమును మనము గ్రహింపవలసియున్నది. శారీరశౌచ ప్రకరణమున విశ్వరూపుఁడు పులస్త్యస్మృతిలోని యొకశ్లోక ముదాహరించెను.* శ్రాద్ధకాలమున బ్రాహ్మణులు శాఖాహారదానము, క్షత్రియవైశ్యులు మాంసాహారదానము, శూద్రులు మధుప్రదానము చేయవలయునని పులస్త్యస్మృతిలోఁ గలదని మితాక్షరమునఁ గలదు.* అందే పండ్రెండువిధములైన మద్యములు పులస్త్యస్మృతిలో వివరింపఁబడెనని కలదు.† మఱియు అపరార్కమున సంధ్య, శ్రాద్ధ అశౌచ, విషయములపై పులస్త్యస్మృతినుండి యుదాహరణములు కలవు. ఇందే, జ్ఞానకర్మలు రెండునుగలసినవే ప్రయోజనకరములని పులస్త్యస్మృతినుండి యుదాహరింపఁబడినది. పక్షియొక్క ఱెక్కతో నెగురలేనట్లు, జీవి జ్ఞానకర్మలలో

---

* "స్నాతకస్యత్రయోహ్యేతే, పంచాహ్నేగ్నిహోత్రిణః
వర్ణానేవం గృహస్థేషు, శౌచకల్పాన్ని యోజయేత్." 1-17

* "మున్యన్నం బ్రాహ్మణస్యోక్తం మాంసం క్షత్రియవైశ్యయోః
మధుప్రదానం శూద్రస్య సర్వేషాం చావిరోధి యత్." 1-261.

† "పానసం ద్రాక్ష మాధూకం ఖార్జూరం తాల మైక్షవమ్.
మధూత్థం సైరమారిష్టం మైరేయం నారికేళజం
సమానాని విజానీయా న్మద్యాన్యేకాదశైవతు,
ద్వాదశంతు సురామద్యం సర్వేషామధమం స్మృతమ్." III-253

నొక్క-దానినే యాశ్రయించి మోక్షమందలేఁడు. ‡ ఇట్లే స్మృతి చంద్రికలోను సుమారు నలువది యుదాహరణములు గలవు. వీనివలన పులస్త్యస్మృతిస్వభావస్వరూపములు కొంతవఱకు మనకు గోచరించుచున్నవి.

ఇట్లు, పులస్త్యుఁడు స్మృతికర్త, బ్రహ్మ, మహర్షి, సర్వజ్ఞుఁడు, సర్వదేవపూజనీయుఁడునై వన్నెకెక్కెను.

---

‡ "జ్ఞానకర్మసమాయోగాత్పరం ప్రాప్నోతి పూరుషః
పృథగ్భావాన్న సిధ్యన్తి ఉభేతస్మాత్ సమాశ్రయేత్.
జ్ఞానం ప్రధానం నతు కర్మహీనం కర్మప్రధానం నతుబుద్ధిహీ...
తస్మాదుభాభ్యాంతు భవేత్ప్రసిద్ధిర్న హ్యేకపక్షో విహగః ప్రయా...
111-57 పుట 911

# శ్రీమహర్షి జీవితకథామృతము

## బకదాల్భ్యమహర్షి

### స్తుతి

వింశతిబ్రహ్మకల్పజీవితు వివేక
పారగుని జీర్ణతరవటపర్ణధారి
నాత్మవిజ్ఞాననిస్సంశయక్రియాతి
చతురు బకదాల్భ్యుఁ గొల్తుఁ సంస్తుతుల నతుల

### జననము

అనేకయుగములకుఁ బూర్వ మొకప్పుడు దల్భుఁ డను నొకమహర్షి యుండెను. ఆతఁడు విష్ణుమూర్తిని బ్రార్థించి కల్పాంతకాలములనైన మరణము లేనిచిరంజీవి యగు సుపుత్త్రుని గాంచెను. ఈబాలుఁడు బకపుష్పపేశల మగు మేనితోడను మహాసౌరభముతోడను విరాజిల్లుటచే నీతనికి బకుఁ డని తండ్రి పేరుపెట్టెను. ఈతఁడు బకుఁ డనియు దాల్భ్యుఁ డనియు బకదాల్భ్యుఁ డనియుఁ బిలువఁబడుచుండెను. ఈతనిని మిత్ర యను నొకఋషిపత్నియు గ్లావుఁ డను నామెభర్తయుఁ బెంచుటచే నీతనికి ద్వ్యాముష్యాయణుఁ డనియుఁ బేరువచ్చెను. అనఁగాఁ గన్నతండ్రికిని బెంపుడుతండ్రికిని బుత్త్రుఁడుగా వ్యవహరించువాఁ డనియర్థము. ఇంతేగాక గ్లావుఁ డనియు గ్లావమైత్రేయుఁ డనియు నీతఁడు తన్నుఁ బెంచినతండ్రివలనఁ బేర్గాంచెను.

హ్మణసాహాయ్యమున ననంతలక్ష్మీసముపేతులయి సముద్ర నేమిభూచక్రమును రక్షించి అక్షయసుఖము లనుభవించిరి. వినీతుఁడయి విప్రులచే ననుశాసితుఁడైనరాజు అలబ్ధలాభము, లబ్ధరక్షణము, దానిని వృద్ధినందించుట యనుమూఁడులాభములను పొందఁగల్గును. సమరరంగమునందలి యేనుఁగున కంకుశమువలె యథేచ్ఛాదృష్టి గలరాజునకు విప్రుఁడంకుశమై రాజును ధర్మమార్గమునకుఁ ద్రిప్పును. బ్రాహ్మణరహితుఁడయి హీనుఁడయినరాజును బ్రజ వలవదు. ప్రజానురాగము లేనిరాజురాజ్యము సుస్థిరము కానేరదు. మీరు స్వయము ధర్మాత్ములు; ధౌమ్యాదు లగుమహర్షులు మీకు సహాయులు. అందుచే ధర్మనిత్యులు బ్రాహ్మణప్రియులు నగుమీకు నిరంతరాభ్యుదయపరంపర కలుగు" నని పలికెను. ధర్మరాజాదులు సంతోషించి యామహర్షికి సాష్టాంగ మెఱఁగిరి. ఆతఁడు వారి నాశీర్వదించి వెడలిపోయెను, *

## చిరంజీవిత్వము

బకదాల్భ్యమహర్షి దైవప్రసాదమునఁ జిరంజీవులలో నొకఁడై వివాహ మొల్లక బ్రహ్మచర్యదీక్షానవద్యుఁడై మహాతపస్విగా జీవితమును గడపుచు ననేకయుగములు జీవించెను. ఆతఁడు తరువాత సాగరమధ్యమందలి యొకదీవియందు సర్వమును రోసి మహాజ్ఞానమూర్తియై నివసించుచుండెను.

## కృష్ణార్జునులరాక

ధర్మరాజశ్వమేధయాగము చేయుఁబూని యజ్ఞాశ్వమును విడిచినప్పుడు దానిరక్షణకై కృష్ణార్జునులు వెడలిరి.

---

* భారతము అరణ్యపర్వము.

ఆయజ్ఞాశ్వ మనేక దేశములఁ ద్రిమ్మరి, యాయా దేశముల
రాజులు నయమునఁ గొందఱు భయమునఁ గొందఱు యుద్ధ
మున నోడి కొందఱు నర్జునునకుఁ గప్పములు కానుకలు సమ
ర్పింపఁగా, తుద కుత్తరసముద్రతీరమునకుఁ జని సాగరమధ్య
మున నురికెను. అపుడు కృష్ణుఁ డర్జునుని, గిరివనసముద్రా
దుల నడ్డులేక నడవఁగలుగురథములు గలమయూరధ్వజ,
ప్రద్యుమ్న, హంసధ్వజ, బభ్రువాహనులఁ బురస్కరించుకొని
రథముతో సాగరగర్భముం జొచ్చెను. ఆరథమునఁజని వారు సము
ద్రమునందలి యొకదీవిఁ గని యందుఁ బ్రవేశించిరి. ఆదీవి
యందే బకదాల్భ్యమహర్షి అనేకయుగములనుండి పెరుఁగుచు
వచ్చిన శరీరముతోను, గడ్డముతోను, జడముడులతోను నున్నను
కోటిసూర్యులదివ్యతేజముతోఁ బ్రకాశించుచుండెను. ఆతఁడు
తనతలపై నెండి వాడి పండిపోయినమఱ్ఱియాకుల నడ్డముగా
వైచికొని నిరంతరహరిచరణారవిందభజనానంద నిర్మగ్నుఁడై
కోటిచంద్రప్రభాశోభిత మగునగుమొగ మొప్ప, ఆఁకలిదప్పులు,
శీతవాతాతపములు, లాభనష్టములు మున్నగునట్టివానివలన
నైన నించుకైన సంచలన మెఱుంగక బ్రహ్మాసనమున బ్రహ్మ
నిష్ఠుఁడై యపరబ్రహ్మవలెఁ గూర్చుండియుండెను. ఆమహా
మహుని దూరమునఁ జూచి కృష్ణార్జునులు, మయూరహంస
ధ్వజులు ప్రద్యుమ్నబభ్రువాహనులు రథము దిగి యమితశ్రద్ధా
భయభక్తులతో మెల్లమెల్లనఁ బాదచారులై శిరములఁ గరములు
మొగిడ్చి యాతనిఁ జేరి సాష్టాంగదండప్రణామము లాచరించిరి.
బకదాల్భ్యుఁ డందుల కానందింపక శ్రీకృష్ణుఁ జూచి "ఈవె
వ్వని కెన్నివింతలు? ఈమాఱుమూల నున్న నాకిన్ని గొడవ

లెందులకు ? వీరందఱి నిట కేల కొనివచ్చె" నని యసహ్యించుకొనెను.

అంత నర్జునుఁడు నెమ్మదిగా మరల నమ్మహర్షికిం బ్రణమిల్లి "మహాత్మా! కటాక్షింపుఁడు. పాండవేయుఁడ ననుగ్రహింపుఁడు. దేవా! మీశరీరమున నెన్నివింతలు పుట్టినవి! దేహము నలుసందులఁ బుట్టలు మొలిచినవి. ఆపుట్టలలో నెన్నియోపడగలు గలపాము లనేకములు తిరుగుచున్నవి. మీమోఁకాళ్లనుండి మోఁచేతులనుండి యనేకవృక్షములు పుట్టి పెరుగుచున్నవి. ఆచెట్టుకొమ్మలపైఁ బెక్కుపక్షిసంతానములు గూండ్లుకట్టుకొని సుఖజీవనముఁ జేయుచున్నవి. మీరు చివికిపోయిన మఱ్ఱియాకులఁ దలమీఁద నిడుకొని హాయిగాఁ గూర్చుండియున్నారు. ఈవింతల పరమార్థమును దెల్పి నన్ననుగ్రహింపుఁడు. ఇవే మీకు నావేఁడికోళ్లు. కోటిమ్రొక్కులు" అని పలికెను. అందుల కామహాత్ముఁడు నవ్వుచు "అర్జునా! నిన్ను నే నెఱుఁగనివాఁడఁ గాను. తొలుత మిమ్ము ద్వైతవనమునఁ గలిసికొని సంభాషించితినిగదా! అప్పుడీజీర్ణశరీరమును దీర్ఘశ్మశ్రుజటావళిని సవదరించి కామరూపమున సామాన్యమునివలె మీసమీపమునకు వచ్చి మిమ్మాశీర్వదించితిని. మీరు ధర్మపరాయణులు. కనుక, మీరన్న నా కిష్టము. మఱి యిప్పటినా స్థితి యడుగుచుంటివి. వత్సా! శరీరములు క్షణభంగురములు. నీటిలోఁ బొడమినబుడగ లెంతలో నశించుచున్నవో మన మెఱుఁగుదుము. అట్లేకదా మానవదేహములు! ఏక్షణములో నివి నశించునో మన మెఱుఁగము. ఈమూఁడునాళ్లముచ్చటకై భార్య లని బిడ్డ లని మిత్రు లని బంధువు లని యెందుల కీసంగ

ములు ? ఈసంగములు పెరిగినకొలఁది తెలుఁగని దుఃఖములు కలుగుచునే యుండును. ఈశరీరమే కడు నశాశ్వత మన్నప్పుడు దీనిని బూలపాన్పునఁ బూజించుటకుఁ దూఁగుటూయెలల నూఁగఁ జేయుటకు గృహారామక్షేత్రములను బెక్కుడుమల కిక్కు లగు వానిని సంపాదించుటలో జీవితమును వ్యర్థపుచ్చుటకంటె నవివేకమున్నదే ? మూఁడునాళ్ళపట్టపగ లగుజీవితమున కీరెండునెండు మఱ్ఱియాకులుఁ జాలవా ?" అని పలికెను.

అర్జునుఁ డాశ్చర్యభయభక్తులతో "దేవా ! మీ కెన్ని సంవత్సరములు గడచినవో తెలుపుఁ"డని కోరెను. అంత నామహోత్ముఁడు "పార్థా ! నేను బుట్టినతరువాత నెందఱో రోమశులు గతించిరి. మార్కండేయు లెందఱు గతించిరో లెక్క చెప్పలేను. నేను జ్ఞానమెఱిఁగినవెనుక నిరువదిమంది బ్రహ్మలు కడచనిరి. నీ కొకవిచిత్రవిషయముఁ జెప్పెదను. సావధానుఁడవై వినుము. మున్నొకప్రళయకాలమున నేడుసముద్రములు పొంగిపాఱఁగా ముల్లోకములు నిచటికేఁ దేలి వచ్చినవి. అపుడట నొకమఱ్ఱిచెట్టుండెను. దానికొమ్మలు వేయికిఁబైగాఁ గలవు ఒకొక్కకొమ్మను వేయేసిబ్రహ్మాండములు వ్రేలాడుచుండెను. ఆమఱ్ఱిచిటాలురెమ్మను జివరచిగురున నొక్కచక్కని బాలుఁడు పవ్వళించి తనకుడికాలిబొటనవ్రేలిని నోటఁ బెట్టుకొని కుడుచుచుఁ గెవ్వున నవ్వుచుఁ జివ్వున నేడ్చుచు మరలఁ గెవ్వున నవ్వుచు నాబాలుఁడు నన్నుఁ బ్రియమారఁ జూచి నాభయముఁ బాపి యభయ మొసఁగి రక్షించెను. ఆబాలునిదయవలన నప్పటిప్రళయకాల ఝుంఝూమారుతమునఁ గొట్టువడక, సముద్రపు సుడిగుండములలోఁ జిక్కువడక సుఖముగ నుండఁగంటిని. ఆ

గొడవ లన్నియు నిప్పుడు తడవిన మహాగ్రంథము లగును. అర్జునా! కడమాట చెప్పుచున్నాను. దీర్ఘబాహుఁడు, నీల మేఘశ్యాములుఁడు, కమలనేత్రుఁడు, కౌస్తుభాభరణుఁడు, వనమాలికాధారి, పీతాంబరుఁడు మీబావ యైనయాతఁడే ఆబాలుఁడు. మీసంసర్గమున నిట్టివాఁ డయ్యెను. రమ్మనువారు కాని పొమ్మనువారు కాని లేక సర్వమునకుఁ దానే నాథుఁడై హాయిగాఁ బవళించినయాతనినాభియం దొకపద్మము కలిగెను. దాని నుండినాలుగుమొగములతో నొకబ్రహ్మ పుట్టెను. ఆబ్రహ్మవలన, ఈచరాచరప్రపంచము కలిగెను. దానికిఁ దోడు సర్వకర్త యగు నాచిన్నబాలుఁడు తానే యదువంశమునఁ బుట్టి పదియాఱువేల నూటయెనుఁబదిమందిభార్యలను బరిగ్రహించి మీవంటివారితో వియ్యము లంది సంసారపారావారమునుండి సనకాదుల నుద్ధరించిన సచ్చిదానందస్వరూపుఁడే యీసంసారమునఁ జిక్కువడి మీవంటివారివెనుకఁ దిరుగుటే కాదు సమయము వచ్చినపుడు సచివుఁడై సారథియై. సేవకుఁడై యీబాధలు కోరి తెచ్చుకొన్నాఁ డని పరిహాసపూర్వకముగాఁ బలికి భక్తిపారవశ్యమున "త్రైలోక్యకుటుంబీ! రావోయి" యని కృష్ణుని జేరఁదీసికొని కౌఁగిటఁ జేర్చి మూర్ధాఘ్రాణ మొనరించి బ్రహ్మానందపరవశుఁ డయ్యెను.

శ్రీకృష్ణుఁ డాఋషిశ్రేష్ఠునకు నమస్కరించి, "మహాభాగా! ఇరువదిబ్రహ్మకల్పములు చూచినపరమేశ్వరుఁడవు నీవు. విష్ణుభక్తాగ్రేసరుఁడవు. నీవు కాక విష్ణుదేవుఁ డెవరు? ఒక్కటి నిన్నుఁ గోరెద. నీవు ధర్మజునియశ్వమేధయాగము సఫల మగుటకై విచ్చేయవలయును. నీవు వచ్చిననే ఆయాగము ఫలవం

తము. లేనిచో నిష్ఫల”మని పలికెను. అంత నామహర్షి “కృష్ణా ! నీవు నన్నీరీతి స్తుతింపకుము. సంస్తుతివలన నెట్టిసత్పురుషుఁడైనను గర్వపర్వత మధిష్ఠించును. అట్టివాని కెప్పుడో యొకప్పుడు పతనము తప్పదు. నేను లెక్కయేమి ? బ్రహ్మాదులకే గర్వ ముదయింపఁజేసి వారిగర్వమును జెఱచినపుణ్యపురుషుఁడవు నీ వని నే నెఱుంగుదును” అని పలికెను.

ఆకథ విన నర్జునుఁడు కుతూహలపడఁగా బకదాల్భ్యుఁడిట్లు చెప్పెను.

## విష్ణుమహిమ

తొల్లిటియొకబ్రహ్మకల్పమున నెండి చివికినయొక మఱ్ఱియాకుమాటున నుండి నేను దపము చేసికొనుచుండఁగా నొక చతుర్ముఖబ్రహ్మ నాయెదుటఁ బ్రత్యక్షమై “మునీంద్రా ! నీతపమునకు సంతోషించితిని. నీకుఁ గావలసినవర మిచ్చెద. కోరుకొ”మ్మని పలికెను. నే నంత “అయ్యా ! నే నిరువది బ్రహ్మకల్పములలో నిరువదిబ్రహ్మలను గన్నాఁడను. నీవందులోఁ గట్టకడపటివాఁడవు. నీ వేమి వరమిచ్చెదవు ? నే నేమి కైకొందును ? వెఱ్ఱివై వరమిచ్చెద నంటివికాని” అనఁగా నాతనికిఁ గోపము వచ్చెను. నేను నవ్వుచుంటిని. ఇంతలో మాయిరువురినడుమఁ గలభూభాగము బ్రద్దలుకాఁగా నందుండి యొకమహోత్పాతవాయువు బయలువెడలి మ మ్మిరువురను వేఱొకబ్రహ్మాండమున నెండుటాకులఁ బాఱవైచినట్లు పాఱవైచెను. మే మిరువుర మాశ్చర్యపడుచుండఁగా మాకడ కెనిమిదిముఖములు గలబ్రహ్మ వచ్చి “వత్సలారా ! మీ రెవరు ? ఎందుండి యెందుఁ బోవుచు నిందులకు వచ్చి

నా"రని ప్రశ్నించెను. నాలుగుముఖములబ్రహ్మ యిట్లు సమాధాన మిచ్చెను. "అయ్యా! నేను సత్యలోకపాలకుఁడను. చతుర్ముఖబ్రహ్మను. ఈముని నాశిష్యుఁడు'' ఆమాటలు విని యాతఁడు "ఓరీకర్తా! నీబ్రతుకునకు నీ వేమి? బ్రహ్మ వౌటేమి? సత్యలోకము నేలు టేమి? వెఱ్ఱిమొఱ్ఱివేసములు మాని మీయిరువురు నాకు శిష్యులై సేవచేయుఁడు. లేదా నాప్రతాపము గందు"రని గర్వియై పలికెను. అంత వెనుకటికంటెఁ బెక్కు రెట్లు భయంకరమైనమహావాయువు వీచి మమ్ము మువ్వురను గడ్డిపరకలవలె నెత్తుకొనిపోయి మఱియొకబ్రహ్మాండమునఁ బడవేసెను. అందు మహోన్నతాకారులు మహాత్ములు నగుకొందఱు దివ్యపురుషులు మమ్ముఁ జూచి ''మీ రెవ్వ?''రని యడిగిరి. మాలోనియెనిమిదిముఖములబ్రహ్మ 'నేను జగద్విధాత నగుబ్రహ్మ'నని సమాధానము చెప్పఁగా వారు నవ్వుకొని మమ్ము మువ్వురను దీసికొనిపోయి బదునాఱుముఖములు గల బ్రహ్మముందు నిలిపిరి. ఆతఁడును తీవి మెఱయఁ దనపరిచారకులఁ జూచి ఈమువ్వురు మనక్రొత్తదాసులు. వారిసేవలఁ గొనుఁడు. వారు మీరుచెప్పిన చొప్పునఁ జేయక మఱుమాటాడిన నాకడకుఁ గొనితెం'డని యాజ్ఞాపించెను. ఇంతలో నతిచిత్రముగా మఱియొకమహామారుతము వీచి మమ్ము నలువురను దూదిపింజలనువలె నెత్తుకొనిపోయి మఱియొకబ్రహ్మాండమున ముప్పదిరెండుమోములు గలబ్రహ్మకడఁ బడవైచెను. ఆతఁడును దనపరిచారకులఁ బిలిచి ఈనలువురు మనకుఁ గ్రొత్తదాసులు. వీరిని శిక్షించి పనిగొనుఁ' డని పలికెను. ఇంతలో మఱియొకమహావాయువు వీచి మమ్మైదుగురను మోచుకొనిపోయి

మఱియొకబ్రహ్మాండమున నఱువదినాలుగుమోములు గలబ్ర హ్మముందు పాఱవైచెను. అతఁడీయైదుగురుమూర్ఖులను నేలఁ బెట్టి కాల ఱాచి పనులుగొనుఁ డని యాజ్ఞాపించెను. మేము భయగ్రస్తులమై యుండఁగా మఱియొకమహామారుతము మమ్ముఁ గొనిపోయి నూటయిరువదియెనిమిదిముఖములు గలబ్రహ్మ ముందు పడవైచెను. ఈప్రకారము బహుముఖబ్రహ్మ లెందఱ కడనో పడవైచి తుట్టతుదకు సనకసనందనాదిసర్వఋషిసేవితుం డును సహస్రముఖుండును దుర్నిరీక్ష్య తేజోరాశియు నైనవేయి మోములు గలవానిముందు పడవేసెను. మమ్మందఱఁ జూచి యాతఁ డెదురువచ్చి యాహ్వానించి యర్ఘ్యపాద్యాదుల గౌర వించి యోగక్షేమము లడిగి 'మహాత్ములారా! మీకృపచే నీలోకమున నధికారము చేయుచుంటిని. నేను నాపరివారము నాసర్వస్వము మీయధీనము లే. నన్నే దేని మీసేవలో నియో గించి ధన్యుని జేయుఁడు' అని వారికి మ్రొక్కెను. అంత బ్రహ్మ లందఱు సిగ్గుపడి తమతమగర్వము లుడిగి లెంపలు వైచుకొని యహంకారము నశింప నాతనికి సాష్టాంగ మెఱఁగి “మహాపురుషా! దేవాదిదేవా! నీవు విష్ణుమూర్తివి. నీయై శ్వర్య మపారము. నీమహిమ మనంతము. మహాసముద్ర మున నురుఁగు,బుడగలు, పుట్టునట్లు నీయందు సమస్తబ్రహ్మాండ ములు పుట్టుచు గిట్టు చుండును. మామాయహంకారము లడంచి రక్షించినతండ్రివి. మమ్ము క్షమించి వీడ్కొలుపు” మని ప్రార్థించిరి. ఆతఁడు వారివారిని వారివారిస్థానములకుఁ బంపివేసి నన్ను మిక్కిలి మక్కువఁ జూచి యిటకుఁ బంపెను. అర్జునా! గర్వ మెవ్వరికిని గలిసిరాదు. గర్వపర్వత మెక్కి భ్రష్ట

ములే పూచికపుల్లకైనఁ గొఱగాకపోయి రన్న నీక నస్మదాదులఁగూర్చి పలుకనేల ? ఈయనుభవముఁ గన్న నన్నీవెన్నఁడెంతపొగడినను నాకు గర్వ ముదయింప'దని పలికెను. కృష్ణార్జును లాతని నెన్నివిధములనో స్తుతించి ధర్మజునియశ్వమేధమునకు రాక తప్ప దని ప్రార్థించిరి. వారిమాట కాదనఁజాలకయామహాత్ముఁ డంగీకరించెను.

## అశ్వమేధయాగము చేయించుట

అంతఁ గృష్ణార్జును లామహాత్ము నొకదివ్యసుందరనవరత్నస్థగిత మగుపల్లకియందుఁ గూర్చుండఁజేసి యాగాశ్వమును దరలించుకొని సముద్రము వెలువడి చతురంగసేనాసమేతులై ముందునకుఁ బోయిరి. తదనంతరము యాగాశ్వమును విడిచి సంవత్సరకాలము పూర్తియగుటచేఁ గృష్ణార్జునులు సేనానీకమును యాగాశ్వమును హస్తినాపురివైపు మరల్చిరి. ముందుగా శ్రీకృష్ణుఁ డేఁగి ధర్మజునితో యావద్వృత్తాంతముఁ దెల్పి యాగహయముతో బకదాల్భ్యమునీశ్వరునితో నర్జునుఁడు వచ్చుచుండుటఁ దెలిపెను. అంతఁ గరిపురము సమస్తోత్సవములతోడను విలసిల్లుచుండ యాగహయసమేతము అర్జునాదులెల్లరుఁ బురప్రవేశము చేసిరి. భీమసేననకులసహదేవముఖ్యులు బకదాల్భ్యమహర్షి కెదురేఁగి మహానమస్కారసముచితసత్కారసమపేతముగా నాతని నొకప్రత్యేకసౌధమున విడియించి సర్వసత్కారములు చేయఁదొడఁగిరి.

పిదప, యజ్ఞసుముహూర్త మేతెంచిన ద్రౌపది బంగరుపుటికలలో నానావిధములైనవిత్తనములు గొని, కృష్ణుఁడు తన వెనుక వచ్చుచుండఁగా, ధర్మరాజు బంగరునాఁగలికి ఆఱుదివ్య

వృషభములఁ బూన్చి యాగభూమి దున్నఁగా విత్తనములు మహా
మునీంద్రమంత్రపూతము లైనపిదప నాయాతావుల నుంచెను.
అంత ధర్మనందనుని బహుపుణ్యజలములచే కుంతీ, దేవకి, య
శోద అభిషేకించిరి. ఋత్విజులు శాస్త్రోక్తముగా వేదిక లమర్చి
యజ్ఞపాత్రముల నుంచి సర్వము సిద్ధము చేసిరి. అంత సర్వ
ఋషిగణసర్వజనప్రార్థితుఁడై బకదాల్భ్యమహర్షి బ్రహ్మత్వము
వహించి వ్యాసమహర్షిని అధ్వర్యువుగను, వసిష్ఠవామదేవరో
మశగాలవాదులను ఋత్విజులుగను అరుణిపులహపులస్త్యాదు
లను మంత్రపాఠకులుగను నియమించి ధర్మజుఁ గుశాసనాసీను
నొనర్చెను. అంత, వ్యాసమహర్షియాజ్ఞచొప్పున అనసూయా
త్రిలు, అరుంధతీవసిష్ఠులు, రుక్మిణీకృష్ణులు, హిడింబాభీమసే
నులు, సుభద్రార్జునులు, మాయావతీప్రద్యుమ్నులు, ఉషా
నిరుద్ధులు, ప్రభద్రావృషకేతులు, ప్రభావతీయావనాశ్వులు,
సునందానీలకేతులు, ధమ్మిల్లానుసాల్వులు మొదలుగా నఱు
వదినలు పురుదంపతులు పంచపల్లవములతోఁ గూడినకలశములు
నైకొని గీతవాద్యనృత్యములతోఁ గుంతీదేవకీయశోదలఁ బుర
స్కరించుకొని యరిగి బంగరుబిందెలతోఁ బవిత్రోదకములు
గొనితెచ్చి ఋత్విజులు వేదమంత్రములు చదువుచుండ ధర్మ
రాజు నభిషేకము చేసిరి. అంత ధర్మజుఁడు లేచి యాగాశ్వము
నభిషేకించి మహామునులం బూజించి సింహాసనములఁ గూ
ర్చుండఁ జేసి యథోచితశాస్త్రీయకర్మముల యాగము నిర్వ
ర్తించెను. బకదాల్భ్యమహర్షి బ్రహ్మ యగుటచే ధర్మజుని
యశ్వమేధయాగము నిర్విఘ్నముగా దివ్యవైభవముతోఁ బూర్తి
యయ్యెను.

అనంతరము శ్రీకృష్ణాదులు ధర్మజుని, ధర్మజుఁడు బకదాల్భ్యవ్యాసాదిమహర్షులను మిక్కిలి స్తుతించిరి. పిదప, బకదాల్భ్యమహర్షికి బ్రహ్మదక్షిణగా రత్నమయవృషభమును సమర్పించి ధర్మరాజాతనియాశీర్వచనము లందెను. ఈప్రకారము ధర్మజునియశ్వమేధము నిర్విఘ్నసమాప్తిఁ గావించిన పిదప బకదాల్భ్యమహర్షి యెల్లర వీడుకొని నిజస్థానమున కేఁగి యథాపూర్వముగాఁ దపోజీవనమున నుండెను.

## బకదాల్భ్య తీర్థము

తొల్లి నైమిశారణ్యమందలి మహాఋషులు విశ్వజిద్యాగ మనుమహాయాగ మొనరించి పిదప ద్వాదశవర్షసత్రయాగ మొకదాని నారంభించిరి. ఆయాగమునకు వారికిఁ జక్కఁగఁ బెరిఁగి లక్ష్మీసంపన్నము లయినయిరువదియొక్క-కోడెదూడలు కావలసివచ్చెను. అందుకొఱకై యాఋషులు తిరిగితిరిగి పాంచాలదేశము నేలురాజుకడ కేఁగి యాతని నర్థించిరి. ఆరాజు ఋషిభక్తుఁ డయ్యు వారుకోరినకోడెలు లేనివాఁడగుట మిక్కిలి వగచి వారిని క్షమాభిక్షము కోరెను. అపుడు బకదాల్భ్యమహర్షి యాల మందలో నట్టికోడె లెన్నియో యుండెను. ఆమహర్షి నైమిశారణ్యఋషులఁ బిలిచి వారికి భక్తిపెంపున నాకోడెల సమర్పించి వారిసత్రయాగము నిర్విఘ్నముగా సాఁగుటకు మిక్కిలి తోడ్పడెను. ఋషు లెల్లరు భక్తిశ్రద్ధల నాతని యుపకృతి కెంతయో స్తుతించిరి

కొంతకాలమునకు బకదాల్భ్యుఁడు తనయాలమందలోఁ గోడెలు చాలినన్ని లేనికారణమున నేరాజునైన నడిగి కొన్నిటిఁ దెచ్చుకొందమని యాలోచించెను. ధృతరాష్ట్రుఁ డనురాజున

కెన్నియో యాలమందలు కలవని విని బకుఁడా రాజుకడ కేఁగి
యాచించెను ఆరాజు మూర్ఖాగ్రేసరుఁడై యట్లే యొసఁగెద
నని చెప్పి యీయకుండెను. తుదకు బకుఁ డడుగఁగాఁ జచ్చి
పడియున్న కోడెమాడలఁ జూపి వానిని గొనిపొమ్మని రాజు
వానిని జూపెను. బకుఁ డందుల కాతనిపైఁ గినిసి "ఓరీమూర్ఖా!
బ్రహ్మవిద్వర్యులతోఁ బరిహాసములఁటరా! నైమిశ ఋషుల
ద్వాదశవార్షికసత్రమునకు విఘ్నము కలుగకుండఁ జూడవలయు
నను సత్సంకల్పముతో నా కున్నకోడెల వారికొసఁగి కోడెలు
లేక ఆలమందలు క్షీణించుచుండఁగా పోనిమ్ము గోసంరక్షణార్థ
మెవరికైన నడిగినఁ దప్పు లేదని వచ్చి నిన్నడుగఁగా నీవు
నన్ను క్షుద్రమార్గమున వెక్కిరింతువా? ఇఁక, నీగతి యే
మగునో కాచికొ"మ్మని చెప్పి సరస్వతీనదీతీరమున కేఁగి యగ్ని
హోత్రునిఁ బ్రజ్వలింపఁజేసి ధృతరాష్ట్రుని దేశమంతయు నశిం
పఁజేయుటకై యొకగొప్పఆభిచారికహోమ మారంభించెను.
వెనువెంటనే గొడ్డలివ్రేటులఁ గూలువనమువలె ధృతరాష్ట్రుని
రాష్ట్ర మంతరింపఁ జొచ్చెను. వెంటనే తనతప్పిదమును
గ్రహించి సద్బ్రాహ్మణపురస్కృతుఁడై ధృతరాష్ట్రుఁడు బక
దాల్భ్యునిపాలికి శరవేగమునఁ జని "మహాప్రభూ! క్షమిం
పుము. క్షమింపు" మని భూనభోంతరాళములు మాఱుమ్రోఁ
గున కేలుఁగెత్తుచు నాతనిపాదములపైఁ బడి ప్రార్థించెను.
దయామయుఁ డగునాఋషి యాతనిలేవనెత్తి "రాజా! మద
గజములప్రమాదమును వారింప నంకుశ మెట్లో రాజ్యమదాం
ధులైన రాజేభములను మావంటిఋష్యంకుశములే సరిదిద్దవల
యును. లేనినాఁడు మీకుఁ బట్టపగ్గము లుండునే? మూర్ఖ

గ్రేసరుఁడవై యీపేదబాపఁ డేమి చేయఁ గలఁ డనుకొంటివా? మఱికొంతసే పూరకున్నచో నీసర్వస్వము నేమై యుండెడిదో తెలిసికొనియుండెడివాఁడవు. నీ కిప్పటికైనను బుద్ధివచ్చి వచ్చి పడితివి. క్షమించితిని. నాకోప ముపసంహరించి నీకు మే లొనగూర్తు” నని సర్వశాంతిహోమము జేసి ధృతరాష్ట్రుని నాతని రాష్ట్రమును మహావిపత్తునుండి సంరక్షించెను. ధృతరాష్ట్రుఁడు బ్రతుకు జీవుఁడా యని బకదాల్భ్యమహర్షి కనేక గోసమూహాముల నొసఁగి యాతనియనుమతి నిజనగరమున కరిగి సుఖముండెను. బకదాల్భ్యమహర్షి తపశ్శక్తియుతుఁ డైనయీప్రదేశమే బకదాల్భ్యతీర్థ మని ప్రసిద్ధి గాంచెను. ఆహా ! మన మహర్షులప్రజ్ఞాప్రాభవము లెంతని కొనియాడవచ్చును! దుష్టశిక్షణకై యాభిచారికహోమ మొనరించుచు, ఆదుష్టుఁడు శిష్టుఁ డైనంతనే, సర్వశాంతిహోమము చేసి బకదాల్భ్యుఁ డాతనిఁ గటాక్షించెను.దుష్టశిక్షణ శిష్టరక్షణ యొనరింప సమ[illegible]ెంచిన పరమేశ్వరస్వరూపులే కదా మనభారతబ్రహ్మర్షులు !

# శ్రీమహర్షి జీవితకథామృతము

## మరీచి మహర్షి

### స్తుతి

తనసుజ్ఞానమయూఖమాలికలచేతన్ లోకభాస్వంతుఁడై
తనధర్మప్రతిపాదకత్వమున సద్ధర్మప్రతిష్ఠాపకా
గ్రణియై దివ్యతపోధనుం డయి జగత్కర్తృత్వవిఖ్యాతి గాం
చినవానిం విప్రుని బావనాత్ముని మరీచిన్ గొల్తు భక్త్యున్నతిన్.

### జననము

త్రొల్లి బ్రహ్మదేవుఁడు ప్రజాపతిత్వమున రాజసగుణ ప్రధానుఁడై సృష్టిని గూర్చి చింతింపఁదొడఁగెను. అపు డాతని బుద్ధిపూర్వకము కాని ధ్యానమువలన, తమోమయము, తమో మోహము, మహామోహము, తమిస్రము, అంధతమిస్రము ననునవైదును బుట్టి జగములకు ముఖ్యభూతము లయ్యెను. కాని, యివి బ్రహ్మకు సృష్టిసాధనములు కావాయెను. ఆపై, బ్రహ్మ ఆత్మజ్ఞానాజ్ఞానములఁ దామస మగుతిర్యగ్ధ్యానమువలన లోకమునఁ బశుమృగసంతతి జనించెను. పిదప, ఆతని సాత్త్విక గుణమున నూర్ధ్వమైనప్రకాశప్రవాహ మొకటి బయలువెడలఁగా నందుండి దేవతలు జనించిరి. రాజసగుణముచే నుద్రిక్తమై, తమోగుణముచే రంజితమైనబ్రహ్మ ప్రకాశబాహుళ్యముతో నొప్పునాతనితలఁపు అధోగతిని వర్తించిన నందుండి

మనుష్యులు పుట్టిరి. అనంతరము బ్రహ్మదేవుని నిఖిలావయవములనుండియు, దేవతలు, పితరులు, అసురులు, మనుజులు, అనేకభూతములు మున్నగువానితో సచరాచరమగుప్రపంచము జనించెను. నానావిధములగు ఈచరాచరభూతజాలములు పూర్వసృష్టియందు జరిగినవిధముననే వారివారికర్మములు కారణములుగాఁ బుట్టి హింసాహింసలు, మార్దవకాఠిన్యములు, నిందానిందలు, ధర్మాధర్మములు, సత్యాసత్యములు, జ్ఞానాజ్ఞానములు కలిగి యింద్రియవ్యవహారములందుఁ దగిలి నానావిధము లగు రూపములు, వర్తనములు, జాతులు, స్వభావములు, చేష్టలు, గుణములు, ఆయాప్రకారములఁ నేర్పడునట్లుగా బ్రహ్మ వానిని సృష్టించెను. ఆపిమ్మట నాతఁడు దేశములు, వనములు, పర్వతములు, దుర్గములు, సముద్రములు, పురములు, ఆవరణములు, గృహములు, అస్త్రశస్త్రాదులు, మున్నగుసమస్తము సృష్టించెను, శీతవాతోష్ణబాధలచేఁ బ్రజలు బాధపడకుండుటకై తగినయుపకరణములు సృజించి, భూషణాంబరవిలేపనాదుల నేర్పఱిచెను. ఒక్కపని సాధించుటకుఁ బెక్కువిధములుగలసాధనములు తనబుద్ధికుశలతవలన నాతఁడు సృజించెను. సేద్యము, వాణిజ్యము, గోరక్ష, యాచనము, కూలి, సేవ, పాశుపము మున్నగుకారణములవలన జనులకుఁ బ్రతుకుఁదెరువులు కల్పించెను. మఱియు మనుష్యులకు జీవనోపాయములుగా వ్రీహులు, గోధుమలు, యవలు, అణువులు, తిలలు, ప్రియంగువులు, ఉదారములు, కోద్రవములు, సతీనకములు, మాషములు, ముద్గములు, మసూరములు, నిష్పావములు, కులుత్థములు, ఆఢ్యకములు, చణకములు, శణములు, మున్నగు

పెక్కు తెఱఁగులధాన్యములు కల్పించెను. ఈధాన్యాదికమున యజ్ఞకర్మములు నడచునట్లు, ఈయజ్ఞకర్మములవలన ధాన్యాభివృద్ధి యగునట్లు నాతఁ డేర్పఱిచెను.

ఇన్నివిధముల సృష్టిచేసియు బ్రహ్మదేవుఁడు తన కోర్కె సమయమందు నూఱట లేకపోవుటకు, తాను సృష్టించినజీవరాశి వంశపరంపరలకు జగముపైఁ బరిపూర్ణత్వము లేకపోవుటకు దుఃఖించి తనతో సరియగువారలఁ గొందఱ సృష్టించి వారిని సృష్టివ్యాప్తికి నియోగింపఁదలఁచెను. అందుచే నాతఁడు తన్నుఁ బోలినవారలు, తనయంతటిఘనులు, ప్రజాపతులు, మునిశ్రేష్ఠులు, జగములఁ బ్రజాపరిపూర్ణతకు హేతుభూతులు కాఁజాలువారు నయినమహామహులను దనమానససృష్టిని బుట్టించెను. వారే భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, అంగిరసుఁడు, మరీచి, దక్షుఁడు, అత్రి, వసిష్ఠుఁడు అను మహాత్ములు. వీరినే నవబ్రహ్మ లని యందురు. *

ఇట్లు సృష్టికార్యమునఁ దనకు సహాయులై తనపరిపూర్ణతకుఁ దోడ్పడఁ గలశక్తిసంపన్ను లగువారిగా బ్రహ్మ తనమానసమునుండి జనింపఁజేసిన తొమ్మండుగురలో మరీచిమహర్షి యొకఁడు. మరీచి తనయనుజులతోఁ గలిసి తండ్రిపంపున మహాతపస్సుచేయుచు బ్రహ్మదేవుని గనిపెట్టుకొనియుండి యాతఁడు పిలిచినపు డెల్ల వచ్చుచు నాతనిసేవ చేయుచు నాతని యాదేశములఁ దలఁదాల్చుచు నుండెను.

*ఈ గాథ యంతయు శ్రీవిష్ణుపురాణములోనిది.

## వివాహము

అనంతరము కర్దమప్రజాపతికి దేవహూతియందు తొమ్మండుగురుకూఁతుండ్రును విష్ణుమూర్తి కపిలుఁడను పేర పుత్త్రరత్నముగను జనించిరి. కపిలుఁడు జన్మించినసమయమున సర్వలోక మహోత్సవమయ్యెను. అట్టిమహోత్సవమున దేవహూతికిఁ దత్త్వబోధ యొనరించుటకు, ఆమెగర్భమున నుదయించినపరబ్రహ్మస్వరూపుఁడైన నారాయణుని దర్శించుటకును నారద సనకసనందన మరీచిప్రముఖు లగుమునిగణములతో బ్రహ్మదేవుఁడచటికి విచ్చేసెను. అచట బ్రహ్మ కర్దమదేవహూతులఁ గనుంగొని "ఓపుణ్యదంపతులారా! మీయోగమే మహాయోగము. మీరు నిష్కల్మషులై చేసినవిష్ణుపూజ యీపుత్త్రరూపమున సత్ఫలము నొసంగెను. మీరు ముమ్మాటికిఁ జరితార్థులు. సాక్షాత్పుణ్యరూపిణు లగు మీతొమ్మండ్రుకూఁతుండ్రును శీలవ్రతాచారసంపన్నలు. సకలలోకమునిపరేణ్యులు, మహాత్ములు, నగునవబ్రహ్మలకు నిచ్చి వివాహములు చేయుఁడు. వారివలనఁ బ్రజాసృష్టి బహువిధముల వృద్ధిపొందును." అని హితోపదేశము చేసెను. పిదప నాతఁడు విష్ణుమూర్తియే కపిలరూపమున వారికి బిడ్డఁడై పుట్టుట విశదీకరించి యామహాత్ముఁడు చేయుభవిష్యత్కృత్యములఁ దేటతెల్ల మొనరించి కపిలుని సంస్తుతించి మరీచిమహర్షిని కర్దమునింట వివాహార్థము విడిచి బ్రహ్మదేవుఁడు నారదసనకసనందనాదులతో నిజధామమునకుఁ బోయెను.

పిదప, కర్దమప్రజాపతి బ్రహ్మదేవునియాదేశము-చొప్పునఁ దనకూఁతుండ్రకు వివాహమహోత్సవము నిర్ణయించి

నవబ్రహ్మలకుఁ దెలియపఱచెను. భూతభవిష్యద్వర్తమాన వేదు లగునామహామహులు పెండ్లికొడుకులై కర్దమునింటికి విచ్చేసిరి. ఆపిమ్మట దివ్యవైభవోపేతముగా కర్దమప్రజాపతి తనకడ వికసి యున్న మరీచిమహర్షికిఁ దొలుతటెపట్టి యగుకళ యనుదివ్యసుం దరిని, అత్రికి అనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునకు హావిర్భువును, పులహునకు గతిని, క్రతుమహర్షికిఁ గ్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠునకు అరుంధతిని, అథర్వునకు శాం తిని ఇచ్చి నిజకులాచారసరణిఁ బరిణయము లొనరించి కృత దారపరిగ్రహు లగుఅల్లుండ్రను సకలగౌరవపురస్సరముగా వారి వారియాశ్రమదివ్యప్రదేశములకుఁ బంపివైచెను. ఈరీతిని మరీచి మహర్షి కళను ధర్మపత్నిగాఁ బరిగ్రహించెను.

## సంతానము

మరీచిమహర్షి కళాయుతుఁడై రోహిణితో నొప్పుచం ద్రునివలె, సువాసన యబ్బినబంగారమువలె మఱింతప్రకాశిం చుచుఁ దనయాశ్రమమునకుఁ జనుదెంచి గృహస్థధర్మమును నిర్వర్తించుచునే నిరంతరతపోధ్యానానురక్తుఁడై ఆదర్శగృహస్థా శ్రమనిర్వహణకుఁ గడంగెను.

కళ భర్త కనేకవిధముల శుశ్రూషచేయుచు మానవుని నీడవలె నాతని నెన్నఁడును విడిచి యెఱుఁగక పతివ్రతాతిల కమై తపస్వినీజీవితము నలవఱుచుకొనెను. ఇట్లుండఁ గొంత కాలమునకు మరీచిమహర్షి "సాధ్వీ ! నాతండ్రియు నీకు మామయు నగుబ్రహ్మ నిరంతరాయ మగుప్రజాసంసృష్టి యొన రించుటకే మమ్ముఁ బుట్టించి మిమ్ములను భార్యలఁగాఁ గూర్చెను. కావున, నీ కెట్టిసంతానము కావలయునో కోరుకొను" మనెను.

కళ భర్తతో "మనకన్న మిన్నయై సర్వజీవరాసులను సృష్టింప సామర్థ్యము గలయొక్కయుత్తమపుత్త్రుని, సమస్తలోకములందును కీర్తనీయ కాఁదగు నొక్కపుత్త్రికను నాకుఁ బ్రసాదింపు" మని పలికెను. మరీచి యట్లే యని నిరుపమనిష్ఠాతిశయమునఁ దాను తపస్సుచేయుచు భార్యను దనపరిచర్యలో నిలుపుకొని పరమపవిత్రశరీర నొనరించి యాపిదప నొక్కసుముహూర్తమున నామెకుఁ గామకేళివలనఁ బరమసంతృప్తి నొనగూర్చి యామెకు గర్భముఁ బ్రసాదించెను. కళ పరమసంతోషభరితయై పవిత్రగర్భమును ధరించి మహోత్సాహముననుండి కాలక్రమమున నొక్కపుత్త్రునిఁ గనెను.

అనంతరము మరీచి తనపుత్రునకు జాతకర్మాదిక మెల్ల నొనరించి కశ్యపుఁ డని నామకరణ మొనరించెను. కశ్యపుఁడు శుక్లపక్షచంద్రునివలెఁ బెరిగి పెద్దవాఁడై దక్షప్రజాపతిపుత్రికలఁ బెండ్లాడి సర్వభూతసంసృష్టి యొనరించెను.

మఱికొంతకాలమునకు మరీచిదయవలనఁ గళ మరల గర్భమును ధరించి నవమాసములు మోసి యొకముద్దుబిడ్డఁ గనెను. ఆమెమోము పుట్టినప్పటినుండియు సంపూర్ణపూర్ణిమాచంద్రమోబింబమువలె నలరారుచుండుటచేతనే మరీచి యామెకు పూర్ణిమ యను నామధేయము నుంచెను. కాలక్రమమున, పూర్ణిమ జన్మాంతరమున హరిపాదప్రక్షాళనజలము కారణముగా గంగ యనుపేరఁ బుట్టి పెరిగి దేవకుల్య యను నొక్కకూఁతును, అఖిల విష్టపవ్యాపకుఁడయి విరజుఁ డనునొక్క కొడుకును గాంచెను. వారివలనను భూతసంతతి జనించి వృద్ధి

పొందెను. ఈరీతి మరీచి కళవలన సంతానవంతుఁడు, చరితార్థజీవనుఁడు, నయి విలసిల్లెను. *

## మరీచి స్మృతి

మరీచిమహర్షి మహాజ్ఞాని, విరాగి, మహాతపస్వి యగుటే కాక స్మృతికర్తయు. మరీచిమహర్షి పేర నొకధర్మశాస్త్రము "మరీచిస్మృతి" గానగుచున్నది. ఆహ్నిక, అశౌచ, శ్రాద్ధ ప్రాయశ్చిత్త, వ్యవహారవిషయములలో మరీచిస్మృతికి మహోన్నతస్థానము నొసంగినవి. మితాక్షరము, అపరార్కము, స్మృతిచంద్రిక మున్నగునవి. "సప్తమ్యాం రవివారేచ గృహీ జన్మదినే తథా, భృత్యపుత్రకళత్రార్థీ నకుర్యాత్ తిలతర్పణమ్." "నభోనభస్యయోర్మధ్యే సర్వానద్యో రజస్వలాః తాసు స్నానం నకుర్వీత దేవర్షిపితృతర్పణమ్." అని తర్పణాధికవిషయమున; "స్థానరే విక్రయాధానే విభాగే దానఏవచ, ప్రతిగ్రహేచ క్రీతేచ నాలేఖ్యాత్ సిద్ధ్యతిక్రియా" "అవిజ్ఞాతనివేశత్వాద్యత్ర మూల్యం నలభ్యతే, హానిస్తత్ర సమాకల్ప్య క్రేతుదాప్టికయోర్ద్వయే" మున్నగుశ్లోకములు వ్యవహారాధ్యాయమునను మరీచిస్మృతినుండి అపరార్కము స్మృతిచంద్రిక మున్నగునవి పేర్కొన్నవి. భోగ్యము, గోప్యము, ప్రత్యయము, ఆజానాధి యని ఆధి (తాకట్టు, కుదువ) నాలుగువిధములుగా మరీచిస్మృతిలోఁ గలదు. మరీచిస్మృతి గద్యశ్లోకసమన్విత మని అపరార్కమున నుదాహరింపఁబడినకొన్ని గద్యోదాహరణములఁబట్టి చెప్పవచ్చును. అంతేకాని, నేటికిని "మరీచిస్మృతి" పూర్తిగా మనకు లభింపకపోవుట నిజముగా మనదురదృష్టము.

---

* శ్రీమద్భాగవతము చతుర్థస్కంధము.

# శ్రీ మహర్షి జీవితకథామృతము

## మాండవ్య మహర్షి

### స్తుతి

ధర్మనిరతితోడఁ దపమొనరించెడి
తనకు శిక్ష వేయు డాసు యముని
చండకోపి యగుచు శపియించె మాండవ్యుఁ
డట్టి ఋషివతంసు నాత్మఁ గొలుతు.

### తపము

తొల్లి మాండవ్యుఁ డనుమునికుమారుఁడు బాల్యము నుండియు నిష్ఠాగరిష్ఠుఁడై తపమొనరించుచు బ్రహ్మవిద్యాపరుఁడై యుండెను. కాలక్రమమున నాతఁడు తపఃప్రభావము వలన బ్రహ్మర్షియై భూమండలమునఁ గల సర్వతీర్థములను ఒంటరియై సేవించి వచ్చి యొకపట్టణమునకు సమీపమునఁ గల యడవిలో నాశ్రమము నిర్మించుకొని యాశ్రమద్వారమునఁ గలవృక్షమూలమున నూర్ధ్వబాహుఁడై మౌనవ్రతుఁడై మహాతప మొనరింపఁ జొచ్చెను. ఆతఁడు మొదటినుండియు మనోధైర్యము కలిగి స్థిరచిత్తుఁడైనమహనీయుఁడు. ఆతఁడు సమస్తధర్మములను, ధర్మమర్మములను గరతలామలకముగా నెఱిఁగిన పుణ్యపురుషుఁడు. ఇంతేకాక, ఆతఁడు నిత్యసత్యవ్రతుఁడు. ఇంద్రియాశ్వముల విచ్చలవిడి పోనీక, అదుపులో నుంచి యాముని

వైరాగ్యశమదమాదులచే శిక్షణమందినబుద్ధి యను సారధికత
మునఁ దనజీవితరథమును బ్రహ్మానందప్రద మగుఉన్నతమార్గ
ముననే పోనిచ్చుచుండెను. ఈమహాత్ముఁ డిట్టితపోనిష్ఠలో నుం
డఁగా నెన్నియో సంవత్సరములు గతించెను. ఐనను, ఆతఁడు
శీతోష్ణములకు, సుఖదుఃఖములకు, జరారాజాద్యములకు, లాభ
నష్టములకు వేనికిని లక్ష్య మిసుమంత యైనఁ జూపక నిశ్చితా
ర్థము విడఁవనినిపుణమతి యై, నిరాహారి, నిర్జితేంద్రియుఁడు
నిఖిలపాపదూరుఁడై నెగడుచుండెను.

మాండవ్యుఁ డకారణశిక్షకు గురియగుట

ఈశ్వరవిలాస మతిచిత్రముగా నుండును. ఏపాప
మెఱుఁగని మహనీయు లొకప్పు డతిఘోరమగుశిక్ష ననుభవింప
వలసివచ్చును. మహాపాపియగు నిందితుఁడు శిక్ష తప్పించుకొని
సుఖజీవనము గడపుచుండును. విధివిలసిత మన్నది తప్ప మఱే
యొక కారణము మనమిందులకుఁ జెప్పఁజాలము. ఇట్లే నిత్యా
సత్యవ్రతుఁడు, తపోవిద్యానవద్యుఁడు, నిర్దగ్ధసర్వపాపుఁడు నగు
మాండవ్యమహర్షిపై నొకనిరాపనింద వచ్చిపడెను.

ఆవనసమీపమందలినగరమున నొకరాత్రి కొందఱు
దొంగలు రాజుగారింటిలోఁ బడి రక్షకభటులకంట దుమ్ము
కొట్టి రాజుగారిధనము, ఆభరణములు మున్నగున వెన్నియో
దొంగిలించుకొని పారిపోయిరి. రక్షకభటు లీసంగతి తెలిసికొని
యనేకులుకలిసి దొంగలవెంటఁ బరుగిడి వారిని దఱిమి యడవి
లోనికి వచ్చిరి. ఆదొంగలు పరుగుపరుగున వచ్చి మాండ
వ్యుఁడు తపము చేసికొనుఆశ్రమమునకు సమీప మగుప్రదేశ
మున వస్తువులఁబాతిపెట్టి దట్టముగ నలముకొన్న పొదలమాటున

దాఁగుకొనిరి. వారిని తఱుముకొనివచ్చిన రక్షకభటులు తలా రులు మాండవ్యమహర్షి కడ కరుదెంచి "అయ్యా! రాజధనమును దొంగిలించినదొంగలు కొంత దూరము పాఱి వచ్చిరి; వా రెటు పరిగె కేఁగి"రని యాతని నడిగిరి. మౌనవ్రతదీక్షితుఁడైనయామహనీయుఁ డేమియు బదులుపలుకఁ డయ్యెను. అంత రాజభటులు తలవరులు సమీపప్రాంతము లన్నియు వెదకి యను మానముపై భూమిని ద్రవ్వి దొంగలు పాతినరాజధనభూషణములను బట్టుకొనఁ గలిగిరి. ఇంతలోఁ బొదలమాటునఁ గల దొంగలుకూడ వారి కంటఁబడ రాజభటులు దొంగల నెల్లరఁ బట్టుకొని బంధించిరి. పిదప, దొంగలకెల్ల రాజయినగజదొంగ ముని వేషమున దొంగజపము చేయుచున్నాఁ డని సంశయించి రాజభటులు మాండవ్యు నాడరానిమాట లాడి కాలుసేతులు కట్టి దొంగలతోఁ గూడ రాజుకడకుఁ దీసికొనిపోయి రాజున కొప్పగించిరి. పోయినధనము దొరికిన దని సంతసించి రాజు చోరు లెల్లరకుఁ గ్రూరదండనము విధించి వారినెల్లర వధింపుఁ డని తలవరుల కాజ్ఞాపించెను. పిదప, యుక్తాయుక్తవిచారణ లేని యామూర్ఖరాజు మాండవ్యుని ఋషిగాఁ దెలిసికొనలేక దొంగలరా జని భావించి యాతని నూరివెలుపలఁ గొఱుత వేయుఁ డని తలవరుల కాజ్ఞాపించెను.

రాజాజ్ఞ యైనవెంటనే వివేకవిహీను లైనతలవరులు మునిమూర్ధన్యుని లాఁగుకొనిపోయి యూరిబయట నొకశూలము పాతి యం దాతనిఁ గొఱుత నుంచి పోయిరి. శూలప్రోతుఁడైనను మాండవ్యమహర్షి యాత్మవేది యగుట పరమప్రశాంతుఁడై దూషణభూషణతిరస్కారము లెల్ల తనకు సమానములు,

అమృతమయములుగాఁ దోఁప, నదియుఁ దనమేలునకే వచ్చిన
దని సంతసించి వాయుమాత్రభక్షకుఁడై మఱింతనిష్ఠతో మఱింత
భక్తితో మఱింత శాంతితో నాతఁడు తప మొనరించుచుండెను.
ఇట్లు చిరకాల మాతఁడు కొఱుతనుండియే దేహబాధను లక్ష్య
పెట్టక దేహస్మృతియే మఱచి పరమేశ్వర పాదారవిందనిస్రుత
మగుదివ్యామృతముఁ ద్రావుచు దివ్యశరీరియై దివ్యతేజస్వియై
యేమాత్రము శరీరకార్శ్యము, దైన్యము, క్షీణత, భీతి,
యెఱుఁగక నిశ్చలబ్రహ్మనిష్ఠుఁడై నెగడుచుండెను.*

## మాండవ్యుఁడు క్రౌశికుని శపించుట

మాండవ్యు డిట్లు కొఱుత నున్నసమయమున నొకనాఁటి
రాత్రి యొకచిత్రము జరిగెను. ఆవనప్రాంతమునఁ గలప్రతి
ష్ఠాన మనునొకపురవరమునఁ గౌశికుఁ డనునొకబ్రాహ్మణుఁడు
పూర్వజన్మపాపఫలమునఁ గుష్ఠరోగపీడితుఁ డయ్యెను. ఐనను
ఆతనిభార్య పతివ్రతాతిలకమై యసహ్యించుకొనక భర్తయే
పరమేశ్వరుఁ డని భావించుచు నాతనికి సకలోపచారములు నొడ
గూర్చుచుండెను.

ఇట్లుండ నాకుష్ఠరోగి యొకనాఁడు రాజమార్గమున
నేఁగునొక్క వేశ్యారత్నముఁ గాంచెను. భూలోకమునకు దిగి
వచ్చిన రంభయో, ఊర్వశియో యైయుండు ననఁదోఁచుమహా
సౌందర్యమున విరాజిలు నామె నీకురూపి మిక్కుటముగ వల
చెను. ఆహా! ఒడలెల్ల పుచ్చి పురుగులోడుచు, రసి కాఱి
కాలువలు గట్టు కురూపికిని స్త్రీరూపమును గాంచఁగనే
మరులు పురులు గొలుపు మదనమహానీయునిమహిమ మెవరు

* భారతము వనపర్వము

వర్ణింపఁగలరు ? పుత్తడిబొమ్మవంటిధర్మపత్ని తన్నుఁ గని రో
యక సకలోపచారములు సలుపుచున్నను, కౌశికునికి రూపాజీ
వపై మనసు తగులుట ఆశ్చర్యముల కెల్ల నాశ్చర్యము. కౌశి
కుఁడు భార్యను బిలిచి తనకామరాగముఁ జెప్పి యారేయి
యాగణికాంగనపొందుఁ దనకుఁ గూర్పు మని బతిమాలెను.
వినయవివేకభయభక్తియుక్తులతో నామాటలు విన్నకౌశికపత్ని
యట్లే యని లెక్కలేనిరొక్కము మూటగట్టుకొని రాత్రివేళఁ
బతిని వీపుపై నెక్కించుకొని యాసాధ్వీతిలకము చిమ్మచీకటిని
మిట్టపల్లము లేర్పఱుపరాక, కన్నుఁ గన్ను కానరాకయున్న
సమయమున వేశ్యాగృహమునకు గూరిబయటనుండి పోవుచుం
డెను. అపుడు కొఱ్ఱున నున్నమాండవ్యునికిఁ బత్నివీపుపై నున్న
కౌశికునిశరీరము రాచుకొనిపోఁగా నొక్కపెట్టున మాండవ్యునికి
శూలబాధ యధికమయ్యెను. అపు డాతఁ "డయ్యో ! మూలు
గుచున్ననక్కపైఁ దాటిపండు పడ్డట్లు,నా కీఘోరబాధ నినుమడిం
పఁజేయ నన్ను రాచుకొనిపోయినమూర్ఖుఁ డుదయ మగుసరికిఁ
జచ్చియుండుఁగా" కని శపించెను.

మాండవ్యుని శాపముసంగతి విని కౌశికపత్ని సూర్యుఁ
డుదయింపకుండఁ జేసెను. తుదకు, అనసూయాసాధ్వి కౌశిక
పత్ని నోదార్చి సూర్యుఁ డుదయ మగునటొనరఁ జేసి, చనిపో
యిన కౌశికునిఁ దనపతివ్రతాత్వమున బ్రతికించి వరము లొసఁ
గెను. *

---

* మార్కండేయపురాణము.

## మాండవ్యుని విడుదల

ఇట్లు శరీరదుఃఖ మణుమాత్రమును దలఁపక తపము చేయుచున్న మాండవ్యుని తపఃప్రభావమునకు మెచ్చి మహామునులు పక్షుల లయి రాత్రి వచ్చి "మునీంద్రా! ఇట్టిమహాతపస్వి వైన నీ కిట్టిదుఃఖప్రద మగుశిక్ష విధించిన దెవరు? నీయంత నీవు తప్పించుకొనఁ శక్తి గలవాఁడవయ్యుఁ జూపఱులకు జాలివలనఁ గన్నులనీరు జలజల కాఱునట్లు ఈకొఱుతపై నుండుటకుఁ గారణ మే!"మని యడిగిరి. అంత, మాండవ్యుఁడు వారితో "మిత్రులారా! మీ యనునయమునకుఁ గృతజ్ఞుడను. కాని:

"ఎఱిఁగి యెఱిఁగి నన్నడుగంగనేల దీని<br>
సుఖము దుఃఖంబు ప్రాప్తించుచోట నరుఁడు<br>
తగిలి తనకర్మవశమునఁ దనకుఁ దాన<br>
కర్త కా కన్యులకు నేమికారణంబు?"

(భార. ఆది. ౮-౨౬౭.)

నే నెవ్వరికిని దప్పు చేయలేదు. ఒరు లెవ్వరు నాకుఁ జేయరే" యని ప్రశాంతమనస్కుఁడై పలికెను. ఈమాటలు చాటున నుండి యున్నాళ్లుగాఁ గొఱుతనుండియుఁ జావకపోవుటే కాక, దినదిన ప్రవర్ధమాన మగు తేజస్సుతో నొప్పుమాండవ్యుని యథాస్థితిఁ గనిపెట్టుటకై పొంచియున్న తలవరులు విని శీఘ్రమే పోయి ఈజరిగినవృత్తాంతము తమరాజునకు నివేదించిరి.

తాను ఋషికులతిలకునియెడఁ గావించినమహాపరాధమునకుఁ బశ్చాత్తప్తుఁడై మంత్రిపురోహితపురస్కృతుఁడై యారాజు పరుగుపరుగున వచ్చి మాండవ్యునిపాదములపైఁ బడి "మహాత్మా!

యుక్తాయుక్తజ్ఞానము లేనిమూర్ఖుఁడనై దొంగ యని భ్రమపడి నీ కీఘోరాతిఘోరమగుశిక్ష విధించినమహాపాపాత్ముఁడను నేను. నన్నుఁ దగినవిధమున శిక్షించి క్షమించి దయచూడుము" మని పరిపరివిధముల బతిమాలుకొనఁ జొచ్చెను. అంత మాండవ్యుఁడు మహనీయగుణగరిష్ఠుఁడు మూర్తీభవించినశాంతిపుంజము, దయాసముద్రుఁడు, ఆత్మజ్ఞాని, వివేకనిధి యగుటచే "ఓయీ! ఇందు నీదోష మేమియు లేదు. ప్రాణికోటులకుఁ బురాకృతకర్మ మనుభవింపక తీరదు. ఎవనికర్మఫలము వానికి గట్టికుడుపును, దాని కొరులు కారణము కానేరరు. కావున, నాకు శత్రువుకాని ద్రోహికాని నీవుకావు." అని పలికెను. ఆతనిశాంతగుణమునకు క్షమాభిక్షమునకు సంతసించి రాజు వెంటనే యాతనిఁ గొఱుతనుండి తప్పించెనుకాని యాశూలమును మొన యాతనికంఠమునుండి యూడిరాదయ్యెను. అంత రాజు మునియనుమతిని మెత్తన దానిమొదలు తునిమించెను. ఈశూలశేషము మునికంఠమున నొకమేకువలె నిలిచిపోయెను. దీని నూడఁదీయ నెవ్వరికిని దరము కాకపోయెను. నాఁటినుండి యీతనికి "అణిమాండవ్యుఁ"డని పేరువచ్చెను. (అణి=చీల, మేకు.)

అందుచే మాండవ్యుఁ డప్పటినుండి కంఠమునకు రెండు ప్రక్కలకును నడుమ నాశూలపుమొనను దాల్చియే తిరుగుచు దానియందు పూలపాత్ర మున్నగునవి తగిలించుకొనుచుండెను. తపోవిశేషముచే మాండవ్యమహర్షి యితరులకు దుర్లభమైన సమస్తలోకసంచారశక్తి గడించెను. కాని, యేపాప మెఱుఁగని తనకు యముఁ డిట్టిశిక్ష నేల విధించె నని యిట్లు యమధర్మ

రాజే సత్పురుషులను శిక్షించినచో నిఁక లోకములందు సత్పురుషులగతి యేమగు నని వంతనొంది తనశక్తి కతమున యమలోకమునకుఁ బోయి యందు యమగృహమున మహాసనమున గూర్చుండి యున్నయము నవలోకించి యిట్లనెను.

## యమమాండవ్య సంవాదము

“ఓయీ! నేను మాండవ్యుఁడను, నిరంతరసత్యతపోవ్రతముల నన్యమెఱుఁగనినాకుఁ గొఱుత మహాదుఃఖ మనుభవింపవలసినదుఃస్థితి నీవు కల్పించుటకుఁ గారణ మేమి?

దండధర! యిట్టి దారుణ
దండమునకు నేమిదుష్కృతముఁ జేసితి సు
గ్రుండ నయి తగనిదండము
దండింపఁగ బ్రాహ్మణుండఁ దగునే నన్నున్
భార. ఆది. ౪:౨౭

దీనికిఁ దగినసమాధానము చెప్పుము. లేకున్న నాతపశ్శక్తి నీ కెఱుఁగుదువుకదా?”యని యడిగెను.

అంత, యముఁ డాతనితో “మహాత్మా! నీ వింతగాఁ గోపింపవలసినపని లేదు. నాసంగతి నీ వెఱుఁగుదువుకదా! జీవులకర్మఫలముల ననుసరించి యాయాకష్టసుఖములను గల్పించుచుందును. అంతకంటె నేను స్వతంత్రించి చేయున దేమియు లేదు. ఈసంగతి యెఱిఁగినమీవంటిఋషులు నాకు దోషారోపణము చేయుట ధర్మమా? నీ వీబాధ యేల నందితివో చెప్పెద వినుము. నీవు బాల్యమునఁ దూనిఁగలఁ బట్టుకొని వానినిగొఱ్ఱులఁ బెట్టితివి. దానిఫలితము నీ విట్లనుభవింపవలసివచ్చె

నది. బ్రహ్మర్షీ ! దానము స్వల్పమైనదైనను, ఎన్నియో రెట్లధికఫలము నిచ్చునట్లు, పాపముకూడఁ గొంచెమైనను అధిక దుఃఖమునే కూర్చు"నని పలికెను.

## మాండవ్యుఁడు యముని శపించుట

దానికి మాండవ్యుఁ "డయ్యా ! నీచెప్పినది నిజము కాని, నే నాపాపము నేవయసునఁ జేసితినో చెప్పు" మనెను. దానిపై యముఁడు "నీబాల్యమున" ననెను. మాండవ్యుఁడు "ధర్మరాజా ! పుట్టినది మొదలు పండ్రెండేడులవఱకు నుండు బాల్యమనునవస్థలో జీవుఁడు చేసినపాపము పాపముగా గణింపఁబడదుకదా ! ఏలన, బాలుఁ డాకాలమున శాస్త్రోపదేశము లెఱుంగఁడు. మంచిచెడ్డలు తెలిసికొనలేఁడు. మఱి యట్టి బాలుని కపకృతి చేసినవానికే పాపము కాని తనకృత్యములకు బాలుఁడు పాపమందఁ డన్నధర్మసూక్ష్మము మఱచిపోయితివా? ధర్మప్రభుఁడవైన నీవే యిట్లొనరించుచో నిఁక లోకములందలి సత్పురుషులగతి యేమి ? సమస్తప్రాణుల శిక్షించుటకంటె బ్రహ్మజ్ఞానసంపన్నుఁ డగువానిని శిక్షించుట యెంతవానికైన నెన్నియో రెట్లు మహాపరాధము. ఔచిత్యానౌచిత్యము లెఱుంగక, ధర్మసూక్ష్మముల నేమఱి ప్రశాంతుఁడ నగునాకు మహాక్రూరదండనమును నీవు విధించితివి. నీ వీదోషమునకు శిక్ష ననుభవింపక తప్పదు. నిన్ను శిక్షింపఁ గలుగువా రెవ రని నీ వనుకొనియుండవచ్చును. బ్రహ్మర్షు లెవ్వరినైన నేమైనఁ జేయఁ గలసమర్థు లని నీ వెఱుఁగుదువుగాక ! మఱియు, ఏధర్మశిక్షణము పనిగాఁ గలుగుటవలన నీ వింతటివాఁడవైతివో అట్టి ధర్మమును సరిగా నీవే యమలుజరుపనిచో లోకశ్రేయము నశిం

చును. కావున, నీవు మర్త్యలోకమున శూద్రుఁడవై పుట్టుదువు గాక"యని శపించెను. ఈమాండవ్యశాపముననే యముఁడు విదురుఁడై పుట్టెను.

## జనకరాజ మాండవ్య సంవాదము

జనకమహారాజు జ్ఞానప్రవిష్టుఁడై యనేకు లగుమహర్షులు వచ్చుచుఁ బోవుచు నుండ వారితో గోష్ఠులు నెఱపుచు వారివలనఁ దాను దనవలన వారు పరస్పరజ్ఞానానుభవములను, ధర్మసూక్ష్మవిషయములను దెలిసికొనుచుండ సర్వలోకసర్వకాలాదర్శపురుషుఁడై వెలుఁగొందుచుండువాఁడు. ఒకప్పుడు జనకరాజర్షికడకు మాండవ్యమహాముని విచ్చేసెను. జనకుఁ డాతని నెంతయు నాదరించి యతిథిసత్కారము లొనరించెను. పిదప, వా రుభయులు గోష్ఠిలో నున్నతఱి కోరికలు పోఁగొట్టుకొనుటకెట్టిశిక్ష కావలయు ననుప్రశ్న ముదయించెను.

అప్పుడు మాండవ్యుఁడు జనకుని వితృష్ణత్వశిక్ష విషయమున నీయనుభవమును నాకు బోధింపు మని కోరెను. జనకుఁ డానందించి "ఋషీంద్రా! దుఃఖమునకు దోషమునకు నిలయము లేవి? యని మన మాలోచింపవలయును. నాయనుభవమునుబట్టి అర్థములే యీరెండిటికి మూలములు. నాకు వీనిపై రవంతయైన ఆశ లేకపోవుటచేతనే నే నిపుడీసుఖము ననుభవించుచున్నాను. నేను తృష్ణ విడిచితిని. మిత్రమా! కామసుఖమే కాదు. ఎంతదివ్యసుఖమైనను కోరికను విడుచుటవలన వచ్చుసుఖముతో సరికాదు. నే నీసుఖానుభూతి నందుచుండుటచేతనే మిథిలానగరము కాలిపోయినసమయమునఁ గూడ నా కేమియుఁ గాలనియట్లే యుండెను. మఱియు, కోరికలు

తీరుట మొదలుపెట్టి అర్థములు సులభముగా లభించుచున్నవా యిఁకఁ జెప్పఁదరము కాదు. ఆవులోఁ బెరుగుకొమ్ములవలెఁ గోరికలు పెరుగుచునే యుండును. తృష్ణ దినదిన మభివృద్ధిఁ బొందుచునే యుండును. దీనితో మమకార మన్నిటియెడఁ గలిగి పెరిగి యట్టులు గట్టుకొనిపోవును. ఈతృష్ణ యను సముద్రము నింకఁజేయుటకై "మాబంధువులు", "మాధనములు", "మాయిళ్లు, మావాకిళ్లు" అనుభావములు మనస్సున స్థిరపడుచుకొనక యుండవలయును. వ్యవహారప్రపంచమున నట్లుచుకొనకతప్పదు కాని యవి మనస్సున స్థిరపడరాదు. మఱియు :

'దొరకొన్న ననుభవించుచు
దొరకొనమికిఁ జింత నొంది దురపిల్లక ని
ర్భరుఁడై యున్నను దృష్ణకుఁ
జొరవచ్చునె యతనిమనసు సువ్రతశీలా!'

శరీరమునకు ముసలితనము వచ్చును గాని ఆశకు ముసలితన మున్నది లేదు. దుర్మతులు దాని నెన్నఁడును విడువలేరు. తృష్ణారోగము ప్రాణము తీసి కాని పోదు. అది యంతగడ్డురోగము. కాని, కోరికలను విడిచిన మహనీయుఁడు దానిని బోఁదోలి పరమసుఖ మనుభవించును. నీవంటివారు మహానుభావులు. నీకు శోకముకాని సంతోషముకాని లేవు. అందుచే నీవు ద్వంద్వాతీతుఁడవు. అంతఃకరణ మనులక్ష్మికి శాంతి యనురక్షణమును నీ వుంచితివి. అందుచే నీవు వితృష్ణత్వసౌఖ్య మందినావు. అందఁ గలవు. ఎవనికైనను, అనుభవించినకొలఁది పెరుగుతృష్ణను

మొదలంటఁ గోయక సుఖము లేదు. కోరికలేమియు లేకుండుటే తృష్ణారోగమునకుఁ దగినమందు" అని పలికెను.

మాండవ్యుఁడు జనకరాజర్షిమాటల కమితానందమంది తనయనుభవమున కవి యన్నియు సరిపడ నాతని నభినందించి యిదివఱకే తన్ను వీడిపోయినతృష్ణ యింకను గడుదూరమునకుఁ బాఱిపోఁగా దివ్యశాంతియుతుఁడై తేజరిల్లెను.*

## యుధిష్ఠిర మాండవ్య సమాగమము

తొల్లి కృష్ణుఁడు ధర్మజునకు శివసహస్రనామస్తోత్రమెఱిఁగించి దానిని నిత్యము పఠించుటవలన సర్వపాపవిముక్తియై మనఃప్రశాంతి కలుగు నని తెలిపెను. అట నున్న మహర్షులుం గూడ నొక్కరొక్కరే శివస్తుతిమహత్త్వమును, శివప్రసాదమునఁ దమకుఁ గలిగినమేళ్ళను వివరించిరి. అపుడు మాండవ్యుఁడు ధర్మరాజుతో నిట్లనెను. "యుధిష్ఠిరా! నే నింతవఱకెవరికిని దెలుపనియొకరహస్యమును నీకుఁ దెలిపెద. వినుము. మున్ను నే నకారణముగా శూలమునఁ గొఱుతపడి యున్నప్పుడొకరాత్రి శివస్తుతియొనరించి భక్తిపరవశుఁడ నైయుంటిని. అపుడు శివుఁడు వెంటనే పొడసూపి 'మునీంద్రా! నీవు పుణ్యుఁడవు. ఈశూలమునుండి విడివడి యర్బుదవత్సరములు జీవింతువు. శూలకృత మగుపీడ నీ కేమాత్రమును గలుగకుండుటకు, ఆధివ్యాధివివర్జితుఁడవై నీవు సకలతీర్థస్నానఫలమందుటకు, నిత్యసత్యవ్రతుఁడ వగునీకు శాశ్వతానందప్రదమగుమోక్షసిద్ధి యగుటకు వరము లిచ్చుచున్నా' నని యంతర్హితుఁడయ్యెను. నాఁటినుండి నేను వజ్రశరీరుఁడనై జరాజాడ్యజననమరణరహితుఁడ నైతి" నని పలికెను.†

* భారతము. శాంతిపర్వము. † అనుశాసనికపర్వము

# శ్రీమహర్షి జీవితకథామృతము

## ముద్గలమహర్షి

### స్తుతి

అతిథిప్రియుని విశిష్ట
వ్రతుని విమత్సరుని సత్యవచనాత్ము విని
ర్జితవిషయేంద్రియుని సము
న్నతపుణ్యుని ముద్గలర్షి నమియింతు నెదన్.

దానము, ధర్మము, పరోపకారము ఇవి యెప్పుడును మానవుఁడు చేయుచునే యుండవలయును. దానతపములలోఁ దపముకన్న దానమే దుష్కరమని పెద్దలు చెప్పుదురు. ఊర్జితమగుఫలము నొసఁగుదానము అర్థసాధ్యము. కాన, నది దుష్కరము. అర్థము ప్రాణములకన్నను దీపికదా! ఏలన, ఉగ్రము లగునాయుధముల మొనలపై నుఱుకుట, సముద్రములఁ దఱిసి చనుట, కృషి, పశుపాలనము, వీనివలనఁ గలుగు నెల్లక్లేశముల నోర్చుట, అడవులలోఁ గొండలలో నిడుమలు గుడుచుట, అవసిపావసి యనుదినము పరప్రేష్యులై యుండుట యివన్నియు అర్థము కోసమే. అట్టిదుఃఖలబ్ధమైన యర్థమును విడుచుట చాలఁ గష్టము. మఱియు, అన్యాయార్జితవిత్తమునఁ జేయుదానము మూర్ఖన్యాయమున ఫలపాక మొసఁగకపోవుటే కాక దుష్ఫలము నొసంగును. యుక్తన్యాయార్జితధన మించుక

కంతయైనను దేశకాలపాత్రములఁ బట్టి దానము చేసిన మహాఫలవంత మగును. ఈవిషయమునకు ముద్గలమహర్షి చరిత్రమే నిదర్శనము.

ముద్గలుఁ డనునొకముని బ్రహ్మచర్యాశ్రమమున విద్యాబుద్ధులు గఱచినపిమ్మట సకాలమున యుక్తవయోరూపముల నొప్పుకన్యను వివాహమాడెను. కాలక్రమమున నాతఁడు పుత్త్రవంతుఁడై పుత్త్రదారసహితముగాఁ గురుక్షేత్రమున వసించుచు గృహస్థ ధర్మము నిర్వర్తించుచుండెను. ఆతఁడు మహావ్రతియై, నిత్యసత్యవచనుఁడై, మచ్చరము మాని, మద ముడిగి, అహంకారము వీడి, ఉత్తమతపోధ్యానానురక్తుఁడై యుండెను. ఆతఁ డాలుబిడ్డలను బోషించుటకై ఉంఛవృత్తి నవలంబించెను.

## ముద్గలుని ఉంఛవృత్తి

ఆమహనీయుఁడు ఆహారనిద్రాసుఖ స్త్రీసుఖములే సుఖము లని కలనైనఁ దలపోయక త్యాగమే ధన మనియు, భోగమే రోగమనియు, తపమే ధర్మమనియు నిరుపమ నిష్ఠయే నిత్యోత్సవ మనియు, ఉపవాసవ్రతపాలనమే మహాభోగ మనియు దృఢనిశ్చయుఁడై దివ్యజీవితముఁ గడపుచుండెను. ఆతనియాలుబిడ్డలు కూడ నాతనియడుగుజాడ నడచుచు, ఆతనితత్త్వ మవగాహనము చేసికొని అంతకన్న నదృష్టము లేదని యామహనీయునికి వ్రతపాలనమున కఠోర దీక్షతో, నియమనిష్ఠలలోఁ జేదోడువాదోడై యాతనియున్నత జీవితమునకు దోహదమునే యొసఁగుచుండిరి. ఆధ్యాత్మిక జీవితమునందలికఠోరదీక్షలలో నాలుబిడ్డలు కలిసివచ్చుట యందఱకుఁ బట్టునదృష్టము కాదు. 'ఎడ్డె మన్నఁ దెడ్డె' మనుబిడ్డఁడు.

అదుపాజ్ఞల నవలఁబెట్టి చెప్పినది పెడచెవిని బెట్టుభార్యామణి కలిగిన వానిజీవితమునుగూర్చి వేఱె చెప్పనేల !

ముద్గలమహర్షి ఉంఛవృత్తిపరాయణుఁడై పాడ్యమినాఁడు ప్రారంభించి పదునాలుగుదినము లొక్కొక్కగింజ చొప్పుననే పోగుచేసి తూమెడువడ్లయినపిదపఁ బర్వదినమునఁ బాకము చేయించి తొలుదొలుత దేవపితృపూజనము లొనరించి పిదప నతిథుల కన్నము పెట్టి యాపిమ్మట మిగిలినయన్నమును దాను బుత్రకళత్రములతోఁ బంచుకొని దేహయాత్ర యెట్లో నడపుచుఁ బరమేశ్వరధ్యానైకపరాయణుఁడై యుండెను. ఈవిధమునఁ బక్షోపవాసవ్రతదీక్షాదక్షుఁడై ముద్గలుఁడు దైన్యమన్నది తనమొగమునఁ గాని యాలుబిడ్డలమొగములఁ గాని కనరాకుండుటకు సంతసించి 'తిండికొఱకు జీవించుట కాక జీవించుటకుఁ దిండి' అనుమహోన్నత మగుఆర్షధర్మమునకు ఉత్తమ నిదర్శనముగా నుండెను. ఇట్టి వ్యక్తి యొక్కఁడైనను సర్వలోకములను బూతము చేయఁజాలుఁగదా !

## ముద్గలుడు దుర్వాసుని కాతిథ్య మిచ్చుట.

ఇటు లుండఁగా నొకనాఁడు చూడ నసహ్యాకరమైన పిచ్చివేషముతో, నొంటిపై బట్ట లేనివాఁడు, జడముడి వీడినవాఁడు, బండబూతులు తిట్టువాఁడు నగుచు దుర్వాసోమహర్షి ముద్గలునియింటి కతిథియై వచ్చెను. దుర్వాసునిమొగము ముడుతలు వడి యెన్నఁడు నన్నము మొగ మెఱుఁగక యుపవాసములతోడనే యున్నట్లుండెను. ఆతనికడుపు వ్రేగు లంటుకొని పోయి పుట్టినది మొద లంతవఱకు నన్నరసము బంటఁబట్టని

-ట్లుండెను. 'అన్నమో రామచంద్రా! ఆఁకలి ఆఁకలి' యని యాతఁడఱచుచుండెను.

ఈస్థితిలో వచ్చినమునిచంద్రుని గాంచి ముద్గలుఁడా వంతయు నసహ్యించుకొనక భయభక్తిభరితుఁడై యాలుబిడ్డలతోఁ గూడి యర్ఘ్య మొసఁగి పాద్యమిచ్చి యాతఁడు కూర్చున్నపిదప భార్య విసనకఱ్ఱతో విసరుచుండ నాతనిపాదము లొత్తి యనేకవిధసేవల నొనరించెను. అతఁడు "నా కీవీవన లేల? పాదసేవ లేల' అన్నమున కలమటించి చచ్చువాని కన్నము పెట్టి రక్షింపు"డని పలికెను. నాఁడు పర్వతిథియగుటచే బక్షమునఁ బ్రోగు చేసి యుంచిన ధాన్యము దంచి వండి ముద్గలునికుటుంబము తినఁ బోవునమయమున కీయతిథి వేంచేసెను. అందుచే ముద్గలుఁ డాతనికి భక్తితో నన్నము పెట్టి యాదరము చూపి యట్టిమహానీయుఁడు తన కతిథిగా వచ్చుట తనయదృష్ట మని యానందాంబుధి నోలలాడెను. దుర్వాసుఁడు ఉన్నయన్న మంతయుఁ దానే తిని శేషించినమెతుకు లెల్లెడలఁ జల్లి కోపము నటించుచు లేచిపోయెను. ఇట్లు పర్వము పర్వము దుర్వాసుఁడు వచ్చుచుండుటయు ముద్గలునకుఁ గాని యాలుబిడ్డలకుఁ గాని యొక్క మెతుకైన దక్కకుండఁ దినిపోవుటయు జరుగుచుండెను.

## దుర్వాసుఁడు ముద్గలు ననుగ్రహించుట.

ఇట్లు దుర్వాసుఁ డాఱుపర్వదినములు వరుసగా వచ్చి యాతిథ్యమును స్వీకరించెను. ఎన్నాళ్ళకైనను దాము కుడుచుటకుఁ గూడు లేకపోయినను, ముద్గలుఁడు, భార్య, బిడ్డ మువ్వురును దుర్వాసునియందు లవలేశమైన నిరాదరణము చూపరైరి. పైఁగా, ఆతనిమనస్సు రంజిల్లునట్లు సమస్తోపచారములు చేసిరి.

ఎంతయత్నించినను దుర్వాసుఁడు వారియెడఁ దప్పుపట్ట లేఁడయ్యెను. పరమకోపి యని ప్రసిద్ధిగాంచిన దుర్వాసోమహర్షియే వారిభక్తిశ్రద్ధలకుఁ దృప్తిగాంచె నన్న వారొనర్చినసేవ, చూపిన భయభక్తిగౌరవములు, వెల్లడించిన క్షమాగుణము, ప్రకటించిన దేహానిర్మమత్వము వర్ణనాతీతము లని చెప్పక చెప్పుచున్నవి.

తుదకు దుర్వాసుఁ డద్భుతప్రమోదమానసుఁడై అనునయపూర్వకముగా ముద్గలమునిఁ జేరఁబిలిచి "మునీంద్రా! నీయట్టి దానశీలుని నే నెన్నఁడును గని విని యెఱుఁగను. నీవు సత్త్వమతివి, సాధువిధేయుఁడవు. పుణ్యతేజుఁడవు. నేఁ బెట్టిన యిక్కట్టులకు మనమునందైన నేవగించుకొనక, లవమైన నవమానముచేయక, యించుకంతైనఁ గినియక, సోలమందక, కృత్రిమరహిత మైనభక్తి నాయెడఁ జూపితివి. సజ్జనస్తుత్యుఁడవగు నీకు అన్నదానము, ప్రసాదము, సత్యము, ధైర్యము, దమము, అపరిగ్రహత్వము, ఇవియే ధనము లయ్యెను. నరుని నాలుక యెల్లప్పుడు రుచుల కెదురుచూచును. తాలిమి, ధర్మము శమము వీని నాఁకలి దూరము చేయును. నీ వీరెండిటియందుఁ దగులక, జీవితస్థితివిధాయక మగునన్నము నతిథిసేవాపరాయణత విడిచి వేసితివి. అనఁగా జీవితేచ్ఛ విడిచివేయఁ గలిగితివి. ఇంతకన్న ఘనుఁడెవఁడు? తనకు మాలినధర్మము ధరణిఁగలదాయనుకొనువాఁడే యుండును. కాని, నీవంటివాఁడు లేఁడు. నీవిఁకఁ బ్రశంసాతీతుఁడవు. మనస్సును, ఇంద్రియముల వర్తనమును సరిగా నొనర్చుధర్మమే తప మని పెద్ద లందురు. అట్టి తపమును నీయందే నేను గాంచఁగంటిని. నీవలన నేను బరమసంప్రీతుఁడ నైతిని. పుణ్యపదము లెల్ల నీకుఁ గరతలామలకము

కాఁగలవు. నీప్రసిద్ధ మగుతపోవిభవమును మెచ్చిన దేవతలు నీకు సశరీర స్వర్గసుఖము సమకొనఁ జేయుటకు దివ్యవిమానమున వచ్చి నిన్నుఁ గొనిపోవుదురు. నేనిఁకఁ బోయివచ్చెద" నని వెడలిపోయెను.

## దివ్యవిమానమున దేవదూత వచ్చుట

అనంతరము కొంతసేపటికి హంససారసయుక్తము, కింకిణీమాలికామనోహరము, కామగమనము నయినయొక్క విమానముతో దేవదూత యొకఁడు ముద్గలునికడకుఁ జనుదెంచి యిట్లని పలికెను. "ఓముద్గలమునీంద్రా! నీపుణ్యపరిపాకమున నీకు బొందితోడికైలాసము ప్రాప్తమయ్యెను. నీసచ్చరితమునకు మెచ్చి నిన్నీవిమానమునఁ గొనిరమ్మని సకలదేవతలయభిమతమున దేవేంద్రుఁడు నన్ను నీకడ కనిపి యున్నాఁడు. ఇంతటి మహాభాగ్యమునకు యోగ్యు లగునరు లరుదు. కావున, సంతోషస్వాంతుఁడవై యాలుబిడ్డలతో నీవిమాన మధిష్ఠించి యమరపదసుఖ మనుభవింప విచ్చేయుము."

## ముద్గల దేవదూతలసంవాదము

ఈపలుకులు విని ముద్గలుఁడు దేవదూతకు నమస్కరించి "మహాత్మా! నీదర్శనమునఁ బునీతుఁడనైతిని. నీపలుకులు అమృతపుఁజిలుకులై నాయెడకు ముద మొదవించినవి. కాని, వ్రతదీక్షాపరుఁడ నగునన్ను భూలోకము విడిచి మీలోకమునకు రమ్మని యాహ్వానించిన దేవతలకు వారిదూత వగునీకు నమస్కారములు. నే నటకుఁ జనుదెంచుటకుఁ బూర్వము మీలోక మెట్లుండునో తెలిసికొనఁ గుతూహలపడుచున్నాను. ఈలోకమునకన్న నాలోకమున, విశేష మున్నఁ దప్పక విచ్చే

యుదును. సత్పురుషులతోడి మైత్రి సాప్తపదీనము. కావున, మీ లోకమునందలి గుణదోషవిశేషములఁ దెలుపు”మని కోరెను.

దాని కా దేవదూత “ఋషీంద్రా! మీ భూలోకమునకు మీఁదుగా స్వర్లోకము వెలుఁగొందుచున్నది. అది చాల మనోహరమైనలోకము. అది యనేకాలంకారయుతము. ఒక్క దేవతలకే సంచరించుటకుఁ జూచుటకు యోగ్యమైనది. ఇతరు లందుఁ జొరననర్హులు. మఱియు, మహాతపస్వులు, మహాయజ్ఞశీలురు, నిత్యసత్యవ్రతులు, ఉత్తములు, జితేంద్రియులు, సర్వసములు, దానపరులు, రణశూరులు, అందు సంతోషమున నుందురు. అందే, అప్సరసలు, సాధ్యులు, దేవర్షులు, మరుద్వసుప్రముఖులు, వేఱువేఱ తమతమయోగ్యప్రదేశములలో మహాసుఖులై వసింతురు. ఇంతేకాక, ముప్పది వేలయోజనములవిస్తీర్ణత గలమేరుపర్వతశిఖరమున నందనము మున్నగుమహోద్యానవనములు పుణ్యపరులకుఁ గ్రీడాస్థానములై విలసిల్లును. అచట ఆఁకలి, దప్పిక, శీతోష్ణభయములు, జరాజాడ్యవికృతులు, నెవ్వరికిని గలుగవు. ఏప్రదేశమును జూచినను, అతిమనోహరమై సర్వేంద్రియసౌఖ్యకరమై యుండును. ఇట్టిలోకమునకుఁ బుణ్యపురుషులు విధినియోగపక్వములైనమానుషశరీరములు విడిచి తేజోమయము లగుదివ్యదేహములు ధరించి వివిధాంబరభూషణభూషితులు, వాడుట యెఱుఁగనిచక్కనిపూలమాలలు ధరించినమనోహరులునై కనకవిమానములందుఁ దమ్ము దేవదూత లిటకుఁ గొనిరాఁగా వచ్చెదరు. వా రిచట శోకము కాని శ్రమము కాని, ఆయాసము కాని లేక మహాసుఖము లనుభవింతురు. దీనినే యింద్రలోక మం

దురు. ఇంద్రలోకముపైని బ్రహ్మలోక మొప్పారుచుండును. బ్రహ్మలోకము నిశ్శోకము, అనన్యదీప్తిసదనము. బ్రహ్మలోకమే తన దీప్తివలన సమస్తలోకములను వెలుఁగొందఁజేయుచుండును. బ్రహ్మలోకమున మనువులు, ధాతలు, మునులునుందురు. అందు లోభము, కినుక, పగ, తాపము, పాపము, దుఃఖవికృతులు మందునకైనఁ గానరావు. అన్నిభువనములు నాశమైనను బ్రహ్మలోకమునకు నాశనము లేదు. ఇంద్రాది దేవవిభులుసైత మాలోకముననే యుండ నాసపడుచుందురు." అని పలికెను.

ముద్గలుఁ డాతనితో "అయ్యా! స్వర్గమునందలి గుణములను జెప్పితివి. ఇఁక, నందలిదోషము లేవో వివరింపు"మనియెను. దేవదూత ముద్గలునితో "సంయమీంద్రా! స్వర్గలోకము పుణ్యానుభవప్రదేశము. ఇందుఁ జేసినపుణ్యము లందనుభవించునే కాని మనుష్యుఁ డందుఁ బుణ్యములు చేయలేఁడు. పుణ్యావసాన మైనపిదప నతనిని దేవతలు మరల భూమిపైఁ ద్రోయుదురు. సుఖములు మరఁగినస్వర్గమును విడిచి భూమిపైఁ బడుటకు నరుఁడు కొట్టుమిట్టాడును. కాని, దుఃఖీభూతుఁడై తేజోహీనుఁడైన యాతనిని దేవతలు బలవంతముగ భూమికి గెంటివేయుదురు. స్వర్గలోకమందలి జనులకుసైతము తమతక్కువతనము,ఒరులయున్నతత్వము అనుభావములు, వాని వలని మదమాత్సర్యములు కలుగును. ఒక్క బ్రహ్మలోకమునఁ దక్కఁ దక్కినపుణ్యలోకములం దన్నిట నిదియే పరిపాటి. పుణ్యలోకపరిభ్రష్టుఁ డీలోకమున సుఖశీలుఁ డయియే పుట్టుట మాత్రము నిక్కము. ఒక్కమాటలోఁ జెప్పవలయునన్న, ఈ

లోకము కర్మభూమి. ఆలోకము ఫలభూమి యని యెఱుంగుము. నీవలనియాదరంబునఁ జేసి యింతవివరముగా నీకుఁ జెప్పితిని. నీ వింక నాలసింపకుము. వేగిరము విమాన మెక్కుము. పోవుద" మని పలికెను.

## ముద్గలుఁడు స్వర్గముఁ దృణీకరించుట

అంత ముద్గలుఁడు దేవదూతతో "మహాత్మా! నీ వింత వట్టు చెప్పితివి. నీకుఁ గృతజ్ఞుఁడను. ఇట్టి దివ్యసుఖములు నాకక్కఱ లేదు. వానిని మీ దేవతలే యుంచుకొనుఁడు. మీకు మీస్వర్గమునకు నొక్కనమస్కారము. నా కేమిచ్చినను నే నట నడుగుపెట్టను. నాలోకమే నాకుఁ బదివేలు. పునరావృత్తి రహిత మగుశాశ్వతబ్రహ్మలోకమే నాకుఁ గావలయునది. అది లభించువఱకు నే నిటనే యుందును. ఇఁక, నీవు నీయిచ్ఛ వచ్చినచోట్టునఁ బోవచ్చును. నీకు నమస్కారము" లనిచెప్పెను.

ఈవాక్యములు విని దేవదూత మిక్కిలి యక్కజమందె "ఆహా! సశరీరస్వర్గసుఖము సమకొనియుండ దానిని దృణీకరించిన మహనీయుఁ డింకొకఁ డేఁడీ" అని యాతని నభినందించి తిరిగి విమానములోఁ దనలోకమునకుఁ బోయెను.

## ముద్గలుని కైవల్యప్రాప్తి

ఆపిమ్మట ముద్గలమహర్షి శిలోంఛవృత్తిని విడిచి పరమశాంతిని బడసి నిర్వికల్ప మైనజ్ఞానయోగమును గాంచి యాపైఁ దన్మహాయోగమునఁ జేసి కష్టసుఖములు, నిందాస్తుతులు, అవమానగౌరవములు, ఇట్టివానియం దెల్ల సమత్వదృష్టిఁ గలవాఁడై, మంటిబెడ్డయు బంగారమును, కుళ్ళినశవము పరమసుందరి, చండాలుఁడు మహాపండితుఁడు, బిచ్చగాఁడు మహా

రాజు తనదృష్టిలో నొక్కవిధముగనే తోఁచి స్థిరపడఁగా దేహపతనకాలమువఱకుఁ గాలము గడపి తుదకుఁ బునరావృత్తిరహిత శాశ్వతబ్రహ్మలోక మను పరమసిద్ధిం గాంచి నిత్యోజ్జ్వలుఁడై నిర్వికల్పుఁడై నెగడొందెను.

## మౌద్గల్యునికథ

ముద్గలునికుమారుఁడు మౌద్గల్యుఁ డనఁ బరగి పెరిగి పెద్దవాఁ డగుచు నిత్యతపోవృత్తిలో నుండెను. ఆతఁడు పితృభక్తియుతుఁడై యుండి తండ్రి గతించినపిమ్మట, ఇంద్రసేన యనునొకకన్యను వివాహమై గృహస్థాశ్రమము నిర్వర్తించుచుండెను. ఆతఁడును మహామునియై చిరకాల మట్లు జీవించెను.

కొంతకాలమునకుఁ బూర్వజన్మప్రారబ్ధమున నతనికి మహారోగము పొడచూపెను. ఆవ్యాధికతమునఁ గ్రమముగా మౌద్గల్యుఁడు త్వగస్థిభూతకష్టశరీరుఁడు, దుర్గంధవదనుఁడు, దుఃఖజీవుఁడు, అతికోపనుఁడు, విశీర్యమాణనఖత్వచుఁడు నయి వార్ధక్యదశఁ గాంచెను. కాని, యాతనిపత్ని యగునింద్రసేనమాత్రము మహాపతివ్రతయై యాతనిని భక్తిభావమున నారాధించుచు నసహ్య మెఱుఁగక యెడతెగనిశుశ్రూషల నొనరించుచుండెను. ఆహా! పరమపవిత్రమగు జీవితమున బ్రహ్మభాజనుఁడై యున్నపరమర్షికిఁగూడ కర్మఫలము కట్టికుడుపక విడువదుకదా! ఆతఁడు నిజతపోమహత్త్వమున నట్టిమహావ్యాధిని దుదముట్టించుకొనఁ గలిగియుఁ దపోధనమును వ్యయింప నొల్లక, ప్రారబ్ధ మనుభవముచేతనే నశించుట యెఱిఁగినమహానీయుఁ డగుట ఆత్మప్రశాంతి విడువక దేహబాధల నోర్చుకొనుచుండెడివాఁడు. అట్టి మహానీయునిభార్యయు జాడ్యగ్రస్తుఁడు

గదా యని భర్తను విడనాడిననీచురాలు కాదు. వివాహ మన్నది యొక్క నేఁటియనుబంధము కాదు. అనేకజన్మాగతమై నది. ఏమహాదోషముననో తనపతి కట్టికూరిరరోగము కలిగి నంతమాత్రమున భర్తను విడిచివేయుచో వివాహబంధ పవి త్రిత నశించిపోవునుగదా !

ఇట్లుండ మౌద్గల్యునివేళ్లు అన్నము తినునపు డందుఁ జునిసిపడెను. అది చూచి యింద్రసేన యసహ్యించుకొనక తీసివైచి యాపతిభుక్తశేషమును బరమప్రసాదముగా భుజిం చెను. చిరకాలమునుండి తా నున్నమహారోగదుఃస్థితి, భార్య పాతివ్రత్యము గాంచిమౌద్గల్యుఁ డమితానందమున భార్యను బిలిచి "సాధ్వీ ! నీపతిభక్తికి మెచ్చితిని. నీ కేవరము కావల యునో కోరుకొను" మనెను. అంత నామె "దేవా ! నాకుఁ గామోపభోగేచ్ఛ యమితముగాఁ గలదు. నీవు తపశ్శక్తిని మనోహరాకారము ధరించి పంచధా విభక్తుఁడ వయి నన్ను రమించి కామభోగములఁ దనుపు" మని కోరుకొనెను.

మౌద్గల్యుఁడు నిజతపశ్శక్తికతమున క్షణమాత్రములో దివ్యసుందరాకారము లైదు ధరించి మర్త్యదేవలోకములందు బ్రహ్మర్షి దేవర్షిపూజితుఁడై సూర్యరథ మెక్కి చని యాకాశ గంగాజలముల స్నానము చేసి చంద్రకిరణములలో నివసించి మేరుకైలాసములఁ గ్రీడించుచు ననేకసహస్రవర్షము లనేకస్థాన ముల నింద్రసేనతో నుపభోగించి పరితృప్తి నంది యామెను విడిచిపెట్టి ఘోరతప మొనరించి బ్రహ్మమయుఁడై బ్రహ్మ లోకమునకు జనెను. ఈయింద్రసేనయే జన్మాంతరమున ద్రౌ పదియై పుట్టి భర్తృపంచకమును బడసెను.*

* భారతము. ఆదిపర్వము—(పంచేంద్రోపాఖ్యానము)

# శ్రీ మహర్షి జీవితకథామృతము

# మైత్రేయ మహర్షి

## స్తుతి

శ్రద్ధాభక్తి నుతింతు స
మిద్ధపరిజ్ఞాను సుజనహితు మైత్రేయున్
వృద్ధజనసేవ్యుఁ దాపస
వృద్ధశ్రవు యోగిగేయు వినుతాచారున్.

## బాల్యము

మైత్రేయుఁ డనుమునికుమారుఁడు బాల్యమునుండియుఁ బరాశరమహర్షి నారాధించి యాతనికి శిష్యుఁ డయ్యెను. మాతృగర్భమున నుండియే వేదశాస్త్రపురాణవిద్యలు నేర్చిన మహనీయుఁడు, బాల్యమునందే నిజతపస్సామర్థ్యమున సర్వరాక్షసవినాశకర మగుయజ్ఞముఁ జేసినశక్తివంతుఁడు, పులస్త్యబ్రహ్మకతమున దివ్యజ్ఞానసిద్ధి గాంచినమహాత్ముఁడు, మునిలోకచక్రవర్తి, రమ్యతేజోధనుఁడు నగుపరాశరమహర్షి మైత్రేయు నధికవాత్సల్యమున నాదరించి, కన్నబిడ్డనువలెఁ గాంచి, యనేక ధర్మశాస్త్రములు, వేదవేదాంగములు నేర్పెను. మైత్రేయుఁ డనేకవత్సరములు క్షణమాత్రమైన నేమఱక గురుశుశ్రూష లొనర్చుచుఁ బరాశరునిహృదయముఁ జూఱకొనెను.

## పరాశరుఁడు మైత్రేయునకు విష్ణుపురాణము చెప్పుట

ఒకనాఁడు ప్రభాతకాలోచితకృత్యములు తీర్చి సుఖాసనమునఁ గూర్చుండి యున్న గురువర్యునకు నమస్కరించి మైత్రేయుఁడు "మునినాథా! నీయవ్యాజకటాక్షమువలన సాంగములైన వేదములు, శాస్త్రములు, సంశయరహితముగా నేర్చితిని. నీప్రసాదమున మనస్సు సుప్రసన్నమై యున్నది. నాకు సర్వమును నీవే కాన, నిన్నుఁ గొన్ని విషయము లడిగెదను. దయతో సెలవిమ్ము, ఎల్లవేల్పులకు మూలమైన వేల్పును గూర్చి, యాతనిమహాత్త్వముఁ గూర్చి వినఁగోరెదను. మఱియుఁ బృథివ్యాదిభూతప్రమాణములు, సప్తసాగరవిస్తారములు, సప్తద్వీపప్రకారము, సప్తకులపర్వతములస్థానములు, సూర్యాదిగ్రహతారకసంచారము, దేవాది చతుర్విధభూతనిర్మాణము, చతుర్దశమన్వంతరముల ప్రమాణములు, చతుర్యుగప్రమాణములు, కల్పకల్పవిభాగములు, యుగధర్మములు, దేవర్షిచరితములు, రాజవంశానుకీర్తనము, వేదశాఖాప్రమాణములు, బ్రాహ్మణాది వర్ణధర్మములు, బ్రహ్మచర్యాది చతురాశ్రమములు, మొదలగుసర్వమును దెలుపు"మని కోరెను.

పరాశరుఁ డందుల కానందించి పులస్త్యబ్రహ్మకృతమునను, తనతాతయైనవశిష్ఠునిమూలముననుదనకు దేవరహస్యకార్యము లెల్ల దీపము వెట్టినట్లు, వేదవిద్యావిషయము లెల్ల కరతలామలకములుగను, అనేకధర్మశాస్త్రము లాటపాటలుగను, దోఁచుటఁ దెలిపి యవి యన్నియు మైత్రేయునకుఁ బ్రియమార వినిపించెను. ఈయావద్విషయములు పరాశరసంహితె

లేక విష్ణుపురాణ మను పేర జగమునఁ బ్రసిద్ధిగాంచెను. మఱియు మైత్రేయునితోఁ బరాశరుఁడు:

"పుట్టును జావును జావును
బుట్టకయును గాని జీవముల కొకచోటన్
నెట్టుకొని యుండఁ జెల్లదు
ముట్టినకర్మములు మారి మోచినకతనన్.

అర్థ మార్జించునప్పుడు నది సురక్షి
తంబు గావించునప్పుడుఁ దద్వియోగ
మైనయప్పుడు దుఃఖంబె కాని తనకుఁ
గలిమి సుఖ మని చెప్పినఁ గానిపలుకు.

ప్రాప్తి లేమి మేలు పడయుదు నని ప్రియా
సంబుతోడఁ దిరిగి సంఘటింప
కున్న దుఃఖపడుచు నుండుఁ గోరనినాఁడు
కోర నైతి ననుచుఁ గోరుచుండు.

వనితలుఁ జెలులున్ జుట్టలుఁ
దనయలు క్షేత్రములు నిల్లు ధనధాన్యములున్
దనకును బోయిన వచ్చిన
ఘనదుఃఖమె కాని మేలు కలుగదు సుమ్మీ.

పరమ దుఃఖపాదపమునకు బీజముల్
కర్మచయము లిట్టుగాన నుభయ
కర్మమయ శరీర కార్పాస బీజంబుఁ
బోలె నవధి లేక పుట్టుఁ బొలియు.

గర్భ జన్మ జరామృత్యుకాలముల శ
రీరి సంసారమార్తాండ ఘోరతాప
ములకుఁ జిక్కక ఘనమైన మోక్షతరువు
నీడ నుండక సుఖ మేల నివ్వటిల్లు ?
ఈయాత్యంతిక దుఃఖముఁ
బాయ నుపాయంబు వినుము పరమం బగు నా
రాయణ భగవన్నామము
ధ్యేయం బని జ్ఞానవిదులు తెలిపిరి మొదలన్."

(విష్ణుపురాణము.)

అని చెప్పి యాతనిసంశయముల నెల్లఁ దీర్చెను.

మైత్రేయుఁడు బ్రహ్మానందమంది "మహాత్మా ! నీదయ వలన సమస్తముఁ దెలిసికొంటిని. ఇఁక నొక్కటియు నే నడుగ వలసినది లేదు. నామనస్సు మిక్కిలి విశదమై వివేకలక్ష్మీయుతమై యున్నది. ని న్నింతవట్టు శ్రమపెట్టి దోషము చేసితిని. దయతో నన్ను క్షమింపు"మని సాష్టాంగ మెఱఁగెను. పరాశరుఁ డాతనిని లేవనెత్తి "వత్సా! నీవు నాకొనరించిన సేవలకు నాచిత్తము ప్రసన్నమయియుండుటచే నీకింతవట్టు చెప్పితిని. ఇది వేదమూలము, పరమపుణ్యప్రదము. నీ వింక యథేచ్ఛ మేఁగి సుఖముండు" మని వీడుకొలిపెను. మైత్రేయుఁడు విష్ణుస్మరణాపూర్వకముగ నటనుండి బ్రహ్మానందనిష్యందమధుపానమత్తుఁడై వెడలిపోయెను.*

* విష్ణుపురాణము.

## మైత్రేయుఁడు ధృతరాష్ట్ర దుర్యోధనులకు హితము చెప్పుట

మైత్రేయుఁడు మహావిజ్ఞానియై సర్వతీర్థములను సందర్శించుటకు నిశ్చయించుకొని ఆయాతీర్థముల నొకటి తరువాత నొకటిఁ గాంచుచుఁ దిరుగుచుండెను. ఆపరిభ్రమణములో నాఁతఁడు కురుజాంగలమునఁ గామ్యకవనమున ధర్మజాది పాండవులఁ గాంచి వారిసంగతి యెఱిఁగి ధృతరాష్ట్ర దుర్యోధనులకు బుద్ధిచెప్పు తలంపు పొడమ నటనుండి ధృతరాష్ట్రుని కడకు విచ్చేసెను.

అంతకుమున్నే వ్యాసమహర్షి ధృతరాష్ట్రునకు మైత్రేయుఁడు హితవచనములఁ జెప్ప విచ్చేయనున్నాఁడని చెప్పి వెడలెను. అందుచే ధృతరాష్ట్రుఁడు మైత్రేయు నుచితరీతిఁ బూజించి సుఖవిశ్రాంతుఁ గావించెను. పిదప, ధృతరాష్ట్రుఁడాతనిని "మహాత్మా! మీ రెందుండి వచ్చితి"రని యడిగెను. అందుల కాతఁడు పరమతపోభారమున జటాజినములు ధరించి, నారబట్టలు కట్టి, కాయగూరలు తినుచు, కామ్యకవనమునఁ దిరుగు పాండవులకడనుండి వచ్చితి నని చెప్పెను. ధృతరాష్ట్రుఁడు వెంటనే వారియోగక్షేమము లడిగెను. అంత, మైత్రేయుఁడు "రాజా! పాండవులు ధర్మమతులు. మహామునులు వారికడకు వచ్చుచు దీవించుచు వారన్నఁ బ్రియముతో నుందురు. అట్టి వారికిఁ గుశలముకా కన్య మెట్లగును? వారు ధర్మము కాని ప్రతిజ్ఞ కాని తప్పినచో సూర్యచంద్రులు గతులు తప్పుదురు. అట్టివారి కకారణముగా నీకొడుకు నికారము గావించెను. నీవును నీకుమారుఁడును బుద్ధిగలిగి పాండవులతో విరోధ

ముడిగి సుఖింపుఁడు. దానివలనఁ గురుకులమునకు మేలగు. నామాట వినుఁడు. పాండుపుత్రులు మహాపరాక్రమవంతులు. ఇంద్రసమానులు. ఒక్కొక్కఁడు నూఱేనుఁగులపెట్టు. వారు రణధీరులు, ఉగ్రాయుధులు, ఉత్సాహపరులు; వారిలోనొక్కఁడే బకహిడింబకిమ్మీరాదుల నుక్కడఁచెను. ఆతని నెదిరింపఁగల వీరుఁ డింకొకఁ డేఁడీ? యని" పలికెను.

## మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట

అంత దుర్యోధనుఁ డామాటలు వినలేక మైత్రేయుని నిర్లక్ష్యము చేసెను. మైత్రేయుఁ డాతనివంకఁ దిరిగి మఱియు నిట్లు చెప్పెను. "పాండవులకు వాసుదేవ దృష్టద్యుమ్నులు బంధువులు, సహాయులు. జరామరణవంతు లైనమనుజు లెవ్వరును వారిని మార్కొని జీవింపలేరు. వారితో నొడంబడి మేలు పొందుము. ఇదియే నాహితోపదేశము. ఇదియే నీవు చేయఁదగినకార్య" మని పలికెను. ఆమహర్షిమాట లాలింపక దుర్యోధనుఁడు నిర్లక్ష్యభావమునఁ గాలిబొటనవ్రేలితో నేల వ్రాయుచు బాహువు లెత్తి తొడలు చఱచి నవ్వుచుండెను. మైత్రేయుఁ డాతని వైఖరి ససహ్యించుకొని యాతని నిర్లక్ష్య బుద్ధికిఁ గోపించి "ఓయీ! దుర్యోధనా! నీవు నాయెడఁ జేసిన యీయపరాధము కారణముగా యుద్ధమగు. అందు నీవు భీమునిగదాఘాతమున నీతొడలు భగ్నముకాఁగాఁ జత్తు" వని శపించెను.

ధృతరాష్ట్రుఁడు మైత్రేయునిపాదములపైఁ బడి క్షమింపు మనియు శాపముఁ గ్రమ్మఱింపు మనియుఁ గోరుకొనెను. కాని మైత్రేయుఁడు దుర్యోధనునికి సమబుద్ధి కలిగిన శాపము ఫల

వంతము కాదనియుఁ గలుగనినాఁడు శాపఫలము కట్టికుడుపు ననియుఁ జెప్పి శీఘ్రముగా వెడలిపోవుచుండ ధృతరాష్ట్రుఁడు తన కింక నేవియో విషయములు చెప్పు మన 'నే నొక్కనిమిష మింట నుండును. విదురు నడుగుము. ఆతఁడు చెప్పు'నని వెడలి పోయెను.

## విదుర మైత్రేయ సంవాదము

తరువాత, నొకప్పుడు విదురుఁడు జ్ఞాననిధియు, తాపసేంద్రుఁడు, ఆశ్రితమందారుఁడు నగుమైత్రేయమహర్షిని జూడఁ గోరి బయలువెడలెను. ఆతఁడు యమునానదిని దాఁటి మఱికొన్నిప్రయాణములు చేసి పుణ్యనదులను హరిక్షేత్రములను దర్శించుచు నతిత్వరితగమనుఁడై గంగానదిని సమీపించి యందు సుఖపుణ్యస్నాన మాచరించి తత్ప్రదేశమున నొకయిసుకతిన్నె మీఁద యమనియమాదియోగనిష్ఠం బూని పద్మాసనాసీనుఁడై హరిపాదపద్మములు చిత్తమునఁ జేర్చి బాహ్యేంద్రియవ్యాప్తి నరికట్టి, ఉత్తమాచారము, ఉత్తమవ్రతము, ఉత్తమోపవాసములు వీనివలనఁ గృశించి యున్నపుణ్యపురుషుని, వయోవికారవిరహితుని, యోగిజనగేయుని మైత్రేయమహర్షిని బొడగాంచెను. వెంటనే విదురుఁ డాతనిపాదపద్మములకుఁ బ్రణమిల్లి ముకుళితహస్తుఁడై "మునీంద్రా! లోకమున జను లందఱు మనముల నెన్నియో సౌఖ్యములఁ గోరి వానిని సమకూర్పఁ జాలు కర్మము లాచరించి దైవోపహతులై యాకర్మములవలన ఫలితములను గాంచఁజాలక వ్యర్థు లగుదురు. కర్మములు బంధ*కములు దుఃఖదములే కాని సౌఖ్యదాయకములు కావు. అవి

*భారతము. వనపర్వము.

పాపనివృత్తిఁ జేయఁజాలవు. సకలదుఃఖములకుఁ గారణ మైన సంసారచక్రమునఁ బరిభ్రమించుచుఁ గామమోహితులై పూర్వకర్మానుగతము లైనశరీరములు దాల్చుచుఁ జచ్చుచు, మరలఁ బుట్టుచు నెంతకాలమున కైనను బాపనివృత్తిఁ గాంచక మాత్స్యయావనవనకుతారులై జనించి వర్తించుమూర్ఖులను రక్షించుటకు నారాయణపరాయణు లైనమీవంటిపుణ్యాత్ములే సమర్థులు. కాన, నీవు నన్నుఁ గటాక్షించి త్రిగుణాత్మకమాయానియంతయగుభగవంతుఁడు స్వతంత్రుఁ డయ్యు నవతారములు దాల్చి యేయేకర్మల నొనరించెను ? ఏయేతత్త్వభేదముల నేయేరీతులఁ బుట్టించెను ? కర్మ నామరూపభేదము లెట్లు నిర్దేశించెను ? అన్నవిషయములు సవిస్తరముగాఁ దెలుపుము. పుండరీకాక్షుని చరిత్ర శ్రవణమునఁ గాని జననమరణాది సకలదుఃఖాకరములు దుష్కర్మప్రాప్తములు, నగుభవబంధములు తెగవు.'' అని పలికెను.

మైత్రేయుఁ డానందించి ''అనఘా! కృష్ణకథాశ్రవణతత్పరుఁడవై నీవు నన్నడిగినవిషయము లెల్లఁ జెప్పెదను. ఏలన నీవు భగవద్భక్తుఁడవు, హరికథాతత్పరుఁడవు. మాండవ్యశాపమున నిట్లు పుట్టిన ప్రజాసంయమనుండ వగుయముఁడవు. ఇంతే కాదు. నీవు పరమజ్ఞానసంపన్నుఁడ వగుట, నారాయణప్రియతముఁడ వగుటఁ గృష్ణుఁడు నిర్యాణకాలమున నన్నుఁ దనచెంతకుఁ బిలిపించుకొని విజ్ఞానమెల్ల నుపదేశించి నీ కెఱిఁగింపు" మని యానతిచ్చెను. అందుచే నీవు కోరినసమస్తవిషయములు తెలుపుదును. సావధానుఁడవై విను"మని చెప్పి విజ్ఞా

మాహాత్మ్యముఁ దెలిపి, సృష్టిక్రమ మెఱిఁగించి, జీవునికర్మబంధ
నాదికముఁ దేటపఱిచి

"హరిచరణారవిందయుగ
ళార్చనసన్నుతిభక్తియోగముల్
నిరతముఁ గల్గువారు భవ
నీరజగర్భుల కందరాని భా
సురపదమందుఁ జేరుదురు
సూరిజనస్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మఫలముల్
గణుతింపఁ దరంబె యేరికిన్." (భాగ.౩స్కం.౨౮౩)

అని చెప్పెను.

విదురుఁడు ముకుళితహస్తుఁడై శిరము వంచి మనమున శ్రీకృష్ణుని దలపోసి మైత్రేయునితో "మహాత్మా! నీవాక్య పరంపరలచే నాసంశయములు తీరినవి. లోకమున కీశ్వరుఁడు హరి యనియు, జీవుఁడు పరతంత్రుఁ డనియుఁ దలంతును. నారాయణభక్తిప్రభావము ప్రాణిగోచర మైనఅవిద్యకు నాశన కారణము. నారాయణుఁడు సమస్తాధారుఁడు. ఆతఁడు దేనిపైని నాధారపడఁడు. నారాయణభజనమున సమస్తదుఃఖములు నశించు నని నీదయవలన నెఱింగితిని." అని మఱియెన్నియో ప్రశ్నము లడుగ మైత్రేయుఁ డాతనికి భగవత్ప్రోక్తము, ఋషిసంప్రదాయానుగతము, పురుషోత్తమస్తోత్రము, పరమపవిత్రము, భవలతాలవిత్రము, నగుభాగవత మెల్లఁ దెలిపెద వినుమని పుండరీకాక్షుఁడు తనుదానె విశ్వభేదమును గల్పించినవిధమును సవిస్తరముగాఁ దెలిపి, కాలలక్షణ మెఱిఁగించి కాలా

త్ముఁడు, ఈశ్వరుఁడు నైననూర్యుఁడు, పురుషుల కాయురాదివ్యయంబులంజేసి విషయాసక్తినివర్తింపఁజేయుచుండు. అట్టిమార్తాండునికిఁ బూజ గావింపు మని చెప్పెను. అనంతరము కాలాహ్వయుఁడై తనరినహరిమహిమఁ దెలిపి, సృష్టిమహిమ విశదపఱిచి, స్వాయంభువమనుచరిత్రము వినిపించి, యజ్ఞవరాహవృత్తాంతముఁ దేటతెల్లము చేసి, హిరణ్యాక్షహిరణ్యకశిపులకథలు మున్నగునవి విస్తరించి చెప్పెను.

ఇట్లన్నియు విన్నవిదురుఁడు మైత్రేయునికిఁ బరమభక్తి నమస్కరించి "మునినాథా! నీవలన భక్తవత్సలుఁ డగుశ్రీకృష్ణునితత్త్వమెల్ల నెఱుఁగఁగంటిని. ఇఁక, నాకు సెలవిమ్ము. పోయి వచ్చెద" నని యాతనిచే నామంత్రితుఁడై కరిపురమున కరిగెను.

## వ్యాసమైత్రేయ సంవాదము

విద్యాతపోదానములలో నేది విశేష మనుప్రసంగము వచ్చినపుడు భీష్ముఁడు ధర్మరాజుతో వ్యాసమైత్రేయసంవాదమును దెలిపెను.

తొల్లి యొకప్పుడు మైత్రేయమహర్షి కాశీనగరమున నున్నసమయమున వ్యాసమహర్షి రహస్యముగా విచ్చేసెను. మైత్రేయుఁ డపరిమితానందమంది వందన మొనరించి భక్తితోఁ బూజించి యుత్కృష్టభోజనమునఁ దృప్తి చేసి నంత వ్యాసమహర్షి ముఖమున నానందము తాండవమాడెను. అది చూచి మైత్రేయుఁడు "మహాత్మా! నీవు విచ్చేసి నన్ను ధన్యు నొనర్చితివి. నీ వీనాఁ డపూర్వానంద మనుభవించుచున్నట్లు నీముఖము చెప్పక చెప్పుచున్నది. దీనికిఁ గారణ మెఱిఁగింపు" మని

కోరెను. అంత నాతఁడు "మునీంద్రా! తపము, శ్రుతము మున్నగుధర్మకోటిలో దానమే యగ్రగణ్యము. ఆదానవస్తువులలో కెల్ల అన్నమే యెక్కుడు. ఏలన, అసువులు అన్నమయములు. శరీరమునకు బలము దాననే లభించును. కావున, బుధు లన్నదాన మన్నిటికన్న మిన్న యందురు. మనస్సునఁ గలకల్మషములను దపము పోఁగొట్టును. అపుడు మనస్సు విద్య కాస్పదమగును. తపస్వి మహితదానముతోఁ గూడిన విద్యవలన మిక్కిలి రాణించును. కావున, తపము, విద్యయు దానముయొక్క ఉదాత్తను వృద్ధిపొందఁ జేయును. విద్యోన్నతి వ్రతపరాయణులకు అచ్యుతుని జూపుచక్కనిదీపము. నీవు చేసినయన్నదానవిశేషమున నే నింతయానంద మనుభవించుచున్నా" నని బదులుచెప్పెను. ఇంతటిమహనీయుఁ డగువ్యాసునికిఁ దృప్తిఁ గూర్చిన మైత్రేయునిభిక్ష మిక్కిలి శ్లాఘ్యమై వెలసెను. పిదప, వ్యాసుఁడు మైత్రేయునుచితవచనముల వీడుకొని యథేచ్ఛము వెడలిపోయెను.

---

* భాగవతము.

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

# రైభ్యమహర్షి

## స్తుతి

బ్రహ్మసుతుఁ డైన రైభ్యుండు పరమయోగి
అధ్యయనశూరుఁ డార్యగృహస్థవరుఁడు
బ్రహ్మవిజ్ఞాని మునిలోకపారిజాత
మతనిపదపద్మములఁ గొల్తు నధికభక్తి.

రైభ్యుఁడు బ్రహ్మసుతుఁ డని వరాహపురాణమునఁ గలదు. అంతకంటె రైభ్యునిజననమును గూర్చినవృత్తాంత మేమియుఁ గానరాలేదు. అనేకు లగునితరఋషులవలెనే యీ మహర్షి జననవిశేషములు మాతాపితృవృత్తాంతముఁ దెలిసికొనుటకు మనము నోచుకొనలేదు.

## రైభ్యుని విద్యార్థిదశ

రైభ్యుఁడు బాల్యముననే యుపవీతుఁడై యొకమహర్షి కడఁ జేరి శిష్యుఁడై యధ్యయన మారంభించెను. రైభ్యుని గురుభక్తి యద్వితీయమైనది. ఎంతయల్పవిషయముననైనను గురువాక్యప్రకారము తు, చ తప్పక యాతఁడు వర్తించుచుండెను. గురుఁడు మేలుకొనుటకుముందే వేకువ నీతఁడు లేచి కాలకృత్యాదికముఁ దీర్చి పరిశుద్ధహృదయుఁడై గురుఁడే పరమేశ్వరుఁ డనుస్థిరవిశ్వాసము కలిగి గురుజపము, గురునామస్మరణముఁ

వక్క నన్య మెఱుఁగక గురునాజ్ఞను దలదాల్చి దినకృత్యములు నడపి గురుశుశ్రూషా పరవశుఁడై గురుఁడు నిద్రపోవువఱకుఁ బాదపద్మారాధన మొనరించుచు గురుఁడు నిద్రాముద్రితుఁ డైనవెనుక నాతఁడు వట్టినేలమీఁద నొకనిద్ర తీయువాఁడు, మరల వేకువవేళఁ బెందలకడ లేచి యీప్రకారమే మెలంగుచు గురుహృదయమును జూఱగొనెను.

ఈవిధముగా రైభ్యుఁడు గురుశుశ్రూష చేయుచు మహా క్లేశదాయక మగువిద్యార్థిదశను నిశ్చలుఁడై, నిరుపమానవ్రత దీక్షితుఁడై కడపుచుండ నీతనిపై నమితవాత్సల్యము కలిగిన గురుదేవుఁ డీతనికి విన్నమాత్రనే సుస్థిరముగా హృదయమున నెలకొనునట్లు సర్వవేదశాస్త్రములను నేర్పెను. రైభ్యుని గురుభక్తికి గురుకటాక్షలబ్ధమైన విద్యావినయసంపత్తికి దేవతలు మెచ్చి వచ్చి యాకసమునుండి యీతనిపైఁ బుష్పవర్షముఁ గురిపించుచుఁ దమ యాహ్లాదమును వెల్లడించుచుండువారు. ఆహా ! గురుకృపవలన సమకూరనిదిగలదే ! గురుకటాక్షమే సర్వదేవతాకటాక్షసాధక మనుటకు, సంప్రదాయసిద్ధముగ గురుముఖమున శుశ్రూషాధన మనుదక్షిణ యిచ్చి నేర్చుకొన్న విద్యయే బ్రహ్మవిద్యాసాధక మనుటకు రైభ్యమహాము విద్యార్థిదశయే సాక్షిభూతము.

రైభ్యమహర్షి సర్వవిద్యలు నిట్లు నేర్చి బ్రహ్మజ్ఞానము నవి తనకుఁ బ్రసాదింప హృదయమందలికలంక దేఱి గురునాజ్ఞ నాతని వీడుకొని బ్రహ్మజ్ఞానము సుస్థిర మొనర్చుకొనుటకై బృహస్పతికడ కేఁగి యాతనికటాక్ష మర్థించెను.

## రైభ్య బృహస్పతి సంవాదము

బృహస్పతి రైభ్యుని మిక్కిలి యాదరించి యాతనికిఁ గలిగినసంశయము లెల్లఁ దీర్చి యెప్పు డేసంశయము కలిగినను దనకడకు యథేచ్ఛముగా విచ్చేసి తీర్చుకొనవచ్చు ననియు రైభ్యునియంతటి గురుభక్తుని, విద్యావినయసంపన్నుని దా నొండెడఁ జూడలే దనియుఁ బలికి యాతనిఁ గటాక్షించెను. నాఁడు మొదలు రైభ్యమహాముని భూలోకమున నొకచక్కనియాశ్రమము నిర్మించుకొని బృహస్పతికడకు దివికి వచ్చి పోవుచు నాతనికటాక్షమునకుఁ బాత్రుఁడయ్యెను.

ఒకప్పుడు రైభ్యున కొకసంశయము కలిగెను. మోక్షసంపద కర్మలు చేయుటవలన లభించునో లేక విజ్ఞానము గడించుటవలన లభించునో దేనివలన సులభముగా లభించునో యాతనికి విస్పష్టము కావలసియుండెను. సంశయములను దర్కసాధనమునఁ దీర్చుకొనవచ్చును గాని సంశయరహితులు సమ్యక్ జ్ఞానులు నగుపెద్దలు లభ్యులగునపుడు వారి నడిగి తెలిసికొనుట కంటె నుత్తమమార్గము లేదు. ఇటు లెంచి రైభ్యుఁడు బృహస్పతికడకుఁ బోవఁ దలఁచి బయలుదేఱి వసుమహారాజుకడకు విచ్చేసెను. వసువు రైభ్యునిభక్తిశ్రద్ధలఁ బూజించి యాతఁడు పోవలసినపని, తావు తెలిసికొని యిరువురును గలిసి బృహస్పతి బ్రహ్మలోకమున బ్రహ్మతో మాటాడ నేఁగినట్లు విని బ్రహ్మలోకమున కేఁగి నలువహజారముముందువాకిట నిలఁబడి యుండిరి.

కొంతసేపటికి బ్రహ్మ వీడ్కొలుప బృహస్పతి శిష్యసమేతుఁడై బయటికి వచ్చి ముందువాకిటఁ జొచ్చి యట నున్న

వసు రైభ్యుల నాదరించి వారిసాష్టాంగ నమస్కారములు నుప
చారములు నంది వారినిగూడి బృహస్పతి స్వర్గలోకమున కేఁగి
యటఁగల తనదివ్యమందిరము లోపలిభాగమునఁ జంద్రశిలాస
నముల వారిని గూర్చుండ నియమించి తాను లోని కేఁగి వచ్చి
సుఖాసీనుఁడై యాదరమేదుర వచనముల వారి క్షేమము లడి
గెను.

అపుడు రైభ్యుఁడు "దేవా! మోక్షము కర్మవలననో
సుజ్ఞానముననో దేనివలన సులభముగ లభించునో తెలియఁజెప్పు"
మని ప్రార్థించెను. అంత బృహస్పతి "మునీంద్రా! తామర
పాకు నీటినిఅంటనివిధమున, మానవుఁడు సత్కర్మములను
గాని దుష్కర్మములను గాని కర్తృత్వము గనక యీశ్వరార్పణ
ముగా నొనరించుచో వానివానిఫల మాతని నంటదు. దీని
కొకపూర్వగాథఁ దెలిపెద వినుము. అత్రిగోత్రసంభవుఁడైన
సంయమనుఁ డనుమహర్షి తీర్థయాత్రాపరుఁడై భాగీరథికిఁ
బోయి యాతీరవనమున సంచరించుచుండఁగా విష్టరకుఁ డను
నొకబోయవాఁడు విల్లమ్ములఁబూని లేడిగుంపులవెనుకఁ బరుగె
త్తుకొని యమునివలె వచ్చుచుండుటఁగని దయార్ద్రహృదయుఁడై
"ఓయీ! నిషాదా! బాణము మేయకు మేయకుము. ఈలేడి
పిల్లలు నీ కేమియపకారము చేసినవి? పాపము వానిసి
జంపకు"మనెను. అంత నాతడు "అయ్యా వీనిని జంపుటకుఁ
గాని చంపకపోవుటకుఁ గాని నే నెవ్వఁడను? శిశువు
మట్టితో నెద్దుఁ జేసి వెంటనే చెడఁగొట్టునట్లు, ఇసుకతో
బొమ్మరి ల్లొనర్చి వెంటనే కూల్చునట్లు ఈశ్వరుఁడు సర్వసృష్టి
యొనర్చి లీలాత్ముఁడై చెఱచును. ఆత్మప్రణీతమై ప్రపంచము

వికృతిఁ బొందును. మన కహంభావ మనుచితము. ఇది యెఱింగినవివేకులు మనవలె నహంకరింప" రనెను. సంయమనుఁ డాశ్చర్యపడి "ఓయీ! నీ విట్లు పలుకుటకుఁ గారణ మే"మని యడిగెను. అంత నాతఁడు వీపున నున్న లోహపువలఁ దెచ్చి ముందరవైచి దానిలో అగ్ని నెలకొల్పు మనెను. సంయమనుఁ డది చేయలేకపోయెను. పిదప, బోయవాఁడు మంటలు పుట్టించి వాని నార్పి "మహాత్మా! అగ్నిహోత్రుఁడు మూలనాశనము నందిన బహుముఖశిఖలు మాయమగువిధమున, పరమాత్ముఁడు ప్రకృతిస్థితుఁడైన భూతములు క్షయించును. ఆతఁడు వికృతుఁడయిన మరల నవి పుట్టును. ఇదియే సకలప్రపంచస్థితి. శరీర గ్రహణధర్మమున నెవ్వని కేది విహితమో యాకర్మము చేసి పరమాత్మునికి సమర్పించెనేని వాఁడు ఫలము నందఁ" డని చెప్పెను. అప్పుడు తత్క్షణమే విష్టంకునితలపై దేవత లాతని తత్త్వజ్ఞతకు మెచ్చి పుష్పవర్షముఁ గురిపించిరి. పిదప దివ్య విమానములతో సింద్రాదు లాయద్వైతవివేకనిధానునిఁజూడ విచ్చేసిరి. అనంతరము పరమతత్త్వ మగువిష్ణు ననేకమూర్తిగా నెఱుఁగు మని చెప్పినట్లు అన్నివిమానములలోను బోయువాఁడు పెక్కురూపుల నధిష్ఠించెను. ఇది చూచి సంయమనుఁ డమితాశ్చర్యమంది నిజాశ్రమమున కేఁగెను.

కావున అట్లు సుజ్ఞానమంది స్వజాతీయకర్మతత్పరుఁడైన వాఁడు మోక్షమందును. అని బృహస్పతి బోధింప విని బృహస్పతివలన నద్వైతజ్ఞానాభ్యాసము చేసి బ్రహ్మానందులై రైభ్యవసువులు తమతమయిక్కల కేఁగిరి. పిదప, వసుమహారాజు

అఖిలవేదాంతవేద్య మహం భజామి
సంభవక్షయరహిత మహం భజామి
సాసిచక్రాబ్జశార్ఙ్గ మహం భజామి
కుంభసాగరశయన మహం భజామి.

నమామి మధుసూదనం నవపయోదనీలత్విషం
నమామి పరమేశ్వరం నఖరభిన్నరాత్రించరం
నమామి పురుషోత్తమం నలినగేహినీనాయకం
నమామి కరుణాస్పదం నగధురీణతా దక్షిణం
అను పుండరీకాక్షపారస్తవమున మోక్షమందెను.*

### రైభ్యనిగృహస్థాశ్రమము

ఇట్లు బ్రహ్మజ్ఞానియైన రైభ్యమహర్షి పితరులఋణముఁ దీర్చుటకై యొకయుత్తమకన్యను వివాహమాడి గృహస్థాశ్రమము నిర్వహింపఁజొచ్చెను. కాలక్రమమున మహాపతివ్రతయగునామెవలన రైభ్యమహర్షి యిరువురుపుత్రులను గాంచెను. వారి కాతఁడు 'అర్వావసువు' 'పరావసువు' అను పేళ్ళిడి పెంచి యుక్తవయస్సు రాఁగానే వారి కుపనయన మొనరించి తన కడనే యుంచుకొని వేదాధ్యయనసంపన్నుల నొనరించెను వారును దండ్రిమాట జవదాటక శీఘ్రమే తండ్రిదయవలనఁ గృతాధ్యయనులైరి. రైభ్యుఁడు పుత్త్రులిరువురతో వేదములు చదువునపుడు బ్రహ్మాదులు, బృహస్పతిప్రముఖులు వచ్చి వీరిని మెచ్చుకొని యాశీర్వదించి వెడలుచుండెడివారు. వీరికి సర్వవిద్వల్లోకపూజ్యతయును మిక్కిలి లభించెను. ఆహా !

* వరాహపురాణము.

ఉత్తముఁ డగుతండ్రి యడుగుజాడల నడిచి తమకీర్తిచంద్రికల నాతనికీర్తిచంద్రికల రెట్టింప నిగర్వచూడామణులై పితృపూజ చేయుపుత్త్రులఁ బడసినతండ్రియే తండ్రి కదా ! అట్టియదృష్టము రైభ్యమహర్షికిఁ గలిగెను.

## రైభ్య భరద్వాజ వృత్తాంతము

సమీపాశ్రమమున నున్న భరద్వాజమహర్షి రైభ్యమహర్షితో సఖ్యము నెఱపి, యనఘులైనయిరువురు నన్నదమ్ముల వలె మెలఁగుచు సుహృదులై, విశుద్ధతపోనిశ్చితమతులై యావనమున దివ్యదీక్షతోఁ దప మొనరించుచుండిరి. కాలక్రమమున విద్వత్పూజితులై వెలయుచున్న అర్వావసువు, పరావసువులను జూచి భరద్వాజపుత్త్రుఁ డగుయవక్రీతుఁడు మిక్కిలి యసూయ చెందెను. అసూయాపిశాచము సామాన్యమానవులనే కాక ఉత్తమఋషిపుత్త్రులనుసైత మావరించి ముప్పుతిప్పలఁబెట్టును గదా !

ఇట్లు యవక్రీతుఁ డసూయపడి రైభ్యపుత్త్రులకంటెఁ దా నెక్కువ విద్వాంసుఁ డ నని యనిపించుకొనఁదలఁచి తపోబలమున దానిని సాధింప నెంచి యగ్నిని వేల్చి మహాతపమునకుఁ గడంగెను.

కొంతకాలమున కాతని కింద్రుఁడు ప్రత్యక్షమై చదువకుండ సర్వవేదశాస్త్రములు తనకు రావలయు నన్నయాతని యుద్దేశ మెఱిఁగి "ఓయీ! గురుముఖమునఁగాక తపమునఁబడసినవిద్య యెట్టిసత్పురుషులకైనను మదమాత్సర్యములఁబుట్టించును కాననిదివిద్యోపార్జన కుపాయముకా"దని నిరసించిపోయెను. కాని

యవక్రీతుఁడుతపము మానఁడాయెను. కొంతకాలమునకు మరల దేవేంద్రుఁడు ముసలిబ్రాహ్మణరూపమున నాతనికడకు వచ్చి బక్కచిక్కినశరీరముతోఁ గుప్పెడిసుకఁ దీసికొని నదికి సేతువు గట్టవలె ననుచు నుండెను. ఆతనిం జూచి నవ్వి యవక్రీతుఁడు పరిహసించెను. ఇంద్రుఁడు నిజరూపముం జూపి నీతపము నిట్టిదే యనెను. ఏమన్నను యవక్రీతుఁడు మాత్రము పట్టు విడువక తప మొనరించుచుఁ దుదకు దేవేంద్రునివలన వరము వడసి యింటికిఁ బోయి తండ్రి కెల్ల వినిపించెను.

## వేదగీతలు

మహనీయ గుణగరిష్ఠుఁ డగుభరద్వాజుఁడు పుత్రునివిద్యాగర్వ మెఱిఁగి యతనికి మంచి బోధింపఁ దలఁచి "వత్సా! తొల్లి బాలధి యనుముని మహాతప మొనరించి దేవతలదయఁ బడసి చిరంజీవి యగుమేధావియను కొడుకును గాంచెను. ఆతఁ డాయుష్యగర్వమున మునుల నెవ్వరిని లక్ష్యపెట్టక ధనుషాక్షుఁ డను మహర్షిని జేరి గర్వోక్తు లాడెను. ఆమహనీయుఁడు తపఃప్రభావమున మేధావిని భస్మపటల మొనర్చెను. కావున గర్వమెవ్వరికిని బనికిరాదు, గర్వము విడిచినవాఁడే యుత్తముఁ" డని వేదగీతల యర్థమును బోధించెను. యవక్రీతుడు బుద్ధితెచ్చుకొంటి ననెను. భరద్వాజుఁడు సంతసించి యిఁక నీవు పరమశాంతు లైనరైభ్యపుత్త్రులయెడ నిర్మత్సరుఁడవై రైభ్యమహర్షిని నాకన్న నెక్కుడుగాఁ జూడవలెనని బోధించెను. అట్లే యనెను గాని యవక్రీతుఁడు మునిసభల గర్వియై యుండెను. ఒకప్పుడాతఁడు రైభ్యునియాశ్రమమున కేతెంచెను.

## రైభ్యుఁడు యవక్రీతుని జంపించుట

రైభ్యుని యాశ్రమవనము మనోహరములైన కీరమయూరకోకిల నినాదములతోడను, బహుపుష్పభరితములగు లతలతోడను, ఫలసహితములగు వృక్షములతోడను నుండెను. ఆ యారామమున యవక్రీతునకు రైభ్యునికోడలు, పరావసువు భార్య యగునొక చక్కనిచుక్క కానవచ్చెను. ఆతఁ డామెఁ జూచి మన్మథప్రేరితుఁడై సమీపించి తనవాంఛఁ దెలిపెను. ఆమె శాపభయమున నంగీకరించినట్లు నటించి యేదోనెపమునఁ దప్పించుకొనిపోయి మామయగు రైభ్యునితోఁ జెప్పెను.

అన్యాయా పిశాచగ్రస్తుఁడగు యవక్రీతుఁడు దన కేదో యపకృతిచేయుచునే యుండుననియుఁ దానూఱకున్న నాతఁడు నిరంతరము తనకు మనఃఖేదమొదవించుచునే యుండునని యెంచి రైభ్యుఁడు అగ్నినివేల్చి యొకజట యందు వేల్చి తనకోడలి కంటె సుందరి యైనయొక కాంతను, మఱియొకజట వేల్చి యొక క్రూరరాక్షసుని బుట్టింప వారు రైభ్యునికి నమస్కరించి తమ పని యేమని యడిగిరి. యవక్రీతుని వధించి రండని రైభ్యుఁ డనెను. వెంటనే యాతరుణి యవక్రీతుం జేరి యాతనిచేతిలోని కమండలువుఁ గైకొనెను. అపుడపవిత్రుఁడైన యవక్రీతుని రాక్షసుఁడు తాఁకెను. యవక్రీతుఁడు భయపడి పాఱి చెఱువులు, నదులు, చొచ్చిన నవి యెండిపోయెను. ఆతఁడు పాఱి వచ్చి తండ్రి యగ్నిహోత్రమున దాగెను. కాని వెంటనే రాక్షసుఁడాతనిం జంపివేసెను.

ఆ రాక్షసుఁడు, ఆ స్త్రీ మరల రైభ్యునికడకు వచ్చియుండ నాతఁ డామె నారాక్షసుని కిచ్చి యిరువురు యథేచ్ఛము పొండని పంపివేసెను.

### రైభ్య భరద్వాజుల మరణము, పునర్జీవనము

భరద్వాజుఁడు చచ్చిపడియున్న పుత్త్రుం జూచి విలపించి యాతనిగర్వమే యాతని నింత చేసెనని పలికి పుత్త్రునకు దహన సంస్కారాదుల నిర్వర్తించి పుత్త్రదుఃఖము భరింపలేక తానును దేహత్యాగము చేసికొనెను.

ఇట, రైభ్యునిపుత్త్రులగు అర్వావసు పరావసువులుం బృహద్ద్యుమ్నుఁ డనురాజుసత్త్రయాగమునం దండ్రియనుజ్ఞ చే ఋత్విజులై యుండిరి. ఒకరాత్రివేళ పరావసువు తనతండ్రి యింటికి వచ్చుచుఁ గన్నుఁ గన్నుఁగానని చీకటిలో నొక మృగము తనపైఁ బడిపాఱిపోఁగా నదియే యను తలంపున దండము విసర నది నిద్రించు తనతండ్రియగు రైభ్యునకే తగుల నాతఁడు వెంటనే మరణించెను.

పిదప అర్వావసువు తపోవ్రతదీక్షాదులకు ధర్మతత్పరతకు మెచ్చి అగ్నిని ముందుంచుకొని దేవతలు విచ్చేసి వలసినవరములు కోరుకొమ్మని యాతనిని వేఁడిరి.

అర్వావసు వానందించి రైభ్య భరద్వాజ యవక్రీతులుం తిరిగి బ్రతికివచ్చునట్లు యవక్రీతుని యసూయాగుణము మాయమగునట్లు వరము కోరెను. దేవత లాతని హృదయశుద్ధతకు మెచ్చి యట్లే యొనరించిరి.

అపుడు యవక్రీతుఁ డాదేవతలకు నమస్కరించి "దేవతలారా! నేను మహాతపస్సు చేసి యింద్రుని మెప్పించి సర్వవేద

శాస్త్రపారంగతుఁడనైతిని. అనేకవ్రతము లాచరించితిని. ఐనను నాశక్తి రైభ్యునిముందు తక్కువగుటయు నాతనివలన నేను మృతినందుటయు నెట్లుజరిగె" నని యడిగెను. అంత వారు "*ఓయీ! గురుశుశ్రూష యొనర్చి మహాక్లేశము లనుభవించి పొందినవిద్యలు వన్నె కెక్కును గాని వేఱువిధమున సంపాదించిన విద్యలు సత్ఫలము నీయవు. నీవు గురుముఖమునఁ గాక యన్య విధమున విద్య లార్జించితివి. రైభ్యుఁడు మహాభక్తుఁడై సంప్రదాయసిద్ధముగా గురుశుశ్రూషచేసి విద్యలు నేర్చెను. కావున నివిద్యలు వ్యక్తములయ్యెను. గురుశుశ్రూషాసంతోషకరుఁడైన రైభ్యుఁడు బ్రహ్మజ్ఞానసిద్ధిఁ గాంచి దివ్యశక్తిఁ బడసి మహానుభావుఁ డయ్యె" నని తెలిపి యదృశ్యులైరి. యవక్రీతుఁడు జ్ఞానము కలిగి రైభ్య భరద్వాజులకు మ్రొక్కి అర్వావసు పరావసువులఁ గౌఁగిటఁజేర్చి యేకోదరప్రేమ మలవఱచుకొని సుఖముండెను.

## రైభ్యుని తీర్థయాత్ర

తరువాత రైభ్యమహర్షి తీర్థయాత్రల నారంభించి అనంతశాయి నారాధించి, రంగధామునకు నమస్కరించి, కంచి వరదరాజును దర్శించి, వేంకటాద్రీశు సేవించి, అహోబలేంద్రునకు మ్రొక్కి, సింహాచలనాయకుని సేవించి, శ్రీకూర్మపతిని బొడగాంచి, పురుషోత్తముని బూజించి ఆయాస్థానములఁగల నదుల నోలనాడి భాగీరథిని సేవించి, ప్రయాగ కేఁగి, పిదప పితౄణమోచనకై గయ కేఁగెను. గయలో నాతఁడు ఫల్గునీనదిలో స్నానముచేసి గదాధరుని గొల్చి పితృపర్వతముఁజేరి కులగోత్ర

*భారతము వనపర్వము.

నామములఁ బేరెలుంగునఁజెప్పి పితరులఁబూజించి ఉపవాసమున నాదిన మటఁ గడపి సూర్యోదయమగుసరికి నిత్యనైమిత్తికములు తీర్చి పిండప్రదానముచేసి యొకయక్షయవటము క్రింద బ్రాహ్మణోత్తములకుఁ బితృదేవతల నుద్దేశించి యపరాహ్ణమునఁ బిండ ప్రదానము లొనరించి పిదప జిహ్వాలోల రామగయాదులందుఁ బైతృకక్రియలు నిర్వర్తించి కృతకృత్యుఁడై యట నొకచో నుండి ఘోరతప మొనరించుచుండెను.

అంతఁ గొంతకాలమున నొకదివ్యవిమానమునఁ బరమాణుసమాన దేహుఁ డగునొకదివ్యపురుషుఁడు ప్రత్యక్షమయ్యెను.

## రైభ్యసనత్కుమారసంవాదము

అతఁ డట్లు ప్రత్యక్షమై రైభ్యునితో
"బ్రహ్మవిజ్ఞానసూనసౌరభ్య! రైభ్య!
యిట్టి ఘోరతపోనిష్ఠ నేల యుంటి?"

వని యడిగి క్షణమాత్రలో సూక్ష్మాకృతి వీడి బ్రహ్మాండమైన రూపము ధరించి సప్తసముద్రమధ్యభూభాగము నిండెను; ఆకాశము నతిక్రమించెను. దశదిశలు వ్యాపించెను. అట్టియామహనీయుని కాశ్చర్యభయభక్తియుక్తుఁడై రైభ్యుఁడు మ్రొక్కి "మహాత్మా! నీసూక్ష్మాతిసూక్ష్మరూపము నింతటిమహారూపముఁ జూపిన నీవెవఁడవో తెల్పి కటాక్షింపు"మని కోరెను. ఆతఁడు "వత్సా! నేను జనలోకవాసిని రుద్రసితమ్ముఁడను. బ్రహ్మమానసపుత్రుఁడను. సనత్కుమారుఁడను. నీవు మిక్కిలి కృతార్థుఁడ వగుట నిన్నుఁ జూడఁ జనుదెంచితి" ననెను. అంత

రైభ్యుఁ డాతనికి సాష్టాంగనమస్కారము లొనరించి "మహాత్మా! నేను కృతార్థుఁడ నైతిని? జపతపములు చేసితినా? యజ్ఞయాగము లొనరించితినా? మీవలెఁ బరతత్త్వ మెఱిఁగితినా?" యని యడిగెను. సనత్కుమారుఁడు "నీవు గయాక్షేత్రమునఁ బిండప్రదానము లీయఁగంటివి. ఇంతకంటెఁ గృతార్థత యేది?" యని రైభ్యునకు గయామాహాత్మ్యముఁ దెల్పి మేలగు నని యాతని దీవించి యదృశ్యుఁ డయ్యెను.

## రైభ్యుఁడు మోక్షమందుట

పిదప రైభ్యుఁడు భక్తియుక్తుఁడై ఘోరపాపము లను మహారణ్యములకుఁ గార్చిచ్చును, తమోగుణ మను పిశాచతతికి పిడుగుతునుకయు, సంసారజరామరణము లనుదూదిపింజల కగ్నిహోత్రుఁడును భయరోగదుఃఖపక్షులకు సాళువమువంటివాఁడును తనపాదములు గొల్చువారికిఁ గల్పవృక్షమైనవాఁడు నగు గదాధరుని ఘోరదీక్షఁబూని సేవించెను. కొంతకాలమునకు విష్ణు వాతనికిఁ బ్రత్యక్షమై యభీష్టము వేఁడు మని పలికెను. రైభ్యుఁ డమితానందమున నాతనిపాదపద్మముల వ్రాలిపోయి, "దేవాదిదేవా! నన్నుఁ గటాక్షించి నాకు సనకాదులు వసించులోకముఁ బ్రసాదింపు"మని కోరెను. విష్ణు వట్లే యని యాతనిఁ గటాక్షించి యదృశ్యుఁ డయ్యెను. మఱుక్షణముననే రైభ్యమహర్షి శౌరివరమునఁ దత్త్వవిజ్ఞానఘంటాపథము వెంటఁ గైవల్యకోకిలోద్యాన మగుసనకాదులలోకమునకు దివ్యవిమానమున నేఁగి మోక్షసామ్రాజ్యమును జూఱగొనెను.

---

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

## రోమశ మహర్షి

### స్తుతి

సర్వతీర్థాభిగమనంబు సర్వతీర్థ
తత్త్వవిజ్ఞతఁ గన్నయుత్తమతనుండు
అమరపూజితుఁడైన మహాతపస్వి
యైన రోమశు దేవర్షి నభినుతింతు.

రోమశుఁ డనుముని బాల్యమునుండియు బ్రహ్మచర్యవ్రతముఁ బూని మహాతపస్సు చేసి ఆత్మజ్ఞానమును సంపాదించెను. ఆపిదప నాతఁడు భూభాగమునఁ గలసర్వతీర్థములను సేవించి యనంత మగుపుణ్యము నార్జించెను. రోమశుఁడు సంపాదించినపుణ్యవిశేషమువలన నాతఁడు సమస్తదేవతాపూజితుఁడై భూలోకమునఁ గొంతకాలము స్వర్లోకమునఁ గొంతకాలము నివసింపఁజొచ్చెను. సర్వలోకములందును స్వేచ్ఛగా సంచరించుశక్తి యీతఁడు సంపాదించెను. నాఁటినుండి యీతఁడు దేవర్షిగనే పరిగణింపఁబడుచు నింద్రాదులపూజ లందుచు ధర్మతత్పరుఁడు, అస్ఖలితబ్రహ్మచర్యుఁడు, అతిపవిత్రజీవనుఁడు, అజరామరుఁడు, అనంతశక్తిసంపన్నుఁడు, అమరహితుఁడునై యింద్రునికిఁ దలలో నాలుకవలెఁ బరమమిత్రుఁడై యుండెను.

## ఇంద్రుఁడు రోమశుని బ్రార్థించుట

ఒకనాఁడు లోకసంచారము చేసి రోమశమహాముని సుధర్మ యను పేరు గలయింద్రసభకు విచ్చేసెను. వచ్చుటతోడనే యాతఁడు ఇంద్రునిసింహాసనమున నాతనితోపాటు అర్జునుఁడు కూర్చుండియుండుటఁ జూచి మిక్కిలి యాశ్చర్యపడి నిలచియుండెను. అపు డింద్రుఁడు రోమశమహామునిని బూజించి యర్ఘ్యాసనమునఁ గూర్చుండ నియమించి "మునీంద్రా! ఈతఁడు పాండురాజుక్షేత్ర మగుకుంతియందు మదంశమున జనించిన పుత్రరత్నము. ఈతఁ డన్నయగు యుధిష్ఠిరునాజ్ఞఁ బాలించి యింద్రకీలపర్వతమున నన్నుఁ గాంచి నాయనుజ్ఞఁ గొని హిమశైలశిఖరముఁ జేరి యీశ్వరునిగుఱించి మహాతప మొనరించెను. తుద కీతఁ డాతనియనుగ్రహమున సర్వలోకసంహారసాధన మగు పాశుపతాస్త్రమును బడసెను. ఆపిదప లోకపాలురచే వారివారి దివ్యాస్త్రములను, నావలన ననంతమహిమాస్పదము లగునస్త్రములను బొందెను. చిత్రసేనుఁ డనుగంధర్వునివలన నృత్తగీతముల నేర్చెను." అని చెప్పి యర్జునునకు రోమశమహర్షిమహిమను వివరించి చెప్పెను. వెంటనే యర్జనుఁ డాసనము దిగి వచ్చి రోమశునకు సాష్టాంగనమస్కార మొనరించెను. రోమశుఁ డాతనిని గ్రుచ్చికౌఁగిలించుకొని లేవనెత్తి పాండవులధర్మతత్పరత, అర్జునునిశక్తిసంపదను శ్లాఘించెను. అనంతర మాతని యాదేశమున నర్జునుఁడు మరల నింద్రపీఠ మలంకరించెను.

పిదప నింద్రుఁడు రోమశునితో "మునివర్యా! ని న్నొకటి యర్థించెద. నీవు భూలోకమున కేఁగి ధర్మజాదులకు అర్జునునిక్షేమవార్తఁ దెలిపి యిదివఱకే శుద్ధుఁ డయి యున్నను.

ధర్మరాజు నింకను దీర్ఘయాత్రలు చేయించి పరమపరిశుద్ధు నొనరింప వలయును, శుద్ధసువర్ణమున కే కదా పుటములు పెట్టుటవలన నత్యధిక మగుకాంతి కలుగును? నీవు సర్వతీర్థములు చూచి తీర్థ తత్త్వమును గడదాఁక మథించి తీర్థనవనీతమును జుబ్బనచూఱ లుగా గడించినమహనీయుఁడవు. కావున, మా కీయుపకృతి నొనరింప నిన్నుఁ బ్రార్థించుచున్నా"నని పలికెను. రోమశుఁ డాపలుకు లాదరించి "ఇంద్రా! నీవింతవట్టు చెప్పవలయునా? నే నట్లే తప్పక చేసెదను. ధర్మమార్గమునఁ జరించుచు ధర్మ తత్పరు లైయున్న పాండవులకు హితము చేయుటకంటె మనకుఁ గావలసిన దేమున్నది? నామనస్సు కూడ నింకొకపరిఁ దీర్థయా త్రలుచేయ నువ్విళులూరుచున్నది."అని యర్జును నాశీర్వదించి యింద్రునివీడు కొని యాతఁడు భూలోకమునకు దిగి వచ్చు చుండెను.

## రోమశధర్మరాజసమాగమము

అంతకుఁ బూర్వమే ధర్మరాజాదులకు దర్శనమిచ్చిననారద మహాముని తీర్థపరమార్థమును బోధించి దేవర్షి యగురోమశ శుఁడు వచ్చు ననియు నాతనితో నెల్లతీర్థముల నోలలాడి తరిం పుమనియుఁ జెప్పిపోయెను. అందుచే ధౌమ్యాదులతో నున్న ధర్మరాజుఁడు రోమశమహామునిదర్శనము నెదురుచూచుచు నే యుండెను.

అంత రోమశమహర్షి రాఁగానే సర్వదేవతలు దేవేం ద్రునివలె ధర్మరాజుఁడు సపరివారముగా నామహర్షి కెదు రేగి యర్ఘ్యపాద్యాదుల నధికభక్తిని సేవించి కుశలమడిగి సుఖాసీనుఁ గావించెను. పిదప, రోమశుఁ డాతనితో నింద్రసభనుండి తాను

వచ్చుటయు, నర్జునునిపాశుపతప్రాప్తి, ఇంద్రునియర్ధాసనమున నాతఁడు క్షేమముగ నుండుట తెలిపి "యుధిష్ఠిరా! అర్జునుని క్షేమవార్త నీకుఁ దెలుపుటకును, తీర్థయాత్రోన్ముఖుఁడవైన నీచే సలక్షణముగా సర్వతీర్థసేవలఁ జేయించుటకును, నింద్రుని పంపున, నీతమ్ముని ప్రార్థనమున నే నిచటికి వచ్చియున్నాను. నే నిదివఱకె కెన్నిపర్యాయములో తీర్థముల సేవించితిని. తీర్థసేవాపరులకును శాంతాత్ములకును, తపస్వులకును దుష్కరమన్నది లేదు, నీవు తీర్థయాత్రవలన మహాపుణ్యము సంపాదింపఁగలవు. సుకృతులకే కాని తీర్థయాత్రపై బుద్ధిపుట్టదు. కాలమును వ్యర్థము చేయక త్వరలో యాత్రోన్ముఖుఁడవు క"మ్మని చెప్పెను. ధర్మజుఁడు మిక్కిలి సంతసించి రోమశునిపలుమాఱు స్తుతించెను.

## రోమశుఁడు ధర్మజునిచేఁ దీర్థయాత్రలు చేయించుట

పిదప, ధర్మరాజు క్షేత్రతీర్థదర్శనమునకు బయలుదేఱి, తనతో వచ్చెద మన్న కామ్యకవనవిప్రులను గూడఁ బెట్టుకొని రోమశునితో ధౌమ్యమునితో సోదరులతో, ద్రౌపదితో ముందునకుఁ బోయెను. అపుడు పర్వతనారదులు వ్యాసుఁడు వారికిఁ గానవై వారితీర్థయాత్ర నభినందించి రోమశమహర్షి కతమున నది సఫలీకృత మగు నని చెప్పి వెడలిపోయిరి.

ధర్మరాజు రోమశునితో "మహాత్మా! అధార్మికులైనవారికి, దుర్మార్గులకు లోకమునఁ బెంపు గలుగుచున్నది. మఱియు దేవా! అచేతనములైనజాలుఅప్పులు, నదీసరములు పుణ్యతీర్థములై జగత్పావనములై జనులకుఁ బాపపరిహారము

చేయ సమర్థములై యున్నవి. ఈచిత్రగతికిఁ గారణము దయ
తోఁ జెప్పు" మనెను.

రోమశుఁ డిట్లనెను. "ధర్మనందనా ! అధర్మవర్తులయు, దుర్మార్గులయుఁ బెంపు క్షణభంగురము. అది యల్పకాలముననే వినాశము నందును. అధర్మవర్తు లగురాక్షసులు స్వర్గాదు లాక్రమించుట, త్వరలో వారు నాశమై ధర్మవర్తు లగుదేవతలు వృద్ధినందుట మన మెన్నిపర్యాయములు చూచియుండలేదు ? అధర్మవర్తులకుఁ గామక్రోధలోభమోహమదమాత్సర్యము లావహించి త్వరలోనే వారిని జెఱచును. మీరు దేవతలవలె ధర్మనిత్యులు. కౌరవులు రాక్షసులవలె నధర్మవర్తులు. అందుచే మీకు విజయము వారికిఁ బరాజయము కలిగితీరును.

ఓధర్మజా ! ధర్మవర్తు లగుఋషులు, దేవతలు నాశ్రయించినకారణమునఁ దీర్థములు పవిత్రము లైనవి. తీర్థసేవవలనఁ గ్రతువులవలన, దానధర్మములవలన, బ్రాహ్మణాశీర్వచనములవలన జనులు సర్వదుఃఖవిముక్తు లయి శుభము లందుదురు."

ఇట్లనేకధర్మములు చెప్పుచు రోమశుఁడు పాండవులను నైమిశము, అశ్వతీర్థము, గంగాఘోషము, కన్యాతీర్థము, గోమతి, బాహుద, మహానదులను, ప్రయాగ, గంగాయమునాసంగమము మున్నగుతీర్థముల నోలలాడించి యందు బ్రాహ్మణులకు గోహిరణ్యాదానములు చేయించెను. అనంతరము రోమశుఁ డాయాతీర్థములప్రభావముల వివరించుచు ముందునకుఁ దీసికొనిపోయెను.

అగస్త్యాశ్రమమున రోమశునివలన ధర్మజాదులు అగస్త్యచరిత్రము, వాతాపీల్వలమర్దనము, వింధ్యగర్వాపహరణము, అగస్త్యుఁడు సముద్రోదకముల నాపోశించుట, సగరసుతులు కపిలకోపాగ్నిచే భస్మమగుట, ఋశ్యశృంగుచరిత్రము, మాంధాతృచరిత్రము, సుకన్యోపాఖ్యానము, సోమకుండను రాజర్షిచరిత్రము, శిబిచరిత్రము, అష్టావక్రచరిత్రము, యవక్రీతచరిత్రము, మున్నగున వెన్నియో తేటతెల్లముగాఁ దెలిసికొనిరి.

పిదప, గంధమాదనప్రాంతమున భీమునికోరికపై ఘటోత్కచుఁడు చనుదెంచి ధౌమ్యపాండవ ద్రౌపదులను దా నెత్తుకొని మిగిలినవిప్రుల నెత్తుకొనివచ్చుటకుఁ దనరాక్షసబలముల నియమించి వారికి బహుబాధాకరమైన యామార్గమున నడువవలసినశ్రమఁ దప్పించెను. అపుడు రోమశమహర్షి సిద్ధగతిని బయనించెను. ఇట్లు వీరందఱు ఆకాశమార్గమునఁ జని గంగాతీరమునఁ గల నరనారాయణాశ్రమమున దిగిరి. అచట, తియ్యని మనోహరమైన ఫలములతోడను, చక్కనియాకులతోఁ బూవులతో నొప్పు బదరీవృక్షములక్రింద సేదదీర్చుకొని గంగానదిలో స్నానపానాదికృత్యములఁ దీర్చుకొని నియమవ్రతులై మైనాకశైలము, హిరణ్యశిఖరము, బిందుసరస్సు మున్నగునవి చూచియం దాఱుదినములు వారు నివసించిరి.

అనంతరము వా రనేకదివ్యస్థలములు గాంచి ఆర్ష్టిషేణుఁడను ఋషియాశ్రమమునఁ గొంతకాలము వసించిరి. ఆతరువాత నింద్రుఁ డర్జునుని దీసికొనివచ్చి ధర్మజాదుల కొప్పగించి వెడలిపోయెను. అర్జునుఁడు వారెల్లరకు ధర్మరాజాదులను విడిచి యాతఁ

డేగినది మొదలు తిరిగి యటఁ జేరువఱకు జరిగిన యావద్వృత్తాంతము ప్రాసగుచ్చినట్లు చెప్పెను.

పాండవులు రోమశునితో గంధమాదనపర్వతమున నాలుగేండ్లు గడపిరి. అంతకుఁ బూర్వము వారరణ్యముల నాఱేండ్లు గడపిరి. అపుడు రోమశ మహర్షి పాండవేయుల కనేకధర్మరహస్యములు బోధించి వారిని వీడుకొని స్వర్గలోకమునకుఁ బోయెను.*

## రోమశుఁడు వేదనిధిం గాపాడుట.

తొల్లి వేదనిధి యనునొక యుత్తమవిప్రుని కుమారుని గంధర్వకన్యలు వలచిరి. కాని, యాతఁడు నిశ్చలబ్రహ్మచర్యవ్రతమున వారి కొడంబడకుండెను. ఆకన్యలు నవయువతులు, అధికసౌందర్యశోభితలు, మనోహర విలాసవతులు నైనను, ఆ విప్రకుమారుఁడు వారిని జేకొనఁడయ్యెను. సామదాన భేదోపాయములు వ్యర్థములు కాఁగా నాగంధర్వ కన్యారత్నములు ఆనవమోహానునిపై మక్కువ విడువఁజాలక బలవంతముగ నాతనిపైఁబడి యాతనికి మరులుగొలుప యత్నించిరి. అంత నాతఁడు వారిని వెంటనే పిశాచస్త్రీలు కండని శపించెను. వారును దమ కోరిక నమ్మగుటకు, శాపప్రాప్తికి, వగచి యాతఁడును బిశాచపురుషుఁడగుఁ గాకని తిరిగి శపించిరి.

ఇట్లు వారన్యోన్యశాపగ్రస్తులై పిశాచరూపములఁ జరించుచుండిరి. తనకుమారుని వెదకుకొనుచు వేదనిధి, తమ కన్యల వెదకికొనుచు గంధర్వదంపతులు వచ్చి యొకరి నొకరు

* భారతము. వనపర్వము.

తెలిసికొని యాక్రందించుచుండిరి. ఇంతలో నచటికి రోమశ మహర్షి తీర్థయాత్రాకారణమున విచ్చేయఁగా నాపిశాచము లేతనిని మ్రింగివేయ విచ్చేసి రోమశమహర్షి బ్రహ్మతేజోమహాత్మ్యమున దందహ్యమానశరీరులై దూరమునకుఁ బాఱిపోయిరి. అపుడు వేదనిధి యామహర్షిని జేరఁ జని పాదపద్మములపైఁ బడి తనకుమారునియు గంధర్వకన్యలయు వృత్తాంతము నాతని కెఱింగించి రక్షింపు మని ప్రార్థించెను.

రోమశమహర్షి వేదనిధిం గని కరుణించి, "విప్రా! విచారింపకుము. వీరికి పిశాచరూపములు పోవునుపాయము నేను చెప్పెదను. నాతో వచ్చి మీ రందఱును మాఘస్నానము చేయుఁడు. మాఘమాసమునఁ దీర్థస్నానము చేయఁగలిగిన వారికి సప్తజన్మములనుండి వచ్చుచున్న మహాపాపము లైనను క్షణమాత్రములో నశించిపోవును. హిమశైలోపరిభాగతీర్థము, బదరీవనతీర్థము సమస్తపాపములఁ బాపును. నర్మద, యమున, సరస్వతి, వీనిజలముల స్నాన మొనరించిన స్వర్గ మొసంగును. భాగీరథి, విష్ణులోకము, గౌతమి, కృష్ణవేణి మున్నగునదులు స్వర్గమును, నైమిశము విష్ణుసారూప్యమును,పుష్కరము బ్రహ్మసారూప్యము, కలిగించును. కురుక్షేత్రము దేవలోకమును, దేవహ్రదము దేవత్వమును, ప్రభాస రుద్రగణత్వము, హేమకూటము, మహాకాలము, ఆహాతామరము, నీలకంఠము, అర్బుదము మున్నగుతీర్థములు రుద్రలోకమును,కలుగఁజేయును. ప్రయాగ యింకను ఫలప్రదము." అని చెప్పి ప్రయాగమహాత్మ్యమును దెలుపువీరసేన భద్రకుల చరిత్రము నాతనికి వినిపించెను.

## దేవద్యుతి కథ

పిదప రోమశమహాముని వేదనిధికి దేవద్యుతి కథ యిట్లు చెప్పెను. "తొల్లి సరస్వతీనదీతీరమున 'యక్షప్రస్రవణ' మను పర్వత ముండెను. ఆప్రాంతవనమున నిరుపద్రవమైనపుణ్యాశ్ర మములు కలవు. అందు సుమిత్రుఁ డనుమునిపుత్త్రుఁ డగు దేవద్యుతి తపస్సు చేయుచుండెను. అతఁడు మండువేసవిని బంచాగ్నిమధ్యమున నిలిచి, శీతవాతదారుణసమయమున మొల బంటి నీట నిలిచి, గాలి, నీరు, కందమూలములు తిని కాల క్షేపము చేయుచు మహానిష్ఠాగరిష్ఠుఁడై తపము చేసెను. ఆ ఘోరదీక్షలో నాతని కస్థిచయము తక్క నొండు మిగుల దయ్యెను

తపఃప్రభావమునఁ గలిగినయాతనితేజము త్రిలోకము లకు వ్యాపించెను. ఆమహాత్ముని జూచి దేవమునిసంఘములు తల్లడిల్లెను. అధికశాంతియుతుఁడై తప మొనరించునామహా నీయుఁడు నిత్యము నుత్తమపుష్పములచే నారాయణుఁ బూజిం చుచుఁ బురుషసూక్తమునఁ గలరీతిని షోడశోపచారము లర్పిం చుచు నుండ వైశాఖశుద్ధయేకాదశినాఁడు శంఖచక్రగదాపాణి యై యాతనికి విష్ణుమూర్తి ప్రత్యక్ష మయ్యెను. వెంటనే దేవద్యుతి సమ్మదాశ్రుకణకలితలోచనుఁడు, పులకితశరీరుఁడునై సాష్టాంగప్రణామము లాచరించి లేచి నిలిచి నిటలతట ఘటి తాంజలియై యానందరస ప్రవాహమునఁ దేలియాడుచు నిట్లని స్తుతించెను."వాసుదేవా! మురాంతకా! వనజనాభా! భక్త వత్సలా! కృష్ణా! కృపాసముద్రా! శ్రీహరీ! జగన్మయా! కేశవా! పరమపురుషా! నన్ను దయచూడుము. స్తుతి, స్తోత్ర, సంస్తు

త్యుఁడు సర్వము నీవే. వేదములు నీనిశ్వాసములు. బ్రహ్మ యనుపేర జగముల సృజించు శుద్ధసద్బ్రహ్మ నివాసభూతమగు బ్రహ్మపదార్థము నీవే. పరమతత్త్వవిదులు నిన్నుఁ బరతత్త్వమని కీర్తింతురు. హరిహరబ్రహ్మలన్న నీవే. నీవు నిర్గుణుఁడవు. నీవు శుద్ధబుద్ధాత్ముఁడవు. చిన్మయుఁడవు. దేవాదిదేవా! భూతయోగజమైన చైతన్యమని నిన్నుఁ జార్వాకులు నుతింతురు. ఆనందసత్త్వవిధాద్వైతుఁడని నిన్నద్వైతులు శ్లాఘింతురు. సేవ్య సేవకభావవర్తనమున నిన్ను వేదవాది వర్ణించుచుండును. అహింస పరమధర్మమను జైనుఁడు నిన్నహింసారూపునిగా స్తుతించును. మహాదేవా! నీవు నన్నెప్పుడును గాపాడుచుండుము."

ఇట్లు యోగసార మనుపేరుగలస్తుతి యొనర్చిన విప్రుని గరుణించి హరి యదృశ్యుఁడయ్యెను. అట్లు హరికృపఁగన్న దేవద్యుతి పిశాచరూపమున దుఃఖించు చిత్రసేనుఁడను వానిని గరుణించి ప్రయాగస్నానముఁ జేయించి యాతనిపిశాచజన్మ ముడిఁగించెను.

కావున, ఈకన్నియలు నీకొడుకు నీవు నేను బ్రయాగ స్నానము చేయుదము. దానితో వీరిశాపము లన్నియు వీడిపోవును." అనిచెప్పెను. వెంటనే వేదనిధి పేరెలుంగున పుత్రుని తోడను గంధర్వకన్నియలతోడను ఈసంగతి చెప్పి రోమశుని కడకుఁ దీసికొనివచ్చెను. అప్పుడు రోమశమహర్షి నిజశక్తికతమున వారి నెల్లరిని గగనమార్గమునఁ బ్రయాగకుఁ దీసికొని వచ్చెను. అచట వారి కాయాపుణ్యస్థలములు చూపుచు రోమశుఁడిట్లనెను. "ఈప్రయాగతీరవేదిపై మున్ను బ్రహ్మ యజ్ఞము చేసెను. ఇది అసితతోయవేణి. ఇందలిజలములు గ్రోలినవారికి

స్వర్గము లభించును. ఇది పరమపవిత్రము. విష్ణు విందుఁ గ్రుంకి లక్ష్మిని బొందెను. ఊర్వశి యిందు స్నానమాడి శాపవిమోచనమంది స్వర్గమున కేఁగెను. ఇంద్రపదవి నధిష్ఠించిన నహుషుఁ డిందు స్నానముచేసి సుపుత్రుని గాంచెను. తొల్లి నరనారాయణు లిందుఁ గ్రుంకి యాఁకలిదప్పులు పోఁగొట్టుకొనిరి. కశ్యపుఁడు శంకరునిగూర్చి యిచటనే తపముచేసెను. భరద్వాజుఁడు నిటనే కొంతకాలము తపమొనరించెను. సనకాదులు యోగసిద్ధులు పడయుట కీతీర్థస్నానమే కారణము. ఇందు మోక్షార్థులకు మోక్షము, కామ్యశీలురకుఁ గామితార్థములు, సాధకులకు సిద్ధి లభించును." అని చెప్పెను.

రోమశమహర్షిమాట లాలించి వేదనిధి, పిశాచరూపముల నున్నయాతనిపుత్త్రుఁడు గంధర్వకన్యలు నందు స్నానము చేసి లేచినతోడనే పరమాశ్చర్యభరితముగా వారు దివ్యసుందర యౌవనవిరాజిత దేహములను ధరించిరి.

## గంధర్వకన్యకల వివాహము

అపుడు వేదనిధి పుత్త్రుని బ్రియమారఁ గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణ మొనరించి యాతనిచేతను, గంధర్వకన్యలచేతను రోమశమహర్షికి భక్తిశ్రద్ధలతో మ్రొక్కించెను. గంధర్వ దంపతులును దమకన్నియలకు శాపాంతమైన దని విని వచ్చి పుత్త్రికలఁ గౌఁగిలించుకొని రోమశమహర్షిని స్తుతించి యాతనికి మ్రొక్కించిరి.

అపుడు రోమశమహర్షి వారి నాశీర్వదించి వేదనిధి పుత్త్రుఁ డాకన్నియలఁ బాణిగ్రహణముచేసికొనవలె నని యాదేశించెను. గంధర్వకన్య లామాటలు విని బ్రహ్మానంద మంది

యిప్పటికైనఁ దమవాంఛ ఫలించినందులకు ఆఋషివర్యుని స్తుతించిరి. వేదనిధిపుత్త్రుఁడును దంపత్యూజ్ఞ రోమశుని యను శాసనము తలధరించి యాకన్నెలఁ బెండ్లాడుట కంగీకరించెను.

పిదప, విధ్యుక్తప్రకారమున దివ్యవైభవోపేతముగా గంధర్వకన్యావిప్రకుమారవివాహములు జరిపించి రోమశమహర్షి వారి నాశీర్వదించి వా రెల్లరుఁ దనపాదము లంటి కన్నులకద్దుకొని మ్రొక్కఁగా సంతసించి, మేరుపర్వతప్రాంతమునకు వెడలిపోయెను.

వేదనిధియు గంధర్వదంపతులును వియ్యపు నెయ్యముల నానందాంబుధి నోలలాడిరి. వేదనిధి కొడుకును గోడండ్రను దీసికొని యలకాపురమున కేఁగెను. గంధర్వదంపతులు తమ నివాసముల కేఁగి సుఖముండిరి. (పద్మపురాణము)

ఇట్లు రోమశమహర్షి తీర్థతత్త్వజ్ఞుఁడు, తీర్థయాత్రాపరు లకుఁ గల్పభూజము, తీర్థమహత్త్వమును దీర్థపరమార్థమును లోకవ్యాప్త మొనరించినదివ్యర్షిగా మనకుఁ గనుపట్టుచున్నాఁ డు. ఈతని బాల్యజీవితాదికము, తలిదండ్రులవృత్తాంతము, వివాహసంతానాదికవిషయము లేవియుఁ దెలియరావయ్యెను. అస్ఖలితబ్రహ్మచర్యుఁడై, బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై, సర్వసిద్ధిసం యుతుఁడై సర్వలోకసంచారి, సర్వదేవపూజితుఁడుగా నీతఁడు కానవచ్చుచున్నాఁడు. ఈతనిశిష్యులై కాని యీతనిమార్గ మవ లంబించి కాని తీర్థజ్ఞులై తీర్థసేవాపరులై తీర్థపరమార్థమును బోధించుమహనీయులకు నాఁటినుండి రోమశు లను పేరు వచ్చి యుండవచ్చును. బకదాల్భ్యమహర్షి యనేకరోమశులను జూ చితి ననుట యిందులకు నిదర్శనము.

# అనుబంధము

## i

# దేవల మహర్షి

## దేవల నారద సంవాదము

పూర్వ మొకప్పుడు నారదమహర్షి దేవలమహర్షి యాశ్రమమునకు విచ్చేసి "ఋషీంద్రా! స్థావరజంగమాత్మకమైనయీప్రపంచము దేనినుండి పుట్టినది? ప్రళయకాలమున నెందు లయించుచున్నది? నా కిది చెప్పు" మని కోరెను. దేవలుఁ డిట్లు సమాధానము చెప్పెను. "నారదా! బ్రహ్మకు సృజించుకోరిక కలిగినపుడు పంచమహాభూతములనుండి ప్రాణులను సృష్టించును. బుద్ధిప్రేరితమైనకాలము పంచభూతములనుండి సర్వభూతములను గలిగించుచున్నది. పంచభూతములు, బుద్ధి, కాలము ఇవియే ప్రపంచసృష్టికి హేతుభూతములు. ఈ పంచభూతములు శాశ్వతములు, అచలములు, ధ్రువములు. కాలముతోఁ గూడి యివి మిక్కిలి తేజస్వంతము లగును. పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, కాలము, పూర్వకర్మవాసనలు,అజ్ఞానము అనునీయెనిమిది శాశ్వతములు. సకలభూతసృష్టి వినాశములకుఁ గారణములు. దేహము పృథివినుండి చెవులు ఆకాశమునుండి, కన్ను తేజమునుండి,ప్రాణము వాయువునుండి, రక్తము జలమునుండి కలుగును. రెండు కన్నులు, ముక్కు, రెండుచెవులు, తోలు, నాలుక, యివి

పంచేంద్రియములు. వీనికి విషయము లైదు: కనుట, వాసన చూచుట, వినుట, తాఁకుట, రుచి చూచుట. ఇంద్రియముల కీవిషయములు తెలియవు. జీవుఁడే ఈయింద్రియములవలన ఈవిషయములు తెలిసికొనుచున్నాఁడు. చిత్తము, మనస్సు, బుద్ధి, జీవుఁడు ఇవి ఒకదానికంటె నొకఁ డెక్కువ. ఇంద్రియము లైదు, చిత్తము, మనస్సు, బుద్ధి ఈయెనిమిది జ్ఞానేంద్రియములు. పాణి,పాదము, పాయువు, మేహనము,ముఖము ఈయైదును కర్మేంద్రియములు. ఆహారాదులు కైకొనుట, నడచుట పురీషవీర్యాదులు విడచుట, మాటాడుట అన్నవి వీనిపనులు. ఇంద్రియములు తమవ్యాపారములను విరమించినపుడు నిద్రియనునవస్థ. ఇంద్రియములు విరామమంది మనస్సు పనిచేయునపుడు స్వప్నావస్థ. ఇందుసాత్త్విక,రాజసిక, తామసికము లగు వాసనారూపకము లగుసూక్ష్మవిషయములు పుణ్యాపాపములఁ గూడుకొని యుండును. వీనిలో సాత్త్వికములే శ్లాఘాపాత్రములు. ఆనందము, కర్మసిద్ధి, జ్ఞానము,నిస్సంగత్వము మున్నగునవి సాత్త్వికములు. ఆయామానవులకర్మముల ననుసరించి జాగ్రదవస్థలోఁ గలిగినత్రిగుణావస్థలు స్వప్నమున స్మృతికివచ్చుచుండును. జాగ్రత్స్వప్నవిషయములు, సుషుప్తియందుఁ బ్రత్యక్షముగాఁ దెలియుచున్నవి. జ్ఞానేంద్రియము లైదు, కర్మేంద్రియము లైదు. ప్రాణశక్తి, మనస్సు, బుద్ధి, చిత్తము, తమస్సు, రజస్సు, సత్త్వము కలిసి పదునేడు. దేహి పదునెనిమిదవవాఁడు. దేహి నిత్యుఁడు. దేహ మనిత్యము. దేహి దేహమునుండి తొలఁగినపుడు పైపదునేడు, అవిద్యకూడ నందు వసింపవు. అవిద్యాను లగుపదునెనిమిది, దేహి, జఠరాగ్ని- ఈయిరువది పాంచభౌతిక

సంఘాత మగును. మహత్తు అనునది ప్రాణములతోఁ గూడి యీసంఘాతమును నిర్వహించుచున్నది. దేహనాశనమునకు ప్రాణవాయువు మహత్తునాజ్ఞనే తలధరించును. పుట్టినప్రాణి పుణ్యాపాపములు క్షీణించినపిదప మరలఁ బంచభూతములుగా విభక్తమగును. పిదప, ఈజన్మమునఁ జేసినపుణ్యాపాపముల ప్రేరేపణచే వానివలన సిద్ధించిన మఱియొక దేహమును జొచ్చుచున్నది. అవిద్యాకామకర్మలచే సిద్ధించు దేహస్థితులవలన ప్రాణి కాల ప్రేరణమున నొక దేహమునుండి మఱియొక దేహమును జేరుచుండును. జీవికిఁ గలుగు ఈ దేహాంతరప్రాప్తులఁ గన్నజ్ఞానులు నిర్వికారులై దుఃఖము నందరు. పామరు లన్ననో మిక్కిలి పరితపించుచుందురు. జీవుఁ డెవ్వనివాఁడు గాఁడు. ఎవ్వఁడు వీనివాఁడు కాఁడు. వీఁ డొక్కఁడే. తానే తనదేహమును సుఖదుఃఖములను సృజించుకొనుచు పుట్టుక కాని. మరణము కాని లేక, తుదకు దేహబంధమును వీడి పరమగతి నొందును. పుణ్యాపాపకర్మములమూలమునఁ గలిగిన ఆయా దేహములందుఁ గావించిన కర్మములు క్షీణించినంత, జీవి దేహమును వీడి బ్రహ్మమయ మగుచున్నది. పుణ్యాపాపకర్మవినాశనమునకు జ్ఞానమే కారణము; మార్గము. ఇదియే సాంఖ్యమతము. పుణ్యాపాపములు క్షీణించి జీవుఁడు బ్రహ్మభావము నందుటే పరమగతిఁ జేరుట యని విద్వాంసులు దీనిఁగనఁ జాలుదురు."

ఈవాక్యములు విని సంతసించి నారదుఁడు దేవలుని వీడుకొని యథేచ్ఛముగాఁ బోయెను *

---

*భారతము శాంతిపర్వము.

## దేవలుని వివాహవృత్తాంతము

దేవలుఁడు వేదవిద్యాశాస్త్రవిశ్రుతుఁడు, నిత్యవైదికకర్మక్రియానియతుఁడు, హరిపాదభక్తుఁడు, పరమతపోధ్యాన పారగుఁడునైయుండి బ్రహ్మచర్యము తీర్థయాత్ర నడపుచుండెను. ఆతఁడు వయఃపరిపూర్ణుఁడయ్యుఁ గామక్రోధమదలోభమోహములఁ దగులువడక అసిధారావ్రతమున భిక్షాశనము నడపుచు భాగీరథీతీరమున వసించుచుండెను. ఒకనాఁడాతఁడు గంగాస్నానమొనరించి నిత్యకృత్యములుతీర్చి విష్ణుస్మరణపూర్వక మగుజపమున నుండఁగా నటఁగల యొకసాలవృక్షము కొమ్మను వ్రేలాడుచు శవాకారములఁదాల్చి యేడ్చు నరనారీజనములఁ గాంచి దయాళుఁడై దగ్గఱకేఁగి మీరెవ్వరని వారి నడిగెను. వారిట్లు సమాధానము చెప్పిరి. "ఓయీ! మేము దేవలుఁడను నొకమహాతపస్వుని పితృదేవతలము. ఆతఁడు సద్గుణసంపన్నుఁడే కాని వివాహమాడనొల్లక-యస్ఖలితబ్రహ్మచర్యముననున్నాఁడు. ఆతఁడు వివాహ మాడి మాఋణముఁదీర్చినఁ గాని మాకు ముక్తిలేదు. ఏలన, నరుఁడు ఋణత్రయమున సంభవించును. బ్రహ్మచర్యవ్రతమున మునిఋణమును, అగ్నిహోత్ర క్రియాకలాపమున దేవఋణమును, పరమసాధ్వియగు కులపత్నియందు సంతానముగాంచి పితౄణమును మానవుఁడు తీర్పవలయును. అనంతరము తురీయాశ్రమమును గని ముక్తినంద వలయును. ఋణత్రయ విముక్తునికే కాని యన్యునకు జ్ఞానము పునరావృత్తిరహితలోకనివాస సౌఖ్య మొసంగదు. అది యెట్లన, వృక్షమున్నదన్న నది క్రమక్రమముగాఁ జిగిర్చి, మొగ్గ దొడిగి, పుష్పించి ఫలించునే కాని యెంతదోహదక్రియ యొనరించినను

పోలుతనే ఫలింపదుగదా ! వర్ణాశ్రమసమేతు లగువారు కర్మ కాండ ప్రతిపాదించిన పదునాలుగు సంస్కారముల సాధనము చేయవలయును. అది శరీరజననకారణ మగును. అట్లు కలిగి శరీరి కర్మములవలన సంస్కృతుఁడై విప్రుఁ డనఁబరగు. అతఁడు ఋణత్రయములఁ దీర్చి మోక్షమందును." అని చెప్పిరి.

అంత దేవలుఁడు నిజనామగోత్రములు తెలిపి "ఓపితృ దేవతలారా ! కలుషాయత్త మగుసంసారమును దపోవైఫల్య బీజముగా బ్రహ్మ సృజించెను. స్త్రీ లన్న మాయామృగరూప ములు. కాయని బీఱెండలు. ఆత్మఘాతుకలు. ఏయని నిశితాస్త్ర ములు. పాయనికర్మవాగురలు. అందుచేఁ గర్మయోగమునుబట్టి సంసారజలధి దాఁట నెవ్వరితరము ? కాంతమూలమునఁ గామ క్రోధ లోభ మోహముల కాకరమై నరుఁడు నశించును. ఇఁకఁ బుత్రులందమా వారు నిత్యదుఃఖప్రదులు. అందుచే సమ్యక్ జ్ఞానసమేతుఁ డగునరునకు బ్రహ్మచర్యమే కైవల్యప్రాప్తికారణ" మని పలికెను. అంత, వారు "ఓయీ ! నీవన్నది నిజమే కాని మాకోరికఁ దీర్చి మా కుత్తమగతులు కలిగించుటకైనను మా మాట పాటించి పరిణయమాడి ధర్మమార్గమున గృహస్థాశ్ర మము నడపి ఋణత్రయము నీఁగి యూపై నీయిచ్చవచ్చినట్లు చేయు" మని కోరిరి. ఆతఁడు "ఆర్యులారా ! నేను పెరిగి పెద్ద వాఁడనైతిని. వార్ధక్యము పొడచూపినది. ఇపుడు నాకుఁ బిల్ల నిచ్చువా రెవరు ? ఇచ్చిన, నన్నుఁ గట్టుకొన్న యామెకుఁగాని నాకుఁగాని యేమిసుఖము కలుగును ? నా కీబలవంతపు బ్రాహ్మ ణార్థమేల ! నాతపస్సు ధారపోసి మీకుత్తమగతులు కల్పించెద" నని చెప్పెను. వారు "వత్సా ! కౌండిన్యుఁ డనునొక మహా

మునికడ నొకకన్య గలదు. ఆమె నీకు భార్యగా విధి యామె నొసట వ్రాసియున్నాఁడు. నీవును విధిని దప్పింపఁ దలఁపవు గదా! కావున, మఱుమాటాడక మాపం పొనర్పు" మని ప్రార్థించిరి.

అనంతరము దేవలుఁ డిఁక వారిమాట కాదనఁజాలక దివ్యదృష్టిని జూచి కౌండిన్యసుత తనభార్యగా జనించుట నిక్కముగా నెఱిఁగి యామె పతివ్రతయై సత్సంతతి నొసఁగు నని తెలిసికొని, వారియాజ్ఞఁ దలఁదాల్తు నని విన్నవించెను. పితృదేవతలు నాతని నాశీర్వదించి యానందపరవశులై యదృశ్యులైరి.

దేవలుఁడు బయలుదేఱి వెళ్లి కౌండిన్యుని యింటి కేఁగి యాతని మన్ననలఁ గాంచెను. దేవలుని జూడఁగనే యాతఁడును దివ్యదృష్టిని దనపుత్రిని వివాహమాడ విచ్చేసినాఁ డని తెలిసికొని వివాహమేర్పాటు చేసెను. దేవలుఁడు నిజతపశ్శక్తి వలనఁ గామరూపము ధరించి దివ్యసుందరుఁడుగాఁ దేజరిల్లెను. అనంతరము వేదోక్తముగాఁ గౌండిన్యుఁడు తనబిడ్డ నిచ్చి దేవలునికి మహావైభవముగాఁ బెండ్లిచేసెను.

అత్తమామల యనుజ్ఞఁ గైకొని దేవలుఁడు దివ్యసుందరి యగుకన్య నట్లు పరిణయమై యామెఁదీసికొని నిజాశ్రమము నకుఁ బోయి గృహస్థాశ్రమమును నిర్వహించుచుండెను.

ఆపుణ్యదంపతు లట్లు పవిత్రజీవితమును దిగ్లోక వినుతముగాఁ గడపుచు నతిథ్యభ్యాగతసేవ, వైదికకర్మ పాలనము నడపి కాలక్రమమున సువర్చలయను పుత్రికారత్నమును, కొందఱు పుత్రులనుబడసి ఋణత్రయమునుండి విముక్తిఁగాంచిరి.*

* మత్స్యపురాణము.

## దేవలుని కూఁతురు సువర్చలకథ.

బ్రహ్మర్షి, సదాచారసంపన్నుఁడు, ధార్మికశ్రేష్ఠుఁడు, విప్రపూజితుఁడు నగు దేవలమహర్షి చక్కనికూఁతు రగుసువర్చల తండ్రికడ సర్వధర్మములు, సకలవిద్యలుం నేర్చి గొప్పవిదుషీమణియయ్యెను. శుభలక్షణ సంపన్నయు, సుందరాంగియు నగు నామెకు యుక్తకాలము రాఁగానే తండ్రి వివాహప్రయత్నము చేయఁదొడఁగెను. ఇది తెలిసి సువర్చల తండ్రితో "తండ్రీ! నీవు ప్రాజ్ఞులలోఁ బ్రాజ్ఞుడవు. నాయెడ నమితవాత్సల్యముగలవాఁడవు కనుక, నా కొక్కకోరిక కలదు. అది తీర్పుము. నాభర్త యేకకాలముననే గ్రుడ్డివాఁడు, గ్రుడ్డివాఁడుకానివాఁడు గావలయును. అట్టివానినే నాకై వెదకు"మని చెప్పెను. దేవలుఁ డామె మాటలకు నవ్వి "తల్లీ! అట్టిపతిని నీకై నే నరయఁజాలను. ఉత్తము లగుఋషిపుత్త్రుల నెందఱనో యిటకు రప్పించెదను. నీవే వారిలో నీకుఁ గావలసినలక్షణములు గలవాని నేఱుకొ"మ్మని పలికెను. ఆమె యట్లే కా నిమ్మనెను.

పిదప, దేవలుఁడు శిష్యులం బిలిచి వేదవిదులు సదాచారసంపన్నులు, శీలయుతులు, యువకులు, సౌందర్యనిధులు, సత్సంప్రదాయయుతులు, బ్రహ్మచర్యవ్రతులు, వివాహేచ్ఛగలవారు నగువారిని బిలుచుకొని రం డని పంపెను. దేవలశిష్యు లాప్రకారము సర్వాశ్రమములందు దేవలుని యభిమత మెఱిఁగించి తమతోఁ గూడ నెందఱనో వటువులను దీసికొనివచ్చిరి.

దేవలుఁడు వా రందఱ నాదరించి కూర్చుండ నియమించి సుపుత్త్రి యగుసువర్చలకు వారినెల్లరఁ జూపి వారివారి గుణగణము లగ్గించి వలయువానిని వరింపు మని చెప్పెను. సువర్చల

ముందుకు వచ్చి "మహాత్ములారా ! మీలో నేకకాలమున నంధుఁడు, అంధుఁడు కానివాఁడు నున్నచో నాతఁడు నన్ను వివాహమాడ నర్హుఁడు. ఆతఁడే యుండిపోయి మిలిగిన వారెల్లరు పోవచ్చు"ననెను. ఆమెమాటలు విని యెల్లరు ఆశ్చర్యపోయి యామె వివేకహీన యనియు, దేవలు డామెమాటలు విని యట్లుచేయుట ధర్మమా యనియు ననుకొనుచు వెడలిపోయిరి. కాని, ఉద్దాలకుని పుత్త్రుఁడగు శ్వేతకేతుఁడు ముందుకు వచ్చి "కల్యాణి! నీవు కోరినట్టిలక్షణములను గలవాఁడను నేను, నేను గ్రుడ్డిని. గ్రుడ్డితనము లేనివాఁడను.నీవు నన్నుఁ జెట్టవట్టు" మనెను. సువర్చల "ఆర్యా ! నీ వెట్లు రెండు నగుదువో వివరింపు"మని కోరెను. అంత, శ్వేతకేతుఁడు "తరుణీ! ఏకఁటి చేతఁ బ్రపంచమును జూచుచు, ధర్మములు చేయుచు మనస్సు సంకల్పించుచు బుద్ధినిజము తెలియునో ఆత్మజ్ఞానమను ఆకన్ను లేనివాఁడు పుట్టుగ్రుడ్డివంటివాఁడు. ఏకన్ను భ్రాంతిసిలయము, నశ్వరము నగునో అజ్ఞాన మనుఆకన్ను లేనివాఁడను గాననేను గ్రుడ్డివాఁడను. ఆత్మానాత్మావివేకము గలజ్ఞాననేత్రమునాకుఁ గలదు. కాన,నేను గ్రుడ్డినికాను."అని పలికెను. సువర్చల యంగీకరించి తండ్రికి తనసమ్మతిఁ దెలిపెను. పిదప దేవలుఁడు విధ్యుక్తప్రకారము సువర్చలా శ్వేతకేతులకుఁ బరమవైభవోపేతముగా వివాహముచేసి యాశీర్వచనములతోఁ బంపివేసెను. సువర్చలా శ్వేతకేతులు బ్రహ్మజ్ఞానసంపన్నులై దివ్యమగు గృహస్థజీవనమును గడపి తుదకు మోక్షలక్ష్మిని గాంచిరి.*

---

*భారతము. శాంతిపర్వము.

# నరనారాయణమహర్షులు

## శౌనక నారాయణసంవాదము

తొల్లి శౌనకమహర్షి విష్ణురాతునివలన నాలుగు వేద
ములు నేర్చి వానియర్థము లెఱిఁగి తదనుష్ఠానక్రమములు తెలి
సికొని మహావిజ్ఞాని యయ్యెను. తరువాత నొకప్పు డాతఁడు
శిష్యసమేతుఁడై బయలుదేఱి దేశములు గడచి పుణ్యవనములు
దాఁటి శైలము లతిక్రమించి మేరుపర్వతప్రాంతమున కరిగి
యచట భోగవతీనదీతీరమునఁ బల్లవితములు కోరకితములు
పుష్పితములు నగునగములనడుమ విలసిల్లుచు, అనేకఫలవృక్ష
ములకు, మృగపక్షిసంతతులకు, సరోవరములకు నిలయమై, ముని
కుమారులతోఁగలిసి చదువుశుకపికశారికల వేదాంతవాక్యరచనా
విశేషములతో మనోహరమయి, అన్యోన్యవైరము లేక పర్ణశా
లాంగణముల యథేచ్ఛము సంచరించుమృగములచే నొప్పినదై
చిన్నమొక్కలకు లతాగుల్మములకుఁ బాదులు త్రవ్వి యందుఁ
బోయుటకు నీటికై పోయి జలపూరితము లగుకలశములఁ గొని
వచ్చుచు నుద్యానవనదేవతలో యననొప్పుయువతు లగుముని
కన్యలచేఁ గన్నులపండువై, వివిధయోగిజనసంకులము, హరిభక్త
సమేతము, సకలమంగళాశ్రయము, సర్వపుణ్యనిలయము నగు
నారాయణమహర్షి యాశ్రమమునకు విచ్చేసెను.

అప్పుడు నారాయణమహర్షి జపతపోధ్యానాదులు నిర
ర్తించి సుప్రసన్నుఁడై యుండి శౌనకునిపైఁ గటాక్షవీక్షణం

ములఁ బఱపి రమ్మని యాహ్వానించెను. శౌనకుఁడు వచ్చి సాష్టాంగనమస్కారములొనర్చి నారాయణమహర్షిని భక్తిభరితుఁడై స్తుతించి యాతనియనుజ్ఞఁ బడసి యిట్లడిగెను. "దేవా! నేను సర్వవేదశాస్త్రములు చదివితిని. కాని, అగాధములైన యందలియర్థములలోఁ బరమార్థ మెఱుఁగఁజాలకుంటిని. నాకు దయతో సంశయరహితమైన పరమవిజ్ఞానమును బోధింపు" మని యడిగెను. అంత, నారాయణమహర్షి శౌనకునకు బ్రహ్మ నారదునకు వినిపించినసర్వవిషయములు వినిపించెను. సర్వవేద సార మగుచక్రిమతము తేటపఱిచి హరిభక్తి తక్క నన్య మగు తరణోపాయము లే దని యాతఁడు బోధించెను.

శౌనకుఁడు పిదప నారదజన్మ మెఱిఁగింపు మని కోర నారాయణుఁ డిట్లు చెప్పెను. "విష్ణువు వామనావతారముఁ దాల్చి యొకపాదమున భూతల మెల్ల నాక్రమించి రెండవపాదమును సకలదిఙ్మండలమున సందులేకుండ నాకాశమునఁ జాచి యుండ బ్రహ్మ భక్తిపరవశుఁడై విష్ణుపాదముఁ గడుగ జలము తెచ్చుటకై తనమనసునుండి యొక్కని సృజించెను. జలము తెమ్మని యనుశాసించి తనకమండలువును బ్రహ్మ యాతనికిఁ జూపెను. ఆతఁడు వెంటనే ఆకమండలువుఁ గొని యేఁగి హేమపుష్కరిణినుండి జలమును దీసికొని వచ్చెను. బ్రహ్మ యాజలముతోఁ బురుషసూక్తమంత్రపఠనమున విష్ణుపాదముఁ గడిగెను. ఆపాదతీర్థము భూమిపైఁ బడకుండ శివుఁడు వచ్చి ఫాలభాగమున సంతోషముతో ధరించెను. నార మనఁగా నుదకము నారద అని బ్రహ్మ తనమానసపుత్రునితో ననెను. కాన నాతనికి నారదుఁ డని పేరువచ్చెను. ఆనారదుఁడు సరస్వతీదగ్గఱ

సంగీత మభ్యసించి వాయులోకమున కేఁగి వాయుదేవతాదత్త మగు మహతి యనువీణ ధరించి సర్వస్వరయుక్తముగా సర్వజన మనోహరముగా గానము చేసి తండ్రిని మెప్పించెను. బ్రహ్మ యానందించి నారదునకుఁ గోరినవిషయము లెల్లఁ దెల్పి యాత నికి విష్ణుభక్తి పాదుకొలిపి విష్ణుమంత్ర ముపదేశించి యాతనిని విష్ణుభక్తులలో నగ్రేసరు నొనరించెను."

వేదవిద్యాధికారము లేనివారికి ముఖ్యకర్మము లేవి యని శౌనకుఁ డడుఁగగా నారాయణమహర్షి యిట్లు చెప్పెను. "అట్టివారికి దానధర్మములు,సత్యవ్రతములు, వాపీకూపతటాక ప్రతిష్ఠ, వనదేవతాలయబ్రహ్మప్రతిష్ఠ, తనయుఁడు, కృతి యనుసప్తసంతానములు ముఖ్యకర్మములు. వారికి భూసురో పనయనవివాహాదికర్మముల సాయపడుట, స్వవిత్తమూలమున విప్రరక్ష చేయుట, విప్రుని ఆపత్తునుండి కాపాడుట, ఉపకరణ పూర్వకముగా విప్రునికి గృహము కట్టి యిచ్చుట ఇవి–బ్రహ్మప్ర తిష్ఠ లనఁబరగు – విష్ణుసదనప్రాప్తి నొసంగును. పుత్రుఁడు పున్నామనరకమునుండి రక్షించును. ఉత్తమకవియొక్క– ఉత్త మకృతిని గైకొన్నకృతిభర్తకుఁ బుణ్యలోకములు కలుగును. జ్ఞానమహత్త్వమును దెలుపుటకొఱకే వేదములు కర్మయోగ మును స్తుతించును. నీకుఁ దుదిమాట చెప్పెద వినుము. వే యేల ? విష్ణుస్మరణమే సర్వోత్తమధర్మము. విష్ణువే శాశ తుఁడు. విష్ణువే గతి. విష్ణుమూర్తియే తనభక్తుల కెల్లఁ గైవ మొసంగును. కావున, నితరచింతలు మాని విష్ణుమూర్తి యారాధింపవలయు.

నిత్యం డవ్యయుఁ డమలుం
డత్యంతము చక్రహస్తుఁ డాఢ్యుఁడు జగతిన్
సత్యం బిది సత్యం బిది
సత్యం బిది మునివరేణ్య ! సంశయరహితా!"

అని తెలిపెను. ఇది విని శౌనకుఁడు బ్రహ్మానందియై నిజాశ్రమమున కేఁగెను. ఈయావద్విషయము మత్స్యపురాణమునఁ గలదు.

---

iii

# పిప్పలాద మహర్షి

## పిప్పలాద మోక్షశాస్త్రము

పరమబ్రహ్మర్షి యైనపిప్పలాదుఁడు శిష్యులను గటాక్షించి వారికి మోక్షశాస్త్రము నిట్లుపదేశించెను. "మానవ శరీరము పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము నను నైదింటిచే నేర్పడి యీయైదింటితో నున్నది. గట్టిగ నుండుప్రదేశము పృథివి; ద్రవప్రదేశము జలము; వెచ్చగ నుండునది తేజము; సంచరించునది వాయువు; ద్వారమై యుండునది ఆకాశము. ఇందుఁ బృథివి ధరించుటకు, జలము ముద్దగాఁ జేయుటకు, తేజము రూపములఁ గనఁబఱుచుటకు, వాయువు పోవు-

టకు, ఆకాశము అవకాశము నొసఁగుటకు నుపయోగించుచున్నవి. మఱియు, త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు వరుసగా స్పర్శ, రూపము, శబ్దము, రసము, గంధము వీనియందును; వాక్పాణిపాదపాయూపస్థములు వరుసగా మాటాడుట, గ్రహించుట, నడచుట, విడుచుట, ఆనందించుట వీనియందును వర్తించుచున్నవి. బుద్ధి, మనస్సు, చిత్తము, అహంకారము, ఈనాలుగు వరుసగాఁ దెలిసికొనుట, నిశ్చయించుట, సంకల్పించుట, సంశయించుట; చక్కగా గ్రహించుట, గర్వించుట వీనియందు వర్తించుచున్నవి. మఱియు శరీరము తీపి, పులుపు, చేదు, ఉప్పు, కారము, ఒగరు అనుషడ్రసముల నాశ్రయించి, వాని కాశ్రయమై ఉండుట, కలుగుట, పెరుగుట, పక్వమగుట, తగ్గుట, నాశమొందుట అనుభావవికారము లాఱింటిచే వికారము నందుచున్నది. మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, ఆగ్నేయము, అనాహతము, విశుద్ధము అనుఆఱుచక్రములు వానివానినాడుల నాశ్రయించి దేహమున నుండును. కామక్రోధలోభమోహమదమాత్సర్యము లనుఆఱుదుర్గుణములు, శమము, దమము, తితిక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానము, అనుఆఱుసుగుణములు వానివాని నిష్ఠఁబట్టి దేహము నాశ్రయించి యుండును. షడ్జము, ఋషభము, గాంధారము, పంచమము, మధ్యమము, ధైవతము, నిషాదము అనుఇష్టానిష్టశబ్దసంజ్ఞ లేడును శుక్ల, రక్త, కృష్ణ, ధూమ్ర, పీత, కపిల, పాండురము లను ఏడుధాతువులు, వానివర్ణములు గలవు. రసమునుండి రక్తము, రక్తమునుండి మాంసము, మాంసమునుండి మేదస్సు, మేదస్సునుండి యెముకలు, ఎముకలనుండి మజ్జ, మజ్జనుండి పురుషునకు శుక్ల

ము స్త్రీకి శోణితము కలుగుచున్నవి. ఈశుక్లశోణితముల సంయోగమువలననే గర్భోత్పత్తి యగుచున్నది. తిన్నపదార్థములనుండి యగ్ని, అందుండి పిత్తము, అందుండి వాయువు, అందుండి హృదయము, బ్రహ్మానిర్మిత మైనరీతిని బోయి యవి చేరుచున్నవి. శుక్లశోణితసంయోగానంతర మొకరాత్రి గడచిన కలలము, ఏడుదినములకు బుద్బుదము, పదునైదుదినములకుఁ బిండము, మాసమునకుఁ గఠినము, రెండునెలలకు శిరస్సు, మూఁడుమాసములకు పాదములు, నాలుగుమాసములకు జఠరకటి ప్రదేశములు, ఐదునెలలకు వెన్నెముక, ఆఱునెలలకు ముక్కు, కన్నులు, చెవులు, ఏడవనెల ప్రాణము, ఎనిమిదవ నెల శరీరావయవము లన్నియు నేర్పడి తొమ్మిదవనెల సంచరించుచు, పిదపఁ బుట్టును. శుక్ల మధికమైనపుడు పురుషుఁడు శోణితమధికమైన స్త్రీ సంతతి కలుగును. సాధారణముగా స్త్రీ సంతతియే యధికమగును. కారణమునకుఁ దగినకార్యము కలుగుఁగాన. తలిదండ్రుల చిత్తవృత్తుల ననుసరించి వారికిఁ దగినశిశువులు కలుగుదురు. సంభోగసమయమునఁ జిత్తచాంచల్యము గలవారికి, చంద్రసూర్య గ్రహణవేళలఁ గూడెడివారికి, దేశకాల ద్రవ్యభోగములందలి లోపములనుబట్టి, ఆయా యా అవకరములుగల బిడ్డలు పుట్టుదురు. ఉచితకాల దేశాదులఁ గలిగినబిడ్డలు సత్సంతానముగాఁ బరిగణింపఁబడుదురు.

గర్భస్థ మగుశిశువు పంచభూతస్వరూపము సమర్థమునై పంచేంద్రియములతోఁ బంచతన్మాత్రల నెఱుంగుచున్నది. సుజ్ఞానమువలన ధ్యానమువలన ఓంకారమును జింతించును. పరబ్రహ్మస్వరూప మైనప్రణవమును దెలిసికొనుచుండును.

ఈ శరీరమునందుఁగల అష్టప్రకృతులు, షోడశ వికారములు తొమ్మిదవ నెలలలో సమగ్రము లగును. అప్పు డాజీవి తాను వెనుకటిజాతిని, కర్మమును, తెలిసికొనుచున్నది.

గర్భస్థ మగుజీవి అప్పు డిట్లు విచారించును. "అయ్యో! నేను లెక్కలేనన్ని స్త్రీమర్మావయవములను జూచితిని. వివిధాహారములను భుజించితిని. పెక్కురు స్త్రీలపాలు త్రాగితిని. సమస్తము జన్మభూమి, సమస్తభూమి స్మశానముకాఁగా నేను ఎనుబదిలక్షల యోనిభేదములందుఁ బుట్టితిని. పలుమఱు జన్మించుచు, పెక్కుసారులు చచ్చుచు, నిట్లు పుట్టుచావులతో నా కాలము గడచినది. తల్లికడుపున నున్నప్పుడు గొప్పదుఃఖము, జన్మమోహమున మఱింత దుఃఖము, బాల్యమున నింకింత దుఃఖము, ఇట్లు శోకపారవశ్యతలవలన మూఢత్వ మందితిని. యౌవనమున విషయాసక్తిచే సత్కార్యములు చేయక సోమరితనమున దుష్కార్యము లొనర్చి తాపత్రయములచేఁ జీకాకువడితిని. వార్ధక్యమున రోగము, బెంగలు అనుభవించి తుదకు మరణమునందితిని. ఆమరణవేళ విపరీతమైన భయము ననుభవించితిని. ఆశ, అభిమానము, తీవ్రకామము, క్రోధాదులు దీనివలనఁ బొందినకష్టనష్టము లిన్నిన్ని కావు.

జన్మమే దుఃఖకారణము. దుఃఖస్వరూపము. ఇది పరమ దుస్సహము. అని యెఱిఁగియు జన్మనివృత్తికై ధర్మముఁ గాని యోగజ్ఞానసాధనలేమియుఁ గాని చేయనైతిని. అక్కటా! దుఃఖసాగరమున మునిఁగి దీనికిఁ బ్రతీకారమే చేయఁజాలకుంటిని. అయ్యయ్యో! అజ్ఞాన మెంత దారుణము! కామక్రోధసంకటములెంత బాధాకరములు! వీనిని గాల్చి భస్మము చేయ

వలదా ? సంసార మనుసంకెళ్ళను బిండిపిండి చేయవలదా ? ఇందుకై సద్గురువుసేవ చేసి జ్ఞానము సంపాదించి సాంఖ్యయోగమును సమాశ్రయింపవలయుఁగదా ! ఈసారి, ఈయోని నుండి బయలువెడలి యట్లొనరించెదను. ఈపరి, భూమిపైఁ బడినతరువాత పాపనివృత్తికి మోక్షప్రాప్తికి ఈశ్వరుని శరణుచొచ్చెదను. ఈపట్టు జగదీశ్వరుని దప్పక సేవించెదను. ఈసారి ఈగర్భనరకమునుండి బయలుపడినతరువాత సర్వశక్తిమయుఁడు, చిదాత్ముఁడు, సర్వకారణకారణుఁడు, భర్గుఁడు, పశుపతి, రుద్రుఁడు, మహాదేవుఁడు, జగద్గురుఁడు నగుఈశ్వరుని శరణొందెదను. ఈపిదప, మహాతపస్సు చేసెదను. ఈగర్భవాసమునుండివెలువడిన పిదప, తప్పక అమృతపరుఁడు, ఆనందస్వరూపి, నారాయణుఁడు అనామయుఁడునగుభగవంతుని భజించితీరెదను. ఈముందు మూర్ఖుఁడుగాను. తప్పక వాసుదేవుని స్మరించిభజించి యాతనికృపకుఁ బాత్రుఁడనయ్యెదను. అయ్యయ్యో!ఇదివఱలో మూర్ఖుఁడనై యితరులకొఱకు శుభాశుభకర్మముల నొనరించితిని. వా రెవ్వరు కానరాకుండఁ బోయిరి. ఈదుఃఖము లన్నియు నేనే యనుభవించుచున్నాను. మొదట నాస్తికుఁడనై నేను జేయనిపాపములే లేవుకదా ! ఇఁకముందు ఆస్తికుఁడనై తప్పక దేవుని భజించెదను.”

ఇటు లనేకవిషయములు పలుమఱు స్మరించి దుఃఖించి నిర్వేదమును బొందియు గర్భస్థుఁ డగుజీవుఁడు అజ్ఞానము, కామము, కర్మము వీనివలన మరల మోహము నందును. ఇట్లేజీవి వందలకొలఁది స్త్రీయోనులయం దుండి బయలుపడినది. ఇప్పుడు మరల నింకొకయోనిద్వారమం దుండి తద్విమోచనకై పరితపించుచున్నది. విమోచనమందుటకు శక్తిలేనిదై యంత్ర

పీడ, అధికక్లేశము, ప్రసవవాయుపీడనము నంది బయటపడి వైష్ణవమాయ క్రమ్మఁగా నన్నియు మఱచి పోయి మరల నజ్ఞాన చేతస్కు మగుచున్నది. ఇట్లు పుట్టి భూమిపైఁ బడినతరువాత, వాతపిత్తశ్లేష్మము లనుధాతువుల న్యూనతాధికతలఁ బట్టి జీవి రోగగ్రస్త మగుచుండును.

మఱియు, మనస్సులో జ్ఞానాగ్ని, ఇంద్రియముల దర్శనాగ్ని, దహరమునఁ గోష్ఠాగ్ని అనుమూఁడగ్ను లున్నవి. (ప్రాణాపానములతోఁ గూడి తిన్నయన్నమును జీర్ణముచేయుచుండునది కోష్ఠాగ్ని. నేత్రములే దర్శనాగ్ని. హృదయమున దక్షిణాగ్ని, ఉదరమున గార్హపత్యాగ్ని, ముఖమున ఆహవనీయాగ్ని యుండును. కావున, పురుషుఁడు యజమానియై బుద్ధిని భార్యగను, సంతోషమును దీక్షగను, జ్ఞానేంద్రియములను యజ్ఞపాత్రలుగను, కర్మేంద్రియములను ఉపకరణములుగను జేసికొని ఆత్మయజ్ఞముఁ జేయవలయు. ఈశరీరము యాగముకొఱకే యాగమునుండి కలిగినది. ఈశరీరమునందు ముప్పదిరెండుదంతములు, పదునైదుసుషిరములు, పదునాలుగునాడీస్థానములు నూటయొనిమిదిమర్మములు, డెబ్బదిరెండునాడులు, గలవు. వీనిలో ఇడాపింగళాసుషుమ్నలు ప్రధానములు. నాలవది పురీతతి. ఐదవది జీవుఁడు. దేహమున సంచరించునట్లు చేయు వాయువు ప్రాణము. దీనివలననే శరీరమందలి సర్వాంగములు పనిచేయుచున్నవి.

పాకముచేయఁబడినరసము తల్లిగర్భమునందు నాడీద్వారమున గర్భాశయము చేరి పిదప శిశువుశిరఃకపాలముమూఁమునఁ బ్రవేశించి సుషుమ్నానాడినుండి గర్భకోశములో నున్న

జీవిప్రాణమును దృష్టిపఱచుచున్నది. ఈప్రాణవాయువును యోగముచే నిరోధించి భ్రూమధ్యమందున్న సుషుమ్నానాడి వఱకుఁ గొనిపోయినఁ బరమాత్మవస్తుదర్శన మగును.

ఈశరీరమున అంతర్యామిగా, అమృతముగా, ఆత్మసాక్షిగా నుండునది పురుషుఁడు. ఇతఁ డవిద్యచే నావరింపఁబడి జీవుఁ డగుచున్నాఁడు. వానికి మఱుఁగైయుండుఅజ్ఞానము బీజము. దానిమొలక అంతఃకరణము. దానిచెట్టు శరీరము. ఇది నశించునదే యని తెలిసికొని ముక్తిఁ గాంక్షింపవలెను. అది పొందినచో మరల జన్మమే యుండదు.

అట్లుగాక మూఢతవలన సంసారమగ్నులైనవారికి, నిత్యము మలమూత్రాదులందుఁ బెరుగుచు, వానినే తినుచుఁ ద్రాగుచు నందే నరకయాతన లనుభవించు పురుగువలె, ఈ శరీరములే మహానరకములై వారినిబట్టి పాలార్చుచు బహుదుఃఖ మగ్నుల నొనరించుచుండును. ఈపరిణామమును జాగ్రత్తగా నెఱిఁగిన బుద్ధిమంతుఁడు వైరాగ్యము నాశ్రయించి ఆత్మజ్ఞానము నంది మోక్షము నందును." ఇదియే గర్భోపనిషత్తు సారాంశము.

ఆంగిరసుఁ డగుశౌనకునకు భగవంతుఁ డగుపిప్పలాదుఁడు బ్రహ్మవిద్యయే వరిష్ఠ, బ్రహ్మప్రాప్తి కుపాయములు, అంతర్బాహ్యశిఖాదిలక్షణములు, నిర్విశేషబ్రహ్మస్వరూపము, ముముక్షువులకర్తవ్యములు అన్నవిషయములు సవిస్తరముగా బోధించెను. ఈవిషయము లన్నియుఁ బరబ్రహ్మోపనిషత్తునఁ గలవు.

ACC. NO-
19664